అమ్మ
రూ॥ 350/-
పేజీలు: 400


నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

## నేడు హైదరాబాద్‌లో క్యూబా సంఘీభావ సభ

సిపిఐ, సిపిఐ(ఎం) రాష్ట్ర పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో క్యూబా సంఘీభావ సభ జరుగుతుంది. ఈ సభలో క్యూబా కమ్యూనిస్టు పార్టీ అంతర్జాతీయ వ్యవహారాల విభాగాధిపతి ఎమిలియో లోజాడా ముఖ్య అతిథిగా ప్రసంగిస్తారు. సిపిఐ రాష్ట్ర నాయకులు వివిస్ బోస్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి జ్యోతి పాల్గొంటారు.

సంపుటి 08, సంచిక: 145 | శుక్రవారం | 25-04-2025 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# ఉగ్ర శిబిరాలు ధ్వంసం చేయండి

**పార్టీలకు అతీతంగా నాయకుల డిమాండ్**
**ఉగ్రవాదుల అణచివేతపై ప్రభుత్వం వెంటే ఉంటాం**
**అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాల భరోసా**
**ఉగ్రవాదంపై కఠిన చర్య తీసుకుంటామని ప్రభుత్వం హామీ**

**న్యూఢిల్లీ:** ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసేందుకు నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష సమావేశంలో పార్టీలకు అతీతంగా నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐతే అదేసమయంలో అంతర్గత భద్రతా వైఫల్య సమస్యను కూడా ప్రతిపక్ష నాయకులు ప్రధానంగా ప్రస్తావించారు. దక్షిణ కశ్మీర్ అనంతనాగ్‌జిల్లా పహల్గామ్ సమీపంలో పర్యాటకులను కాల్చి చంపిన ఉగ్రవాదుల మారణకాండపై ఢిల్లీలో గురువారం నాడు అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులు దేశ భద్రతకు అనుగుణంగా ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. ఉగ్రవాదులను అణచివేసేందుకు ప్రభుత్వం తీసుకునే చర్యలకు సంబంధించిన సమస్యపై ప్రభుత్వానికి అండగా నిలబడతామని పార్టీల నాయకులందరూ భరోసా ఇచ్చారు. సంక్షోభ సమయంలో జాతీయ ఐక్యతాముఖచిత్రాన్ని ప్రతిబింబింపజేయడంలో ఈ సమావేశం ఎంతగానో దోహదం చేసింది. ప్రభుత్వం తన అధికారిక వైఖరిని ప్రతిపక్షాలకు వివరించడమేకాకుండా, ప్రతిపక్షాలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను ఈ సమావేశంలో ప్రకటించారు. జరిగిన ఘటనపట్ల నాయకులు తీవ్ర ఆందోళన, ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్రవాదంపై కఠిన చర్యలు తీసుకుంటామని అఖిలపక్షసమావేశానికి అధ్యక్షత వహించిన రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్న నాయకులకు హామీ ఇచ్చారు. సంఘటన అనంతర పరిణామాలు, ప్రభుత్వ ఆలోచనావిధానం, తీసుకున్న నిర్ణయాలను రాజ్‌నాథ్‌సింగ్ పార్టీల నాయకులకు తెలియజేశారు. ఉగ్రవాద దాడి జరడానికి ప్రభుత్వం వైపు నుండి జరిగిన లోపాలను, లోపాలు తిరిగి తలెత్తకుండా గట్టి చర్యలు తీసుకుంటామని కేంద్ర హోంశాఖాధికారులు, ఇంటిలిజెన్స్ అధికారులు కూడా నాయకులకు వివరణ ఇచ్చారు. సమావేశం అనంతరం పార్లమెంటరీ వ్యవహారాలమంత్రి కిరెన్ రిజిజు సమావేశంలో వివరాలను మీడియాకు తెలియజేశారు. జమ్మూ కశ్మీరులో పరిస్థితులు ఇప్పుడిప్పుడే మారుతూ తరువాయి 2లో



జమ్ముకశ్మీర్‌లో పహల్గామ్‌లోని బైసారన్‌లో ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ మధ్య పరస్పరం చర్య, ప్రతిచర్యలు కొనసాగుతున్నాయి. బుధవారం కేంద్ర ప్రభుత్వ సిసిఎస్ సమావేశమై పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఐదు కీలక నిర్ణయాలు తీసుకుని వాటిని తక్షణ ప్రాతిపదికపై అమలులోకి తీసుకువచ్చింది. 1960లో పాకిస్థాన్‌తో చేసుకున్న సింధు జలాల ఒప్పందం రద్దు చేసింది. వాఘా సరిహద్దు మూసివేసింది. ప్రత్యేక వీసాల రద్దు, పాకిస్థాన్ దౌత్యకార్యాలయంలో సిబ్బంది సంఖ్యను 55 నుండి 30కి కుదించింది. పాకిస్థాన్ దౌత్యకార్యాలయాల్లో పనిచేసే సైనిక సిబ్బంది, దౌత్యాధికారులను అవాంఛిత వ్యక్తులుగా ప్రకటించి దేశం విడిచి వెళ్ళాలని చెప్పడంతోపాటు తాజాగా వైద్యపరమైన వీసాలతోపాటు పాకిస్థాన్ జాతీయులకు ఇచ్చిన అన్ని రకాల వీసాలను రద్దుచేస్తున్నట్లు భారత ప్రభుత్వం ప్రకటించింది. భారత పౌరులను పాకిస్థాన్‌లో పర్యటించవద్దని కూడా గట్టి ఆదేశాలు జారీ చేసింది. అయితే పాకిస్థాన్ ప్రతి చర్యలకు దిగింది. గురువారం పాకిస్థాన్ జాతీయ భద్రతాకమిటీ (ఎన్ఎస్‌సి) సమావేశం జరిగింది. అనంతరం ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. భారత్ తరహాలోనే ఈ సమావేశంలో షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం పలు నిర్ణయాలు తీసుకుంది. సింధుజలాల ఒప్పందాన్ని రద్దుచేసిన చర్యను తిప్పికొడతామని ప్రకటించింది. భారతదేశం దుస్సాహసం చేయకుండా దేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను రక్షించుకునేందుకు త్రివిధ దళాలూ పూర్తి శక్తిసామర్థ్యాలతో సన్నద్ధంగా ఉండాలని ఎన్ఎస్‌సి సమావేశం తీర్మానించింది. భారతదేశంలో చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు, ద్వైపాక్షిక ఒప్పందాలను రద్దుచేస్తున్నట్లు ప్రకటించింది. అదేవిధంగా 1972 జులై 2వ తేదీన ఇందిరాగాంధీ, జుల్ఫికర్ అలీ భుట్టో మధ్య కుదిరిన సిమ్లా ఒప్పందాన్ని కూడా రద్దుచేస్తున్నట్లు ప్రకటించింది. పాకిస్థాన్ గగనతలంలోకి భారతదేశ విమానాలకు ప్రవేశాన్ని నిషేధించింది. వాఘా సరిహద్దును మూసివేసింది.

## సింధుజలాల ఒప్పందం రద్దు యుద్ధచర్య

- ఎంతమూల్యమైనా చెల్లించి నీటి హక్కు సాధిస్తాం
- పాక్ ప్రకటన




ఇస్లామాబాద్ : సింధుజలాల ఒప్పందం రద్దును యుద్ధ చర్యగా పరిగణిస్తామని పాకిస్థాన్ ప్రటించింది. షెహబాజ్ షరీఫ్ (ప్రధానమంత్రి)అధ్యక్షతన గురువారం జరిగిన పాకిస్థాన్ జాతీయ భద్రతాకమిటీ (ఎన్ఎస్‌సి) సమావేశం అనంతరం ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. త్రివిధ దళాధిపతులతోపాటు కీలకమంత్రులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. భారత్ తరహాలోనే ఈ సమావేశంలో షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం పలు నిర్ణయాలు తీసుకుంది. సింధుజలాల ఒప్పందాన్ని రద్దుచేసిన చర్యను తిప్పికొడతామని ప్రకటించింది. భారతదేశం దుస్సాహసం చేయకుండా దేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను రక్షించుకునేందుకు త్రివిధ దళాలూ పూర్తి శక్తిసామర్థ్యాలతో సన్నద్ధంగా ఉండాలని ఎన్ఎస్‌సి సమావేశం తీర్మానించింది. పాకిస్థాన్ శాంతికి కట్టుబడి ఉంది, కానీ దేశ సార్వభౌమాధికారాన్ని, గౌరవ మర్యాదలను, చెక్కుచెదరని హక్కులను, భద్రతను ఉల్లంఘించడానికి ఎవ్వరినీ అనుమతించదని స్పష్టం చేసింది. భారతదేశంలో చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు, ద్వైపాక్షిక ఒప్పందాలను రద్దుచేస్తున్నట్లు ప్రకటించింది. అదేవిధంగా 1972 జులై 2వ తేదీన ఇందిరాగాంధీ, జుల్ఫికర్ అలీ భుట్టో మధ్య కుదిరిన సిమ్లా ఒప్పందాన్ని కూడా రద్దుచేస్తున్నట్లు ప్రకటించింది. పాకిస్థాన్ గగనతలంలోకి భారతదేశ తరువాయి 2లో


05

### ఉగ్రవాదులకు ఊహించని శిక్ష విధిస్తాం

- భూమిపై ఏమూలకు ఉన్నా వెంబడిస్తాం
- ప్రధాని మోదీ ప్రకటన


05

### మన గణతంత్ర విలువలపై నేరుగా జరిగిన దాడి

- పాకిస్థానే సూత్రధారి, ఇది పిరికిపంద చర్య
- దాడిని ఖండిస్తూ సిడబ్ల్యుసి సమావేశం తీర్మానం

### సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు అధికారికంగా 67 టిఎంసిల కేటాయింపు

- బ్యారేజీ నిర్మాణానికి సాంకేతిక అనుమతులు
- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క వెల్లడి

03

## ప్రపంచానికి దారిచూపేలా భారత్ సమ్మిట్

**నేడు హైదరాబాద్‌లో ప్రారంభం**

- రెండు రోజుల పాటు నిర్వహణ
- 100కు పైగా దేశాల నుంచి 450 మంది ప్రతినిధులు హాజరు
- సమ్మిట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే కీలక ఉపన్యాసం
- నేడు హైదరాబాద్ డిక్లరేషన్ ఆవిష్కరణ
- వివరాలు వెల్లడించిన ఉప ముఖ్యమంత్రి భట్టి




ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'భారత్ సమ్మిట్2025'ను ఈ నెల 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనుంది. ఈ సమ్మిట్‌లో ప్రపంచవ్యాప్తంగా 100కు పైగా దేశాల నుంచి 450 మందికి పైగా ప్రతినిధులు పాల్గొననున్నారు. అంతేకాకుండా 100కు పైగా ప్రగతిశీల రాజకీయ పార్టీలు, 40 నుంచి 50 మంది వరకు మంత్రులు, మరో 50 మంది వరకు ఎంపిలు, సెనేటర్లు ఈ సమావేశానికి హాజరు కానున్నారు. భారత్ సమ్మిట్‌లో అంతర్జాతీయ న్యాయం, సమానత్వం, ప్రగతిశీల సహకారం, ఆర్థిక న్యాయం, యువత–భవిష్యత్ రాజకీయాలు వంటి అంశాలపై ఉన్నతస్థాయి ద్వైపాక్షిక, సైద్ధాంతిక చర్చలు, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు ప్యానెల్ డిస్కషన్స్ జరుగుతాయి. ఈ నెల 25వ తేదీన సదస్సు మొదటి రోజు 'హైదరబాద్ డిక్లరేషన్'ను ఆవిష్కరించనున్నారు. సదస్సులో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ ప్రసంగిస్తారు. అర్జెంటినా విదేశాంగ మాజీ మంత్రి జోర్జ్ టయానా, కొలంబియా కార్మిక శాఖ మాజీ మంత్రి, సెనేటర్ క్లారా లోపెజ్ ఓబ్రెగాన్, స్వీడన్ విదేశాంగ మాజీ మంత్రి అన్ లిండె, క్యూబా కమ్యూనిస్టు పార్టీ తరువాయి 2లో




## దేశ భద్రతపై స్వార్థ రాజకీయాలొద్దు

- ఆర్టికల్ 370 రద్దు తరువాత కశ్మీర్‌లో ప్రశాంతత నెలకొందని ఊదరగొట్టింది
- ప్రజాప్రభుత్వం ఏర్పడినా రాష్ట్రస్థాయి అధికారాలు లేవు
- వక్ఫ్ చట్టంతో మతపరమైన విభజనకు కేంద్రం యత్నం
- సిపిఐ జాతీయ సమితి సమావేశంలో డి.రాజా

**తిరువనంతపురం :** జమ్ము కశ్మీర్‌లో టెర్రరిస్టుల హత్యాకాండ దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసిందని, దేశ భద్రతకు చేపట్టే చర్యల్లో స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు పాల్పడకుండా చూడాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ఆర్టికల్ 370 రద్దు తరువాత కశ్మీర్‌లో ప్రజా ప్రభుత్వం ఏర్పడినా, దానికి రాష్ట్ర స్థాయి అధికారాలు లేవని, యూనియన్ టెరిటరీగా ఉన్నదన్న వాస్తవాన్ని గుర్తించాలన్నారు. కశ్మీర్ సరిహద్దుల, దేశ భద్రత కేంద్ర ప్రభుత్వం, రక్షణ, హోం మంత్రిత్వ శాఖలే నిర్వహిస్తున్నాయని రాజా అన్నారు. ఆర్టికల్ 370 తరువాత కశ్మీర్‌లో ప్రశాంతత నెలకొన్నదని చెప్పిన బిజెపి ప్రభుత్వం పహల్గామ్ సంఘటన పట్ల ఏమి చెబుతుందని ఆయన ప్రశ్నించారు. సిపిఐ కేరళ రాజధాని తిరువనంతపురంలో రెండు రోజుల పాటు జరుగుతున్న సిపిఐ జాతీయ కౌన్సిల్ సమావేశం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొన్ని నిర్వహించిన బహిరంగ సభలో డి.రాజా ప్రసంగించారు. బహిరంగ సభకు కేరళ రాష్ట్ర సిపిఐ కార్యదర్శి బినోయ్ విశ్వం అధ్యక్షత తరువాయి 12లో




## ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు ప్రపంచ దేశాల చర్యలు

- పహల్గామ్ దాడి ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి
- ఎఐఎస్ఎఫ్ డిమాండ్
- ముష్కరుల దిష్టిబొమ్మ దగ్ధం, భారీ ర్యాలీ

ప్రజాపక్షం/ హైదరాబాద్

పహల్గామ్‌లోని పర్యాటకులను అతి కిరాతకంగా చంపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించేందుకు ప్రపంచ దేశాలు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో హిమాయత్‌నగర్ వద్ద ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హిమాయత్ నగర్ చౌరస్తా వద్ద ఉగ్రవాదుల దిష్టి బొమ్మను దగ్ధం చేయడంతో పాటు పహల్గామ్ ఘటనలో మరణించిన వారికి నివాళులు అర్పించారు. అనంతరం ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ పహల్గామ్‌లో ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ ఈ ఘటన అత్యంత విషాదకరమనీ, ఉగ్రవాదం అంతం కావాలంటే తరువాయి 2లో

## కర్రెగుట్టల్లో ... ఎదురుకాల్పులు

- ముగ్గురు మహిళా మావోయిస్టులు హతం
- గుట్టను చుట్టుముట్టిన భద్రతా బలగాలు
- మావోయిస్టు అగ్రనేత హిడ్మా కోసం గాలింపు

ప్రజాపక్షం/భద్రాచలం/నూగురు వెంకటాపురం

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా మీదుగా తెలంగాణలోని ములుగు జిల్లా వరకు ఆవరించి ఉన్న కర్రెగ్గుటల వద్ద జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు గురువారం ప్రకటించారు. సోమవారం నుండి కర్రెగుట్టలను ఛత్తీస్‌గఢ్ పోలీసులు, సిఆర్‌పిఎఫ్, డిఆర్‌జి, ఎస్‌టిఎఫ్, తెలంగాణ పోలీసులు బలగాలు సుమారు 10,000 తరువాయి 2లో



## రాష్ట్రంలో 'హై అలర్ట్'

- పహల్గామ్‌లో ఉగ్రదాడితో అప్రమత్తం చేసిన కేంద్రం
- హైదరాబాద్‌లో తనిఖీలు
- అదుపులోకి అనుమానాస్పద వ్యక్తులు
- విమానాశ్రయాలు, బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్ల వద్ద గట్టి నిఘా

ప్రజాపక్షం/హైదరాబాద్



పహల్గామ్ ఉగ్రదాడుల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రానికి హై అలర్ట్ ప్రకటించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. కేంద్ర నిఘా వర్గాలు చేసిన హెచ్చరికలతో తెలంగాణ పోలీసు శాఖ అప్రమత్తం అయింది. పహల్గామ్ దాడిలో 26 మంది మరణించిన విషయం తెలిసిందే. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఎక్కడికక్కడ తనిఖీలు చేపట్టాలని, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకోవాలని ఇంటెలిజెన్స్ వర్గాలు పేర్కొన్నాయి. తెలంగాణ సహ ఉగ్రవాద ప్రభావిత రాష్ట్రాలన్నిటికీ గురువారం కేంద్ర నిఘా వర్గాలు ఈ హెచ్చరికలు జారీ చేశాయి. ముఖ్యంగా శంషాబాద్ విమానాశ్రయంతో పాటు రైల్వే స్టేషన్‌లు, బస్‌స్టేషన్‌లు, రద్దీ ప్రాంతాలు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్ల వద్ద మరింత నిఘా పెంచారు. ఈ మేరకు పెట్రోలింగ్ పోలీసులను పెంచారు. రాత్రి వేళలో రహదారులపై ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## విజయవంతంగా బయలుదేరిన ముగ్గురు చైనా వ్యోమగాములు

**బీజింగ్ :** చైనా సొంత అంతరిక్షకేంద్రం ''తియాంగాంగ్''కు గురువారం నాడు ముగ్గురు వ్యోమగాములు విజయవంతంగా బయలుదేరి వెళ్ళారు. చైనా మానవ సహిత అంతరిక్ష ప్రయోగాలలో భాగంగా షెంజౌ–20 నౌక 35వసారి అంతరిక్షానికి వెళ్ళింది. 'చైనా స్పేస్ డే' సందర్భంగా ఈ ప్రయోగం జరిగింది. 1970 ఏప్రిల్ 24న తొలి ఉపగ్రహం డాంగ్‌ఫాం ఘోంగ్–1ను చైనా ప్రయోగించింది. ఏప్రిల్ 24ను స్పేస్ డే గా 2016 నుండి చైనా పాటించడం ప్రారంభించింది. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం మూడు గంటలకు వాయువ్య చైనాలోని జియుక్వాన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుండి షెంజౌ–20 అంతరిక్ష నౌకలో ఈ ముగ్గురు వ్యోమగాములూ బయలుదేరారు. కమాండర్ చెంన్ డాంగ్ సారథ్యంలో చెన్ జోంగ్రూయ్, వాంగ్‌జీలు 'తియాంగాంగ్' అంతరిక్ష కేంద్రానికి వెళ్ళి బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆరునెలలుగా అక్కడ పరిశోధనలు చేస్తున్న ముగ్గురు వ్యోమగాములు ఈనెల 29న భూమికి తిరిగి వస్తారు.

## ఇక ఆపండి : పుతిన్‌పై ట్రంప్ అసహనం

### కీవ్‌పై రష్యా దాడిలో 8 మంది మృతి




**కీవ్ :** ఉక్రేన్ రాజధాని కీవ్‌పై రష్యా చేసిన డ్రోన్ల దాడిలో ఎనిమిదిమంది ప్రజలు మరణించారు. మరో 77 మంది గాయపడ్డారు. శాంతి చర్చలకు అంగీకరించాలని అమెరికా తన త్తిడిని తీవ్రతరం చేస్తున్న తరుణంలో రష్యా ఈ డ్రోన్ల దాడి చేసింది. గడచిన జులై నుండి కీవ్‌లో జరిగిన అతిపెద్ద దాడి ఇదే. ఐతే ఈ దాడి తనకు నచ్చలేదనీ, తాను ఎంతమాత్రం సంతోషంగా లేననీ అమెరికా అధ్యక్షుడు డోనాల్ ట్రంప్ అన్నారు. తక్షణం దాడులు ఆపేయాలని రష్యాను కోరారు. అదేవిధంగా దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మాట్లాడుతూ, పుతిన్‌పై మరింత ఒత్తిడి పెంచాలని కోరారు. ఉక్రేన్ సమస్య పరిష్కారాన్ని కోరుతూ దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రామఫోసా గురువారంనాడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌లతో ఫోన్‌లో సంభాషించారు. ఒకవైపు ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ దక్షిణాఫ్రికా పర్యటనలో ఉండగానే రామఫోసా ట్రంప్‌తో ఈ రాయబారం చేశారు. గతవారంతో ఆయన పుతిన్‌తో మాట్లాడారు. యుద్ధ విరమణకు కలిసి పనిచేద్దామని ట్రంప్–పుతిన్ ఇద్దరూ రామఫోసాకు చెప్పారు. దక్షిణ ఆఫ్రికా పర్యటనలో ఉన్న ఉక్రేన్ అధ్యక్షుడు వి.జెలెన్‌స్కీ ఈ ఘటనతో పర్యటనను కుదించుకుని హుటాహుటిన ఉక్రేన్‌కు చేరుకున్నారు. ఆఫ్రికాఖండంలో రష్యాకు వ్యతిరేకంగా జెలెన్‌స్కీ ఉక్రేన్ అనుకూల అభిప్రాయాన్ని కూడగట్టడంలో ఈ పర్యటన ఎంతో కీలకమైనదిగా ఆయన భావించారు. తన పర్యటన కుదించుకుని తిరుగు ప్రయాణం కావడానికి ముందుగా ఆయన దక్షిణ ఆఫ్రికా అధ్యక్షుడు రామఫోసాతో చర్చలు జరిపారు. అనంతరం వారిద్దరు గురువారం మధ్యాహ్నం ప్రిటోరియాలో ఉమ్మడిగా పత్రికాగోష్టిలో మాట్లాడారు. ఉక్రేన్ సమస్యపై ట్రంప్‌తో తాను మాట్లాడారనీ, రష్యా–ఉక్రేన్ మధ్య యుద్ధం అనివార్యంగా ముగిసిపోవాల్సిన అవసరం ఉందని రామఫోసా అన్నారు. రెండు దేశాలమధ్య ద్వైపాక్షిక సంబంధాలకు ఈ పర్యటన దోహదం చేస్తుందని రామఫోసా అన్నారు. దక్షిణ ఆఫ్రికాతో దెబ్బతిన్న సంబంధాల పునరుద్ధరణకు జెలెన్‌స్కీ ఉపక్రమించారు. 2019లో అధ్యక్ష బాధ్యతలు తీసుకున్న తర్వాత దక్షిణాఫ్రికాలో జెలెన్‌స్కీ పర్యటించడం ఇదే మొదటిసారి. కానీ ఆయన తన పర్యటనను ఉక్రేన్‌లో రష్యా దాడులవల్ల అర్థాంతరంగా మధ్యలోనే ముగించుకున్నారు.

**చర్చలకు అడ్డుపడుతున్న జెలెన్‌స్కీ : ట్రంప్**

ఉక్రేన్‌లో యుద్ధ నివారణకు జరిగే శాంతి చర్చలకు జెలెన్‌స్కీ అడ్డు పడుతున్నారని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విమర్శలు చేసిన కొద్ది గంటల తర్వాత రష్యా డ్రోన్లు కీవ్ పట్టణంపై దాడులు చేశాయని యూరప్ వార్తా కేంద్రాలు పేర్కొన్నాయి. జెలెన్‌స్కీ శాంతి చర్చకు మోకాలడ్డుతున్నారని ట్రంప్ విమర్శించారు. క్రిమియాను రష్యా భూభాగంగా గుర్తించే విషయాన్ని కూడా శాంతి చర్చల్లో పొందుపరచాలన్న ట్రంప్ ప్రతిపాదనను జెలెన్‌స్కీ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. దీంతో శాంతి చర్చల తోవను వదిలిపెట్టి జెలెన్‌స్కీ తప్పుడు మార్గంలో ప్రయాణం చేస్తున్నారని ట్రంప్ విమర్శించారు. ''నీ కన్నా ఎక్కువ శక్తిమంతమైన దేశంతో నువ్వెందుకు యుద్ధానికి దిగావ్?'' అని ఒక దశలో ట్రంప్ జెలెన్‌స్కీపై విరుచుకుపడ్డారు. జెలెన్‌స్కీ నష్టాన్ని భరించాల్సిందేననీ, రాజీ పడాల్సిందేననీ ట్రంప్ గట్టి నిర్ణయంతో ఉన్నారు.

## మూడో ప్రపంచయుద్ధమే : రష్యా హెచ్చరిక



**మాస్కో :** ఉక్రేన్‌కు శాంతి దళాలను పంపిస్తే మూడో ప్రపంచయుద్ధమే వస్తుందని రష్యా జాతీయ భద్రతామండలి కార్యదర్శి సెర్గీ సోయిగు హెచ్చరించారు. ఉక్రేన్‌లో కాల్పుల విరమణకు, శాంతి చర్చలకు రష్యాసిద్ధంగా ఉందనీ, కానీ ఆచరణాత్మక వాస్తవాలను, రష్యా ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని యుద్ధ సమస్య మూల కారణాలను పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. టాస్ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో గురువారం ఆయన మాట్లాడుతూ, యూరప్‌లో ఉక్రేన్‌కు సంపూర్ణ మద్దతు ఇచ్చి ఆయుధాలు సమకూరుస్తున్న ''ఇష్టపడేవారి కూటమి'' ఇటీవల తరచు సమావేశాలు నిర్వహించి శాంతి చర్చల అనంతరం ఉక్రేన్‌కు శాంతి దళాలను పంపిస్తామని తీర్మానించాయి. దీనిని రష్యా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. రష్యా పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో నాటో కూటమి గడచిన సంవత్సరకాలంగా తన సైనిక మౌలిక సదుపాయాలను రెండున్నర రెట్లు ఎక్కువగా పటిష్టం చేసుకుందని షోయిగు చెప్పారు. కేవలం పది రోజుల వ్యవధిలో 1,00,000 మంది సైనికులను వేగంగా తరలించేందుకు నాటో ప్రణాళిక చేసిందనీ, 30 రోజుల్లో 3,00,000 మంది సైనికులను, 180 రోజుల్లో 8,00,000 మంది సైనికులను ఈ ప్రాంతంలో మోహరించేందుకు కొత్త యుద్ధ పరివర్తన వ్యూహవ్యవస్థను సిద్ధం చేసిందన్నారు. గడచిన రెండు సంవత్సరాలలో బాహాటంగా జరిగిన విన్యాసాలలో నాటో ఈ శక్తిసామర్థ్యాల పరీక్షలు చేసి చూసిందన్నారు. నార్వే, బెల్జియం, నెదర్లాండ్స్ దేశాలు తమ గగనతల వ్యవస్థలను ఆధునిక సాంకేతిక యుద్ధ వ్యవస్థలతో పునర్వ్యవస్థీకరిస్తున్నాయన్నారు. లాత్వియా, ఎస్తోనియా,లిథుయేనియా వంటి బాల్టిక్ దేశాలు పశ్చిమ దేశాల నిధులతో తమ ప్రాంతాలలో సైనిక స్థావరాలు అభివృద్ధి చేస్తున్నాయని, ఇదంతా ఎవవరికోసమని ఆయన ప్రశ్నించారు. ఉక్రేన్‌కు నాటో కూటమి సభ్యత్వం ఇవ్వకూడదనీ, శాంతి ఒప్పందం అనంతరం చరిత్రాత్మకంగా రష్యాతో బలమైన బంధం పెనవేసుకున్న ఉక్రేన్ సాంస్కృతిక,చారిత్రక ప్రదేశాలకు శాంతి దళాల పేరుతో కూటమి సైన్యాలను పంపించే ఆలోచనలను రష్యా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ మూడు విషయాల్లో ట్రంప్ మాటతప్పుతారన్న సందేహాలు రష్యాలో మిగిలి ఉన్నాయి. దీంతో ట్రంప్ ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఉక్రేన్‌తో శాంతి చర్చలకు రష్యా సుముఖత వ్యక్తం చేసేందుకు తీవ్ర జాప్యం చేస్తున్నది. ఈ పూర్వరంగంలో సెర్గీ షోయిగు మాట్లాడుతూ, శాంతి దళాల ముసుగులో యూరప్ ఉమ్మడి సైన్యాన్ని గనుక రష్యా సరిహద్దుల సమీపంలోకి పంపితే యూరప్–రష్యా మధ్య ప్రత్యక్ష యుద్ధానికి దారితీస్తుందని, ఈ యుద్ధం ఇక మూడో ప్రపంచయుద్ధమే అవుతుందని హెచ్చరించారు. వివేకవంతులైన యూరప్ రాజకీయ నాయకులు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని ఆయన కోరారు. శాంతి దళాల పేరుతో ఉక్రేన్‌లో తిష్ఠవేసే యూరప్ ఉమ్మడి సైన్యాలు ఇక ఉక్రేన్‌లో ఉన్న అత్యంత విలువైన ఖనిజ వనరుల నిక్షేప ప్రాంతాలను తమ అధీనంలోకి తెచ్చుకుని గుత్తాధిపత్యం చెలాయిస్తామని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నిజంగా ఇదంతా జరిగితే యూరప్ సైన్యాలు ఉక్రేన్‌లో ప్రస్తుతం ఉన్న జెలెన్‌స్కీ నాజీ పరిపాలనకు పూర్తి మద్దతు ఇస్తాయని, ఉక్రేన్‌లోని రష్యా చారిత్రక ప్రదేశాల్లో, సరిహద్దు రాష్ట్రాలలో రష్యా భాష మాట్లాడే వారిపైన, వారి సంస్కృతిపైనా అణచివేత చర్యలు ప్రారంభిస్తారని, రష్యాతో కయ్యానికి కాలు దువ్వుతారని ఆందోళన వ్యక్తం చేశారు.

## ఖతార్ కృషితో కాంగోలో మైలురాయి ఘట్టం



ప్రభుత్వం – ఎం23 కాల్పుల విమరణ ఒప్పందం

**కిన్షాషా :** అంతర్యుద్ధంతో అతలాకుతలమవుతున్న సెంట్రల్ ఆఫ్రికా దేశం డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో మైలురాయివంటి కీలకపరిణామం సంభవించింది. డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో ప్రభుత్వం–ఎం–23 దళాలమధ్య కాల్పుల విరమణ అంగీకారం కుదిరింది. శత్రుత్వాన్ని విడిచిపెట్టాలని రెండు వర్గాలు నిర్ణయించాయి. రాబోయేరోజుల్లో ఎం–23 తిరుగుబాటు దళాలతో డి.ఆర్.కాంగో ప్రభుత్వం చర్చలు ప్రారంభించన్నుది. ఈ చర్చలు తుదిదశకు వచ్చేవరకూ, చర్చల్లో ఒక శాశ్వత ఒప్పందం కుదిరేవరకూ కాల్పుల విరమణను అమలు చేయాలని ప్రభుత్వంతోపాటు ఎం–23 కూడా అంగీకరించింది. ఈ మేరకు ఈ రెండు వర్గాలకు చెందిన ప్రతినిధులు ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేయడం కాంగో చరిత్రలో మైలురాయి ఘట్టంగా మారింది. ఒక సమస్య పరిష్కారానికి ఒక శాశ్వత ఒప్పందం దిశగా కలిసి కృషి చేయాలని ప్రభుత్వం–ఎం 23 నిర్ణయించాయి. ఖతార్ మధ్యవర్తిత్వం ద్వారా ఆకస్మికంగా ఈ రెండు వర్గాలమధ్యా ఈ అంగీకారం కుదిరింది. కలిసి ఒక ఉమ్మడి ప్రకటన కూడా విడుదల చేశాయి. ఐతే 2021 నుండి ఇప్పటివరకూ జరిగిన చరిత్రను పరిశీలిస్తే ఈ ఒప్పందం ఎంతవరకూ ఫలితాలనిస్తుందన్న సందేహాలు కూడా తలెత్తుతున్నాయి. గడచిన ఐదు సంవత్సరాలలో డి.ఆర్.కాంగోకు, ఎం–23కి మధ్య ఐదుసార్లు కాల్పుల విరమణ ఒప్పందాలు జరిగాయి. వాటి ఉల్లంఘనలవల్ల వైఫల్యాలు జరిగాయి. ఇప్పుడు ఆరోసారి ఈ ఒప్పందం జరిగింది.

## అమెరికాతో చర్చలకు చైనా తిరస్కృతి

**బీజింగ్ :** ఎడాపెడా పెంచి బెదిరింపులు చేస్తున్న అమెరికా వైఖరితో చైనా విసిగివేసారిపోయింది. సుంకాలపై అమెరికాతో చర్చలను తిరస్కరించింది. ఈ విషయంలో ద్వైపాక్షిక చర్చల్లో పురోగతి సాధిస్తామనడానికి ఎలాంటి ఆచరణాత్మక ఆధారాలు కనిపించడంలేదని చైనా విమర్శించింది. చైనా–అమెరికా మధ్య ఇప్పటివరకూ సుంకాలపై ఎలాంటి చర్చలు జరగలేదని చైనా విదేశీ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి గుయో జియాకున్ గురువారంనాడు మీడియాకు చెప్పారు. అమెరికా వైఖరి చాలా స్థిరంగా, మొండిగా ఉందని, చాలా స్పష్టంగా ఉందని, అందువల్ల చర్చలకు తావులేదన్నారు. ఐతే తమ తలుపులు ఎప్పుడూ తెరచే ఉంటాయన్నారు. చర్చలవల్ల వచ్చే ఫలితాల్లో సమాన గౌరవం, పరస్ప ప్రయోజనాలు నెరవేరాలన్నారు. ఒకవేళ చర్చలు జరిగితే అలాంటి ప్రాతిపదికపైనే చర్చలు జరగాలన్నారు. అమెరికా ప్రభుత్వమే ప్రపంచంపై టారిఫ్ యుద్ధం ప్రారంభించిందన్నారు. అమెరికాకు లొంగిపోయి, తమ ప్రయోజనాలు పణంగా పెట్టి నష్టపోవద్దని దేశాలను ఆయన హెచ్చరించారు. కాగా, చైనాపై సుంకాలు చాలా ఎక్కువగా ఉన్నాయనీ, రాబోయేరోజుల్లో ఈ సుంకాలు గణనీయంగా తగ్గుతాయని చైనా తాజాగా మాట మార్చడంపై ప్రశ్నించగా చైనా వాణిజ్యమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి యాండాంగ్ స్పందిస్తూ, ముడి వేసినవారే ఈ చిక్కును విడదీయాలన్నారు. ఇదిలా ఉండగా, ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సమావేశంలో బుధవారం నాడు అమెరికా–చైనా ప్రతినిధులమధ్య సుంకాలపై వాగ్వాదం జరిగింది. అమెరికా తన ఇష్టానుసారంగా సుంకాలు విధించి అన్ని దేశాలను ఇబ్బందులపాలు చేస్తోందని, సుంకాల ఆట ఆడుతోందని చైనా ప్రతినిధి విమర్శించారు. ప్రపంచ వాణిజ్యసంస్థ నిబంధనలు ఉల్లంఘించిందన్నారు. దీనిపై అమెరికా ప్రతినిధి స్పందిస్తూ, అనేక సంవత్సరాలుగా చైనా అన్యాయంగా సుంకాలపేరుతో తమ దేశాన్ని దోచుకుంటున్నదని విమర్శించారు.




## ప్రపంచ దేశాలు చర్యలు
(మొదటి పేజీ తరువాయి)

ఉగ్ర మూకలను కఠినంగా శిక్షించాలన్నారు. దేశ సమగ్రతను సమైక్యతను పరిరక్షించడానికి కేంద్ర ప్రభుత్వం, జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వం సమన్వయంతో ఉగ్రవాదులను ఏరివేత చేపట్టాలని, భవిష్యత్తులో దేశంలో ఎక్కడ ఉగ్ర దాడులు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు. ఉగ్ర మూకలు కాశ్మీర్ ప్రాంతంలో ఎక్కడ దాగి ఉన్న వెంటాడి శిక్షించాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడకుండా ఉగ్రవాదులకు, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్ కు గట్టి బుద్ధి చెప్పాలన్నారు. మరణించిన కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్యార క్రాంతి, రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సామిడి వంశోవర్ధన్ రెడ్డి, ఎండి అన్వర్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చైతన్య యాదవ్, రాష్ట్ర నాయకులు అరుణ్, హరీష్, జ్ఞానేశ్వర్, అశ్విన్, వెంకటేష్, ఉదయ్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

## భారత్ సమ్మిట్ (మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయ వ్యవహారాల హెడ్ ఎమిలియో లొజాడా, మలేషియా న్యాయ శాఖ మంత్రి ఎం.కుల సేగరన్లతో పాటు దేశంలోని ప్రముఖ రాజకీయ పార్టీ నాయకులు దిగ్విజయ్ సింగ్, పవన్ ఖేరా, సుప్రియా శ్రీనాటె, సల్మాన్ ఖుర్షీద్, జ్యోతిమణి తదితరులు సదస్సుకు హాజరు కానున్నారు. ప్రపంచానికి దారి చూపే విధంగా 'భారత్ సమ్మిట్ –2025' నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. భారత్ సమ్మిట్ –2025 అనేది చరిత్రలో నిలిచిపోతుందని, భారత్ సమ్మిట్ –2025కు తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎఐసిసి కార్యదర్శి గురుపాల్‌సింగ్ సఫల్, రాష్ట్ర మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గురువారం మీడియాతో వివరించారు. భారత్ సమ్మిట్ ద్వారా తెలంగాణకు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని, సమ్మిట్ నిర్ణయాలను తెలంగాణలో అమలు చేస్తామని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచ ప్రతినిధులకు పరిచయం చేస్తామని మల్లు భట్టివిక్రమార్క చెప్పారు. ప్రపంచంలో భౌగోళిక, రాజకీయ, ఆర్థిక, ప్రజాస్వామికంగా పెను మార్పులు సంభవిస్తున్న ప్రస్తుత తరుణంలో ప్రభుత్వం తొలిసారిగా ఈ సదస్సును నిర్వహిస్తుందన్నారు. కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్‌గాంధీ స్వప్నమైన 'న్యాయ్'ను ప్రతిబింబించేలా ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలపై చర్చలు ఉంటాయన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి నిర్దేశించిన 'తెలంగాణ రైజింగ్'పై కూడా చర్చిస్తామని తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టడంపై అంతర్జాతీయ ఇన్వెస్టర్లు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వివరిస్తామన్నారు.




భారత్ సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలించిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని హెచ్ఐసిసి నోవాటెల్ హోటల్‌లో రెండు రోజుల పాటు జరుగనున్న 'భారత్ సమ్మిట్' ఏర్పాట్లను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ నటరాజన్ మీనాక్షి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గురువారం పరిశీలించారు.ప్రతినిధుల సమావేశం హాల్, కాన్ఫరెన్స్ హాల్, జస్టిస్ హాల్, లిబర్టీ హాల్, ఫోటో ఎగ్జిబిషన్, రిసెప్షన్ ఎదురుగా చరకాలపై నూలు వడుకుతున్న మహాత్మా గాంధీ విగ్రహాన్ని పరిశీలించారు.

## పోలీస్ కుటుంబాల నుండి సివిల్స్‌కు ఎంపికైన ముగ్గురు

### అభినందించిన డిజిపి డాక్టర్ జితేందర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలీస్ సిబ్బంది కుటుంబాల నుండి సివిల్ సర్వీసెస్ కు ఎంపికైన ముగ్గురిని రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ ఐపిఎస్ అభినందించారు. రాష్ట్ర డిజిపి కార్యాలయంలో గురువారం నాడు జరిగిన కార్యక్రమంలో వీరికి మెంటార్ గా వ్యవహరించిన శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్‌తో పాటు సిఐడి డి.జి శిఖా గోయల్ ఐపిఎస్, అడిషనల్ డిజిపి అనిల్ కుమార్ ఐపిఎస్, ఐజిపీలు ఎం రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సివిల్ సర్వీసెస్ లో 68వ ర్యాంకు సాధించిన జె. సాయి చైతన్య తండ్రి జె.గోవిందు డిచ్ పల్లీలో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తుండగా, 225 ర్యాంకు పొందిన ఏ .కౌశిక్ నరసింహ తండ్రి ఏ.వేణుగోపాల్ డిజిపి కార్యాలయంలో డిఎస్‌పిగా పనిచేస్తున్నారు. 779 ర్యాంకు పొందిన టి .సూర్య తేజ తండ్రి టి .కరుణాకర్ అసెంబ్లీలో చీఫ్ మార్షల్ గా పనిచేస్తున్నారు. పోలీస్ శాఖలో పనిచేస్తున్న సిబ్బంది కుమారులు సివిల్ సర్వీసెస్ కు ఉత్తమ ర్యాంక్ లతో ఎంపిక కావడం సంతోషం అని, భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే సేవ చేయాలని డిజిపి సూచించారు.వీరికి మెంటార్ గా వ్యవహరించిన అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్ మాట్లాడుతూ... 68 ర్యాంకు పొందిన జె .సాయి చైతన్య తండ్రి జె. గోవిందు తాను అదిలాబాద్ జిల్లా ఎస్పీగా ఉన్నప్పుడు తన దగ్గర పని చేశారని, వారి అబ్బాయికి మంచి ర్యాంకు రావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఇతనితో పాటు టి సూర్య తేజకు కూడా తాను గత సంవత్సరం మెంటార్ గా ఉన్నానని అప్పుడు వారు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ కి ఎంపిక అయ్యారని వివరించారు.

## ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల ఓట్ల లెక్కింపుకు అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. జిహెచ్‌ఎంసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుందని ఆయన వెల్లడించారు. ఇందుకు సంబంధించి సిబ్బందితో పాటు అవసరమైన భద్రతా ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. అంతకు ముందు ఎన్నికల పరిశీలకులు సురేంద్రమోహన్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. బ్యాలెట్ బాక్స్‌ల భద్రత, వీడియో రికార్డింగ్, సెక్యూరిటీ వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపుకు ప్రత్యేక కౌంటింగ్ టేంటింగ్, సిసికెమెరాలు, పోలీసుబందోబస్తు ఏర్పాటును పరిశీలించారు. ఓట్ల లెక్కింపు పారదర్శకంగా ఎన్నికల నిబంధనల మేరకు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతాయారు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ధ్వంసం చేయండి (మొదటి పేజీ తరువాయి)

ఆర్థిక వ్యవస్థ కూడా పుంజుకుంటున్న తరుణంలో ఉగ్రవాదులు దాడిచేసి దెబ్బతీశారు. ఆమ్‌ఆద్మీపార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడు సంజయ్‌సింగ్ మాట్లాడుతూ, ఉగ్రవాద శిబిరాలన్నింటినీ ధ్వంసం చేయాలని అఖిలపక్ష సమావేశంలో నాయకులు అందరూ పార్టీలకు అతీతంగా ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపి సుదీప్ బందోపాధ్యాయ మాట్లాడుతూ, భద్రతా వైఫల్య సమస్యను కూడా చర్చించాల్సిన అవసరం ఉందని కానీ, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ప్రభుత్వానికి అండగా నిలబడతామని ప్రతిపక్షాలు భరోసా ఇచ్చాయని చెప్పారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించడంలో యావత్ భారతజాతీ సమైక్యంగా నిలబడాల్సిన అవసరం ఉందని బందోపాధ్యా అన్నారు. తొలుత ఈ సమావేశంలో ప్రభుత్వం పహల్గామ్‌లో ఉగ్రవాదులు చేసిన కాల్పుల మారణకాండకు సంబంధించిన అన్ని వివరాలను పార్టీల నాయకులకు వివరించింది. ఉగ్రవాదులు చేసిన కాల్పుల్లో ఇద్దరు విదేశీయులు సహా 26 మంది పర్యాటకులు మరణించారని తెలియజేసింది. సమావేశ ప్రారంభానికి ముందుగా పాల్గొన్న నాయకులు అందరూ ఒక్క నిమిషం మౌనం పాటించి మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబాలకు తీవ్ర సంతాపం ప్రకటించి సానుభూతి తెలియజేశారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, కేంద్రహోం మంత్రి అమిత్ షా, విదేశీ వ్యవహారాలమంత్రి ఎస్.జైశంకర్, ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్, కిరెన్ రిజిజు ప్రభుత్వం తరపున అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్నారు. రాజ్యసభా నాయకుడు జె.పి.నడ్డా, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జునఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ సమావేశంలో పాల్గొన్నారు. రాజ్‌నాథ్ సింగ్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. సుప్రియాసూలే (ఎన్‌సిపి–ఎస్‌పి), ప్రఫుల్ పటేల్ (ఎన్‌సిపి), అసదుద్దీన్ ఒవైసీ (ఎఐఎంఐఎం), సస్మిత్‌పాత్రా (బిజెడి), లావు శ్రీకృష్ణదేవరాయలు (తెలుగుదేశంపార్టీ),శ్రీకాంత్ షిండే (శివసేన), సంజయ్‌సింగ్ (ఆమ్‌ఆద్మీపార్టీ), సుదీప్ బందోపాధ్యాయ (టిఎంసి), ప్రేమ్ చంద్ గుప్తా (ఆర్‌జెడి), టి.శివ (డిఎంకె), రామ్‌గోపాల్ యాదవ్ (సమాజ్ వాదీపార్టీ)లు సమావేశంలో పాల్గొన్నవారిలో ఉన్నారు. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా సిసిఎస్ (దేశ భద్రతపై మంత్రివర్గ కమిటీ) సమావేశం ఐదు కీలక నిర్ణయాలు తీసుకున్న మరునాడు కేంద్రప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించి పహల్గామ్‌లో జరిగిన సంఘటన పూర్వపరాలను తెలియజేసింది. అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని బుధవారంనాడు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2019లో పుల్వామాలో సిఆర్‌పిఎఫ్ జవానులపై ఆత్మాహుతిదాడి ఘటన తర్వాత జాతీయభద్రతకు ముప్పువాటిల్లే తీవ్రపరిణామాలు సంభవించిన పూర్వరంగంలో ఈ అఖిలపక్ష సమావేశం జరిగింది. భారత ప్రభుత్వం పాకిస్థాన్‌ను అదుపులో ఉంచడంకోసం ఐదు కఠినమైన నిర్ణయాలు తీసుకుంది. పాకిస్థాన్‌కు జీవగర్రలాంటి సింధుజలాల ఒప్పందాన్ని రద్దుచేసింది. అత్తారీ భూ రవాణా ప్రవేశద్వారాన్ని తక్షణం మూసివేసింది. దేశం నుండి పాకిస్థానీ దౌత్యకార్యాలయంలో ఉండే సైనిక ప్రతినిధులను అవాంఛనీయ వ్యక్తులుగా ప్రకటించి వారిని బహిష్కరించింది. సార్క్ వీసా పథకం కింద పాకిస్థానీయులకు జారీ చేసిన అన్ని వీసాలను రద్దుచేసింది. దీంతో ఆరోగ్య చికిత్సలకు సంబంధించిన వీసాలు కూడా ఉన్నాయి.

**నేడు రాహుల్‌గాంధీ కశ్మీరు పర్యటన**

లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ శుక్రవారంనాడు జమ్మూ కశ్మీరులో పర్యటిస్తారు. పహల్గామ్ సమీపంలో ఉగ్రవాదులు చేసిన దాడిలో గాయపడినవారిని పరామర్శిస్తారు. సంఘటన వివరాలను కూడా అడిగి తెలుసుకుంటారు. కాంగ్రెస్‌పార్టీ వర్గాలు గురువారంనాడు ఈ విషయం వెల్లడించాయి. అనంతనాగ్‌లోని ప్రభుత్వ వైద్యకళాశాలను రాహుల్‌గాంధీ సందర్శిస్తారు. కాల్పుల్లో గాయపడి అక్కడ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న వారితో మాట్లాడతారు.

## ఒప్పందం రద్దు యుద్ధచర్య
(మొదటి పేజీ తరువాయి)

విమానాలకు ప్రవేశాన్ని నిషేధించింది. ''నీరు అనేది పాకిస్థాన్ జాతీయ ప్రయోజనాలకు అత్యంత కీలకమైనది, 24 కోట్లమంది పాకిస్థాన్ ప్రజలకు అదే జీవనాధారం, ఈ నీటి వనరులను అందుబాటులోకి తెచ్చుకునేందుకు ఎలాంటి మూల్యాన్నైనా చెల్లిస్తాం, సింధుజలాల ఒప్పందం ప్రకారం పాకిస్థాన్‌కు చెందిన నీటి వనరులను ఆపడం లేదా నీటి ప్రవాహాన్ని దారిమళ్ళించడం, దిగువన నదీనీటి ప్రవాహ హక్కులను ఆక్రమించడం యుద్ధచర్యగా పరిగణిస్తాం, అంతర్జాతీయ ఒప్పందాలు, ఐక్యరాజ్యసమితి తీర్మానాలు, అంతర్జాతీయ బాధ్యతలన్నింటినీ ఉల్లంఘించే నిర్లక్ష్యపూరిత, బాధ్యరాహిత్యమైన భారతదేశ చర్యకు ప్రతిగా అన్ని ఒప్పందాలను రద్దుచేసే హక్కు తమ దేశానికి ఉంది, పాకిస్థాన్‌లో అంతర్గతంగా ఉగ్రవాదాన్ని ఉసిగొల్పే చర్యలు అపేవరకూ, ఐక్యరాజ్యసమితి సహా అంతర్జాతీయ తీర్మానాలను ఉల్లంఘించి వాటికి విరుద్ధంగా కశ్మీరులో సాగిస్తున్న హింసాకాండను నిలిపేసేంతవరకూ ఈ ఒప్పందాలను రద్దుచేసే హక్కు మాకుంది, వాఘా సరిహద్దు పోస్టును మూసేస్తున్నాం, సార్క్ వీసా మినహాయింపు పథకం కింద భారత జాతీయులకు ఇచ్చిన అన్ని రకాల వీసాలను రద్దుచేస్తున్నాం, సిక్కు యాత్రికులకు మాత్రం ఇందులోంచి మినహాయింపు ఉంటుంది, ఈ ప్రత్యేక వీసాలపై పాకిస్థాన్‌లో పర్యటిస్తున్నవారంతా 48 గంటల్లో దేశంలోంచి వెళ్ళిపోవాలి, వాఘా సరిహద్దుల నుండి అర్హహత పత్రాలతో ప్రవేశించినవారంతా ఈ నెల 30వ తేదీ లోపు దేశం వదిలి వెళ్ళిపోవాలి, ఇస్లామాబాద్‌లో ఉన్న భారత త్రివిధ దళాలకు చెందిన అధికారులను అనర్హులుగా ప్రకటిస్తూ వారంతా తక్షణం దేశం వదిలి వెళ్లిపోవాలి, కానీ ఈనెల 30 నాటికి ఎవ్వరూ ఉండకూడదు, ఇస్లామాబాద్‌లో ఉన్న భారత దౌత్యవేత్తల సంఖ్యను 30కి కుదిస్తున్నాం, ఈనెల 30 నుండి ఇది అమలులోకి వస్తుంది, భారతదేశంలో అన్ని రకాల వాణిజ్యాలను వెంటనే రద్దుచేస్తున్నాం, 2019 ఫిబ్రవరిలో భారతదేశం చాలా నిర్లక్ష్యంగా దేశంలోకి చొరబడింది. అలాంటి పరిస్థితి రాకుండా పాకిస్థాన్ త్రివిధ దళాలూ దేశ సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడేందుకు పూర్తిశక్తిసామర్థ్యాలతో సంసిద్ధంగా ఉండాలి. 1940లో పాకిస్థాన్ తీర్మానంలో మహ్మద్ అలీ జిన్నా ప్రతిపాదించిన రెండు దేశాల సిద్ధాంతం, దానిని వమ్ము చేసేందుకు భారత్ యుద్ధోన్మాద చర్యలపై వ్యక్తం చేసిన భయాలకు సంబంధించిన భావాలు ఈనాటికీ ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి, ఆ భయాలన్నీ నిజమని నిరూపితమవయ్యాయని ప్రకటన పేర్కొంది.

## ఎదురుకాల్పులు (మొదటి పేజీ తరువాయి)

మందికిపైగా భద్రతా బలగాలు చుట్టుముట్టాయి. ఈ ఆపరేషన్ సోమవారం నుండి ఇంకా కొనసాగుతూనే ఉంది. గురువారం మధ్యాహ్నం వరకు భద్రతా బలగాలు దళాల నడుమ ఎదురు కాల్పులు జరిగాయి. గురువారం ఉదయం ముగ్గురు మహిళా మావోయిస్టు మృతదేహాలతో పాటు మూడు తుపాకాలు స్వాదీనం చేసుకున్నట్లు సిఆర్‌పిఎఫ్ సీనియర్ అధికారి తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 21 నుండి రాయపూర్, జగ్దల్‌పూర్ నుండి మావోయిస్టుల ఏరివేత ఆపరేషన్‌ను సిఆర్‌పిఎఫ్ డైరెక్టర్ జనరల్(డిజి) జిపి సింగ్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

**హిడ్మా కోసం వేట ముందడుగు**

మోస్టువాంటెడ్ పిఎల్‌జిఏ టాప్ మావోయిస్టు కమాడండర్ హిడ్మాను తుదముట్టించేందుకు బలగాలు ముందుడగు వేశాయి. ఆయన ఆచూకిని తెలుసుకునేందుకు నాలుగు హెలీకాప్టర్లు, రెండు డ్రోన్‌లతో ఆకాశం నుండి వేట వీక్షణ మొదలు పెట్టారు. డ్రోన్‌లు అందించిన అందించిన చిత్రాలు, ఉపగ్రహ చిత్రాలు, మ్యాప్‌ల ఆధారంగా కరెగుట్టలను పోలీసులు మోహరించారు. కరెగుట్టల్లో మోహరించిన బంకర్‌లో హిడ్మా సాయిధ దళంతో కలిసి కనిపించాడనే సమాచారం ఆధారంగా ఆపరేషన్ ప్రారంభించారు. ఈ ఏడాది ఛత్తీస్‌గడ్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో ప్రభుత్వం ప్రారంభించిన అతి పెద్ద ఆపరేషన్ ఇదే కావడం విశేషం. కరెగుట్టల కొండప్రాంతం అధునాతన పేలుడు పరికరాలతో నిండి ఉందని, దళాలు ఇప్పటికే తమపని తాను చేస్తున్నాయని ఓ పోలీస్ అధికారి తెలిపారు. మార్చి 2026 నాటికి దేసంలో నుండి వామపక్షతీవ్రవాదాన్ని అంతచేయాలని ఏకైక లక్ష్యంతో కేంద్రప్రభుత్వం ముందుకు సాగుతోంది. హిడ్మా దాగి ఉన్న ప్రాంతం మాత్రం ఇప్పుడు మావోయిస్టులకు షెల్టర్ జోన్‌గా ఉందని, ఇతర ప్రాంతాల్లో మావోయిస్టులు తలదాచుకునే పరిస్థితి లేకుండా చేశామని ఆ పోలీస్ అధికారి తెలిపారు.



# జనరల్

STATE & REGIONAL NEWS

## కేంద్ర ప్రభుత్వానికి చెంపపెట్టు

వి.ఎస్.బోస్

ప్రజాపక్షం/హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వ మోసపూరిత విధానాలపై ముంబయి హైకోర్టు తీర్పు ప్రధాని నరేంద్ర మోదీకిచెంపపెట్టు అని ఎఐటియుసి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వి.ఎస్. బోస్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం తన ఆధీనంలో ఉన్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డిఒపిటి) ద్వారా కేంద్ర పరిధిలో ఉన్న యూనియన్లను నియంత్రించటానికి యూనియన్లలో పనిచేస్తున్న ఆఫీసు బేరర్లకు 2 పర్యాయాల కన్నా ఎక్కువ ఏ వ్యక్తికి సంబంధిత యూనియన్లలలో ఆఫీసు బేరర్‌గా ఉండకూడదని చట్ట వ్యతిరేకమైన నిబంధనలను ప్రకటించిందన్నారు. ఈ నిబంధనల ద్వారా నష్టపోతున్న డిఎఈలోని యూనియన్లు న్యాయం కోసం ముంబయి హైకోర్టును ఆశ్రయించారన్నారు. దీంతో ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయస్థానం రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1)(సి) ప్రకారం యూనియన్లు ఏర్పరుచుకునే హక్కు ప్రతి కార్మికునికి ఉన్నదని, 1926 ట్రేడ్ యూనియన్ చట్టం ప్రకారం యూనియన్ రిజిస్టర్ చేసుకుంటే అలాంటి యూనియన్లో జోక్యం చేసుకొనే హక్కు కేంద్ర ప్రభుత్వానికి గానీ, లేక యాజమాన్యాలకు గానీ లేదని కరాఖండిగా చెప్పిందని ఆయన పేర్కొన్నారు.



## డిజిపిని అభినందించిన సిఎం

ప్రజాపక్షం/హైదరాబాద్: పౌరులకు ఉత్తమ సేవలు అందించడంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్ర పోలీసులు మొదటి స్థానంలో నిలవడంతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి గురువారం డిజిపి డాక్టర్ జితేందర్‌ను అభినందించారు. ఇటీవల ఇండియా జస్టిస్ రిపోర్ట్ 2025లో తెలంగాణ పోలీస్ శాఖ దేశంలో ప్రథమ స్థానంలో నిలిచిందని తేల్చింది. ఆ సమయంలో సిఎం రేవంత్‌రెడ్డి జపాన్ పర్యటనలో ఉండడంతో ట్విట్టర్ ద్వారా రాష్ట్ర పోలీసులకు అభినందనలు తెలిపారు. జపాన్ పర్యటనను ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకున్న సిఎంను డిజిపి జితేందర్, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డిలు కలిశారు. ఈ సందర్భంగా సిఎం పోలీసులను మరోసారి అభినందించారు. ఇదే స్ఫూర్తితో మునుముందు కూడా పని చేయాలని సిఎం వారికి సూచించారు.

## అచ్యుతమీనన్‌కు తెలంగాణ నేతల నివాళి



తిరువనంతపురం : కేరళ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, మాజీ ముఖ్యమంత్రి, స్వాతంత్ర సమర యోధుడు సి.అచ్యుత మీనన్ జీవితాంతం ఆదర్శంగా ఉంటూ, ముఖ్యమంత్రిగా భూ సంస్కరణలు అమలు చేసిన గొప్ప నేత అని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కొనియాడారు. తిరువనంతపురంలో జరుగుతున్న సిపిఐ జాతీయ సమితి సమావేశాలకు హాజరైన తెలంగాణ, ఎపి జాతీయ సమితి సభ్యులు అచ్యుతమీనన్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, అక్కినేని వనజ, జాతీయ సమితి సభ్యులు, పల్లా వెంకటరెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, తక్కెళ్ళపల్లి శ్రీనువాస్, బాలనర్సింహా, బాగం హేమంత్ రావు, కలవేన శంకర్, ఎం.డి.యూసుఫ్, ఎపి జాతీయ సమితి సభ్యులు తాటిపాక మధు, కె. శివ రెడ్డి పాల్గొన్నారు.

# భూ భారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం

రైతుల మేలు కోసమే భూ భారతి చట్టం


తెలంగాణలో భూమికి, రైతుకు అవినాభావ సంబంధం

భూ భారతి చట్టం అవగాహనలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



ప్రజాపక్షం/చండూరు/మునుగోడు : రైతుల మేలు కోసం రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం 2025 తీసుకురావడం సంతోషకరమైన విషయం అని, తెలంగాణ రాష్ట్రంలో భూమికి రైతుకు అవినాభావ సంబంధం ఉందని భూమి కోసం ప్రజా ఉద్యమాలు జరిగిన సందర్భాలు రాష్ట్రంలో ఉన్నాయని అలాంటి గడ్డపై రైతులకు భూమిపై హక్కులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన చట్టమే భూ భారతి చట్టం అని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. భూ భారతి చట్టం 2025 పై రైతులకు అవగాహణ కల్పించేందుకు ఉద్దేశించి నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా గురువారం నల్లగొండ జిల్లా మునుగోడు, చండూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గతంలో ఉన్న ధరణి పోర్టల్‌లో సాగుకాలం లేదని, పిఓబిలో భూములను నిషేదంలో ఉంచితే ఆ సమస్య పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని సిసిఎల్‌ఎకి వెళ్లాల్సి వచ్చేదని ఇది రైతులకు ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకున్న విషయం అన్నారు. ఒక సర్వే నెంబర్‌లో ఏదైన వివాదం వస్తే సర్వే నెంబర్ మొత్తాన్ని పిఓబిలో పెట్టే వారని తెలిపారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని రైతుల ఇబ్బందులను పరిష్కరించేందుకు నూతనంగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అందరితో చర్చించి భూ భారతి చట్టం 2025ను తీసుకొచ్చిందన్నారు. ఈ భూ భారతి చట్టం వల్ల 90 శాతం సమస్యలు తహసీల్ధార్ వద్ద పరిష్కారం అవుతాయని అన్నారు. రైతులు, ప్రజలు భూ భారతి చట్టాన్ని సద్వినియోగం చేసకుకోవాని కోరారు. మునుగోడు వంటి వెనుకబడిన ప్రాంతంలో శివన్నగూడెం రిజర్వాయర్ ఉన్నప్పటికి గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం డిపిఆర్ చేపట్టలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 1800కోట్ల రూపాయలతో ఏదుల నుండి నీళ్లు తెచ్చే కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. మునుగోడుకు సాగు నీరు వస్తే రైతులకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని అన్నారు. చిన్న నీటి వనరులులైన శేశిలేటి వాగు ఫీడర్ ఛానల్, వెల్మకన్నే ఫీడర్ ఛానల్, బెండలమ్మ చెరువు లాంటి వాటిని పూర్తి చేసి మునుగోడు చండూరు ప్రాంత రైతుల సాగునీటి సమస్య పరిష్కరానికి కృషి చేస్తామని అన్నారు. ఇటీవల కాలం లో గట్టుప్పల, మునుగోడు చండూరు ప్రాంతాలకు ఫార్మా కంపెనీలు వస్తున్నాయని, ఫార్మా కంపెనీల ఏర్పాటు వల్ల కాలుష్యం ఏర్పడి రైతులు ఈ ప్రాంతాన్ని వదిలేసి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తుందని అందువల్ల ఇక్కడ ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఆర్డీఓ శ్రీదేవి, డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, చండూరు మార్కెట్ కమిటి చైర్మన్ దోటి నారాయణ, చండూరు తహసీల్ధార్ దశరథ, మునుగోడు తహసీల్ధార్ నరేష్, చండూరు మున్సిపల్ కమీషనర్ లతా , చండూరు, మునుగోడు డిప్యూటీ తహసీల్ధార్‌లు నిర్మల, నరేందర్ ఎంపిడిఓలు యాదగిరి, శాంతకుమారి, రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బిఆర్‌ఎస్ నాయకులు



ప్రజాపక్షం/హైదరాబాద్: వరంగల్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గానికి చెందిన పలువురు బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గాంధీభవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో తొర్రూరు మండల అభివృద్ధి కమిటీ చైర్మన్, నియోజకవర్గ స్థాయి నాయకుడు డాక్టర్ పానుగోటి సోమేశ్వర్‌రావు, సుమారు 500 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులలో తొర్రూరు మాజీ సర్పంచ్ రాజేష్ నాయక్, రాయపర్తి మాజీ ఎంపిపి కంజర్ల ఎల్లయ్య, మాజీ ఎంపిటిసి సొమ్లు నాయక్, రాజేందర్, భోజ్యా, బానోత్ శ్రీను, జాతోత్ నరేష్, పద్మా యకేందర్, రవి నాయక్, కృష్ణ మూర్తి, నరసింహ నాయక్, మైనారిటీ విభాగం నాయకులు ఎండి.అన్వర్, యువజన విభాగం నాయకులు వీరమనేని రాజు, సురేష్ నాయక్, గుగులోతు అశోక్, నెహ్రూ నాయక్, మహిళా విభాగం నాయకురాలు కేతావత్ అనుజా, దారవత్ అనిత, విమల తదితరులు వున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఆకర్షితులై వివిధ రాజకీయ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేసి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు క్లీన్ స్వీప్ చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి చెందిన అత్త కోడళ్ళను తక్కువ అంచనా వేస్తూ మాజీ మంత్రి ఎర్రబెల్లి ఇంకా ఏదో ఆశతో ఉన్నారని, వారు ఆశలు వదులుకుంటే వారికే మంచిదన్నారు. బిఆర్‌ఎస్ నాయకుల చేరికలు ఇంకా కొనసాగుతాయని, ఇంకా చాలా మంది నాయకులు కాంగ్రెస్‌లోకి రావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి నుండి తరలి వచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## శ్రీనగర్‌లో చిక్కుకున్న 80 మంది తెలంగాణ పర్యాటకులు

రప్పించేందుకు హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాపక్షం/హైదరాబాద్: కాశ్మీర్‌లో ఇటీవల జరిగిన ఉగ్రవాద దాడి కారణంగా సూమారు 80 మంది తెలంగాణ పర్యాటకులు శ్రీనగర్‌లో చిక్కుకున్నారు. శ్రీనగర్‌లో చిక్కుకున్న వారిలో హైదరాబాద్‌కు చెందిన 20 మంది, వరంగల్‌కు చెందిన 10 మంది, మహబూబ్‌నగర్‌కు చెందిన 15 మంది, సంగారెడ్డికి చెందిన 10 మంది, మెదక్‌కు చెందిన రెండు కుటుంబాలు ఉన్నట్లు తెలిసింది. వీరు మంగళవారం ఉదయం జమ్మూ నుండి బయలుదేరి మధ్యాహ్నం 3 గంటలకు సమయంలో శ్రీనగర్‌కు చేరుకున్నారు. అయితే అదే సమయంలో పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మరణించడంతో ఆ ప్రాంతంలో కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. దీంతో తెలంగాణ పర్యాటకులు తిరిగి వెనక్కి వెళ్లలేక అక్కడే చిక్కుకున్నారు. ప్రస్తుతం పర్యాటకులు సురక్షితంగా ఉన్నారు. భద్రతా పరిస్థితుల వల్ల అక్కడే ఉండాల్సి వస్తోంది.

**స్వస్థలాలకు రప్పించేందుకు చర్యలు: మంత్రి జూపల్లి**

కాశ్మీర్‌లో చిక్కుకున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారిని సురక్షితంగా స్వస్థలాలకు రప్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున పర్యాటకులకు తగిన సహాయం అందిస్తామని అన్నారు. ఈ ఘటనపై తెలంగాణ పర్యాటక శాఖ అధికారులు.. ఢిల్లీలోని తెలంగాణ భవన్ అధికారులతో పాటు కేంద్ర ఏజెన్సీలతో సమన్వయం చేస్తూ పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని చెప్పారు. ఇటీవల జమ్ము, కాశ్మీర్‌లో ప్రయాణించిన పర్యాటకుల వివరాలు వెంటనే అందించాలని తెలంగాణలోని అన్ని టూర్ ఆపరేటర్లు, ట్రావెల్ ఏజెంట్లను మంత్రి కోరారు. పర్యాటకుల స్థితిగతులను పర్యవేక్షించేందుకు, అవసరమైన సమయంలో ప్రభుత్వ సహాయాన్ని అందించేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హెల్ప్ లైన్ ను ఏర్పాటు చేశామని, కాశ్మీర్‌లో చిక్కుకున్న తెలంగాణ పర్యాటకుల సహాయం కోసం నిరంతరం ఫోన్ ద్వారా సేవలు అందించేందుకు ఈ హెల్ప్ లైన్ నెంబర్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. పర్యాటకుల బంధువులు లేదా స్నేహితులు కూడా తమ సమాచారం అందించేందుకు, లేదా సహాయం కోసం కింది నంబర్లకు కాల్ చేయాలని కోరారు. ఈ హెల్ప్‌లైన్‌ల ద్వారా పర్యాటకులు తమ పరిస్థితిని తెలియజేసి, అవసరమైన సహాయం పొందవచ్చు.

**హెల్ప్ లైన్ నంబర్లు**

వందన (పిఎస్ తెలంగాణ భవన్, న్యూఢిల్లీ) 9871999044

హైదర్‌అలీ నక్వీ – (పిఎ తెలంగాణ భవన్ న్యూఢిల్లీ) 9440816071

తెలంగాణ 9010659333,040 23450368

## 'స్థానికం'లో బిసి రిజర్వేషన్ల పెంపు బాధ్యత ప్రభుత్వానిదే



రాజ్యాంగంలోని ఆర్టికల్ 243–డి–6తో సాధ్యం : రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు పెంచే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాదేనని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243–డి–6 ప్రకారం ఇది సాధ్యమని, అలా కాకుండా బిసి బిల్లు ఆమోదం కేంద్రానిదేనని చేతులు దులుపుకోవాలని చూస్తే మాత్రం రాష్ట్రంలో యుద్ధమే జరుగుతుందని ఆయన హెచ్చరించారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారకభవన్‌లో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడతూ బిసిలకు 42 రిజర్వేషన్లును అమలు చేయాల్సిందేనన్నారు. ఏ మాత్రం వెనకడుగు వేసినా వెయ్యి మంది బిసిలు ఆమరణ దీక్షకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అయితే ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సిఎం ఎ.రేవంత్‌రెడ్డి బిసి బిల్లును అసెంబ్లీలో ఆమోదించారన్నారు. స్థానిక ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోవడం ఖాయమని ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. అదేవిధంగాఅన్ని రాజకీయ పార్టీలు బిసి రిజర్వేషన్లపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో బిసి బిల్లుకు చట్టం చేయడంతో ఒక్క జిఒ జారీ చేసి వెంటనే ఎన్నికల్లో జరపవచ్చన్నారు. ఈడబ్ల్యుఎస్ అమలులో సుప్రీంకోర్టు రిజర్వేషన్ల సీలింగ్ ఎత్తివేసిందని, బిసి రిజర్వేషన్లపై ఎవరైనా కోర్టుకెళ్లినా కేసు గెలుస్తుందన్నారు. విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్ల పెంపునకు మాత్రం కచ్చితంగా రాజ్యాంగ సవరణ చేయాలని పేర్కొన్నారు. తమిళనాడు తరహాలో బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించి, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరారు. మంత్రివర్గంలో, కార్పొరేషన్ల చైర్మన్ల పదవుల్లో అత్యధిక స్థానాలు బిసిలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నేతలు జిల్లపల్లి అంజి, మణికంఠ, రాజు నేత, ప్రతాప్, సింగం లక్ష్మణ్, సురేందర్, ఫణి కాంత్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ అధ్యక్ష పదవి బిసి,ఎస్‌సి,ఎస్‌టిలకు ఇవ్వాలి



ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్: బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్ష పదవిని బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు ఇవ్వాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ డిమాండ్ చేశారు. గాంధీ భవన్‌లో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కనీసం కెసిఆర్ కుటుంబం నుంచి కాకుండా వారి సామాజిక వర్గానికే చెందిన వ్యక్తికి బిఆర్‌ఎస్ అధ్యక్ష పదవి చేయగలరా? అని ప్రశ్నించారు. కెటిఆర్‌కు ధైర్యముంటే బిఆర్‌ఎస్ అధ్యక్ష పదవిని చేపట్టి బిఆర్‌ఎస్‌ను అధికారంలోకి తీసుకురావాలని సవాల్ చేశారు. కెటిఆర్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంటో, నాన్ వర్కింగ్ ప్రెసిడెంటో ఆయనకే తెలియాలని దయాకర్ ఎద్దేవా చేశారు. జనతా గ్యారేజ్ సినిమాలో యజమాని కొడుకు విలన్ అని, బిఆర్‌ఎస్ జనతా గ్యారేజ్‌లో పార్టీ యజమాని కొడుకు కెటిఆర్ విలనా అని దయాకర్ ప్రశ్నించారు. హెచ్‌సియు భూముల విషయంలో బిఆర్‌ఎస్ హ్యాండిల్స్ నుంచి ఫొటోలు ఎందుకు డిలీట్ చేశారో చెప్పాలని దయాకర్ డిమాండ్ చేశారు.

## సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు అధికారికంగా 67 టిఎంసిల కేటాయింపు

సీతమ్మ సాగర్ బ్యారేజీ నిర్మాణానికి సాంకేతిక అనుమతులు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఖమ్మం జిల్లాలోని సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు కేంద్రం 67 టిఎంసిల నీటిని కేటాయించడంతో పాటు సీతమ్మ సాగర్ బ్యారేజ్ నిర్మాణానికి సాంకేతిక అనుమతులు మంజూరు చేసిందని ఉపముఖ్యమంత్రి సిఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. గురువారం ఈ మేరకు గురువారం ఉపముఖ్యమంత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వ చేసిన ప్రయత్నం ఫలించడంతో ఇక ఖమ్మం జిల్లాలోని వేల ఎకరాల బీడు భూములు సస్యశ్యామలం కానున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుకు సంబంధించి భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి కేంద్రానికి స్పష్టమైన సమాచారం ఇప్పించి, వారిని ఒప్పించి అధికారిక అనుమతులు సాధించారని డిప్యూటీ సిఎం అభినందించారు. దశాబ్దాల తరువాత రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం మూలంగా అధికారిక అనుమతులు సాధించడం అభినందనీయం అన్నారు.

## అసలైన కళాకారులకు ఉద్యోగాలు ఇవ్వాలి



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆట పాట ద్వారా తమ కళా ప్రదర్శన ఇచ్చిన నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని పలువురు కళాకారులు ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, మాజీ ఎంపి విహెచ్‌లకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మంగళవారం బిసి కళామండలి జాతీయ అధ్యక్షులు జనగలం రామలింగం, జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జా కృష్ణ, ఉదయ్, నిరుద్యోగ కళాకారుల సంఘం నాయకులు దరువు అంజన్నలతో కూడిన ప్రతినిధుల బృందం ప్రొఫెసర్ కోదండరామ్, వి.హనుమంతరావులను కలిసి వినతి పత్రం అందజేశారు. కెసిఆర్ ప్రభుత్వంలో హయాంలో ఉద్యమ కళాకారులను పక్కనపెట్టి కేవలం టిఆర్‌ఎస్ పార్టీకి ప్రచారం చేసిన కళాకారులకు మాత్రమే ఉద్యోగ అవకాశాలు కల్పించారని, దీంతో ఆనాడు తెలంగాణ కోసం గజ్జ కట్టి ఆడిపాడిన నిజమైన 500 కళాకారులకు తీవ్ర అన్యాయం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమైన కళా సారథులుగా తమకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## కాళేశ్వరం కమిషన్ విచారణ మళ్లీ మొదలు

ఈసారి మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, ఈటల రాజేందర్‌ల విచారణకు చాన్స్ ?



ప్రజాపక్షం/హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో చోటు చేసుకున్న అవకతవకలను నిగ్గు తేల్చేందుకు ఏర్పాటు చేసిన జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ మళ్లీ విచారణను ప్రారంభించింది. ఈ అంశంపై ఇప్పటికే పలు దఫాలుగా విచారణ నిర్వహించిన కమిషన్ ఈ దశలో మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుతో పాటు మాజీ మంత్రులు టి.హరీష్ రావు, ఈటల రాజేందర్‌ను క్రాస్ ఎగ్జామినేషన్ చేయనున్నట్లు సమాచారం. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని బ్యారేజీల నిర్మాణాల అవకతవకలపై ఇప్పటికే విధి నిర్వహణలో భాగస్వామ్యమైన నీటి పారుదల శాఖ మాజీ ఈఎన్‌సిలు, చీఫ్ ఇంజనీర్లు ఇతర ఇంజనీర్లతో పాటు ఉన్నత అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు నిపుణులను ప్రశ్నించిన కమిషన్ వారి ద్వారా కీలక సాక్ష్యాధారాలను సేకరించింది. ఇదే క్రమంలో ఈ సమాచారం ఆధారంగా మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, ఈటల రాజేందర్‌ను కమిషన్ ప్రశ్నించనున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి ఈ ముగ్గురికి కమిషన్ ముందు హాజరు కావాలని సమన్లు పంపించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

**90 శాతం నివేదిక పూర్తి :**

కాళేశ్వరం అవకతవకలపై పలు దఫాలు విచారణ చేపట్టిన పిసి ఘోష్ కమిషన్ 400 పేజీలతో 90 శాతం నివేదికను సిద్ధం చేసినట్లు సమాచారం. ఎన్‌డిఎస్‌ఎ తుది రిపోర్టు అందిన వెంటనే తుది నివేదిక సిద్ధం కానుంది. అయితే ఈనెల 30వ తేదీతో కమిషన్ గడువు ముగియనుండడంతో తక్షణమే నివేదిక అందించాల్సిందిగా ఎన్‌డిఎస్‌ఎకు కమిషన్ మరోసారి లేఖ రాసింది. అయితే రెండు , మూడు వారాల్లో నివేదిక అందే అవకాశం ఉన్నట్లు సమాచారం. దీంతో కమిషన్ గడువును ప్రభుత్వం మరింత పొడిగించనుంది.

# 14 మంది మావోయిస్టుల లొంగుబాటు

లొంగిపోయిన వారందరికీ పునరావాసం కల్పిస్తాం : మల్టీ జోన్ ఐజీ చంద్ర శేఖర్ రెడ్డి

ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి : సిపిఐ మావోయిస్టు పార్టీకి చెందిన 14 మంది సభ్యులు మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ఎదుట గురువారం వరంగల్ కమీషనరేట్‌లో లొంగిపోయారు. తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ కమిషనరేట్ పోలీసుల సమక్షంలో అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులను తెలంగాణ ప్రభుత్వం ఎదుట లొంగిపోవడం కోసం జిల్లాల వారిగా నిర్వహిస్తున్నటువంటి 'పోరు కన్నా ఊరు మిన్న, మన ఊరికి తిరిగి రండి,' 'ఆపరేషన్ చేయూత' వంటి అనేక ఆదివాసీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా లొంగిపోయినటువంటి నిషేదిత మావోయిస్టు సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయల గురించి తెలుసుకుని నక్సలిజం మార్గాన్ని వదిలిపెట్టి కుటుంబంతో కలిసి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని నిర్ణయించుకొని వివిధ హోదాలో పనిచేయుచున్న 14 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు ఐజీ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. వారిలో ఏరియా కమిటీ సభ్యులు ఇద్దరు, పార్టీ సభ్యులు 7గురు, మిలిషియా కమాండర్ ఒకరు, మిలిషియా సభ్యులు 4గురు మొత్తం 14 మంది లొంగిపోవడం జరిగిందని ఐజీ తెలిపారు.ఆంధ్రఒరిస్సా బోర్డర్ ఎస్ జెడ్ సీ డివిజనల్ కమిటీలో పని చేసిన గాలికొండ ఏరియా కమిటీకి చెందిన ఏరియా కమిటీ సభ్యుడు మడవి అంద, కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవికి చెందిన ప్రొటెక్షన్ టీంలో పని చేసిన ఏరియా కమిటీ సభ్యురాలు సోడి కోసి, వివిధ మావోయిస్టు పార్టీ డివిజన్ కమిటీలలో పని చేసినటువంటి పార్టీ సభ్యులు అయిన మరకం హిడుమే, మడకం జోగి, పోడియం భూమిక అలియాస్ వెన్నెల, సోడి బుద్రి, మడవి పూజే, హేమ్లా సోను, సోడి రమేష్, మిలిషియా సభ్యులుగా పని చేసిన అట్టం బుద్ర, కోవాసి ఇడుమ, కోర్సా లాలు, హేమ్లా సుక్కు, కోర్సా సుక్కులు లొంగిపోయిన వారిలో ఉన్నారు. లొంగిపోయినటువంటి మావోయిస్టు పార్టీ సభ్యులు అగ్రనాయకుల ఆదేశాల మేరకు ఛత్తీస్గఢ్, ఒరిస్సా రాష్ట్రలలో అనేక పలు విధ్వంసకర సంఘటనలలో, పోలీసులపై దాడి చేసిన ఘటనలలో, అమాయక ప్రజలను ఇన్‌ఫార్మర్ల నెపంతో హత్య చేసిన పలు సంఘటనలలో పాల్గొనడం జరిగిందని తెలిపారు. జనవరి, 2024 నుండి ఈ రోజు వరకు వివిధ సందర్భాలలో జరిగిన ఎదురు కాల్పులలో 18 మంది సాయుధ మావోయిస్టులు, వారిలో ముగ్గురు (03) రాష్ట్ర కమిటీ సభ్యులు చనిపోవడం జరిగిందని తెలిపారు. జనవరి నుంచి నేటి వరకు వివిధస్థాయిలలో పని చేస్తున్న 12 మంది మావోయిస్టులను అరెస్ట్ చేయడం జరిగిందని, ఒక రాష్ట్ర కమిటీ సభ్యురాలితో పాటు మొత్తం 250 మంది మావోయిస్టులు స్వచ్ఛందంగా పోలీసుల ఎదుట లొంగిపోయి, జనజీవన స్రవంతిలో కలవడం జరిగిందని తెలిపారు. జనజీవన స్రవంతిలో కలవడానికి కావాల్సిన తగు ఏర్పాట్లు చేయడంతో పాటుగా, సరెండర్ పాలసీలో భాగంగా తక్షణమే వారికి పునరావాసాన్నీ తెలంగాణ పోలీస్ శాఖ కల్పిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం ఎస్పీలు, ఏటూరునాగారం ఏఎస్పీ పాల్గొన్నారు.




**ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారి కార్యాలయం**
పబ్లిక్ హెల్త్ డివిజన్, కరీంనగర్.

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు - 2వ పిలుపు

NIT No. 2007/T4/NIT/EEPHKNR/Jagtial/TUFIDC/2nd call/2025-26, తేది: 24-04-2025

**పనుల పేరు:** టియుఎఫ్ఐడిసి ఫేజ్-3 క్రింద జగిత్యాల మున్సిపాలిటీలో బిటి రోడ్ ఏర్పాటు. **ఎ)** వార్డు నెం. 36లో మోచి సంఘ భవనం నుండి టవర్ సర్కిల్ వరకు, **బి)** వార్డు నెం.38లో చాముండేశ్వరి కిరాణా షాప్ నుండి వందన మెడికల్ షాప్ వరకు. **పనుల సంఖ్య:** (1) పని, **మొత్తం అంచనా విలువ:** రూ.36,06,826-00, **బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేది:** 25.04.2025న ఉ.10.30గం.ల నుండి. **బిడ్ల స్వీకరణకు ఆఖరి తేది:** 02.05.2025న సా.4.00గం.ల నుండి, **ప్రైస్‌బిడ్ ప్రారంభ తేది:** 02.05.2025న సా.04.01 గం.ల నుండి. **టెండర్ ఆహ్వానించు అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పిహెచ్ డివిజన్, కరీంనగర్. మరిన్ని వివరాలకు www.eprocurement.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పబ్లిక్ హెల్త్ డివిజన్, కరీంనగర్.

DIPR R.O. No. : 766-PP/CL/ADVT/1/2025-26, Date: 24-04-2025

ప్రజాపక్షం
శుక్రవారం, ఏప్రిల్ 25

# మార్కెటింగ్‌కు అందాల ఆరబోత

ప్రపంచ అందాల పోటీకి భారతదేశం వరుసగా రెండవసారి వేదిక కానుంది. తొలిసారిగా 1996లో అమితాబ్ బచ్చన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎబిసిఎల్) బెంగళూరు నగరంలో మిస్ వరల్డ్ పోటీకి ఆతిథ్యమిచ్చింది. యువతులను వినిమయ వస్తువులుగా ప్రదర్శించే ఈ పోటీలపై దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వెల్లువెత్తడంతో చివరకు బికినీలు ధరించే స్విమ్ సూట్ రౌండ్‌ను ఇతర దేశానికి తరలించి మమా అనిపించారు నిర్వాహకులు. తిరిగి 28 ఏళ్ళ సుదీర్ఘ విరామం తరువాత మిస్ వరల్డ్ పోటీ గతేడాది భారతదేశంలో ప్రవేశించింది. వాస్తవానికి మిస్ వరల్డ్ 2023 పోటీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో జరగాల్సి ఉన్నప్పటికీ, చివరి నిమిషంలో కారణాలు వెల్లడించకుండానే వేదికను అకస్మాత్తుగా భారతదేశంలోని ఢిల్లీకి, అటు పిమ్మట ముంబైకి మార్చారు. ఈ సారి మిస్ వరల్డ్ – 2025 పోటీని తెలంగాణలో నిర్వహించనున్నట్లు గతేడాదే అధికారిక ప్రకటన వెలువడింది. 72వ ప్రపంచ అందాల పోటీకి మే 7వ తేదీ నుంచి 31వ తేదీ వరకు హైదరాబాద్ నగరం ఆతిథ్యమివ్వనుంది. 140 దేశాల యువతులు ర్యాంప్ వాక్ చేయనున్న ఈ ఈవెంట్‌లో విజేతకు రూ.10 కోట్ల నగదు, వజ్రకచిత కిరీటం, ఏడాది పాటు వివిధ కంపెనీల కాంట్రాక్టులు, ఉచిత విమానప్రయాణాలు, మేకప్, దుస్తులు దక్కుతాయి.


1951లో ప్రారంభమైన ప్రపంచ సుందరి పోటీ ప్రధాన ఉద్దేశ్యం పెట్టుబడిదారి వ్యవస్థ సరుకుకు మార్కెట్ సృష్టించటం. అందమైన యువతితో తమ సరుకును ప్రచారం చేయడం ద్వారా మరింత లాభాలు పొందడమే లక్ష్యం. ఈ పోటీల ద్వారా వేదిక నగరానికి అంతర్జాతీయ దృగ్గోచరత్వం లభిస్తుందనే వాదన వట్టిమాటలే. ఉదాహరణకు ఇప్పుడు జరగుతున్న మిస్ వరల్డ్ కాంపిటేషన్ ద్వారా హైదరాబాద్ నగరాన్ని, తెలంగాణ సంస్కృతిని, ఇక్కడి బిర్యానీ తదితర వంటకాలను, పోచంపల్లి చేనేతను, పర్యాటక ప్రదేశాలను ప్రపంచానికి పరిచయం చేయవచ్చనే మాటలు డొల్లలే. ఎందుకంటే నాలుగు శతాబ్దాలకు పైగా ఘన చరిత్ర కలిగిన హైదరాబాద్ నగర సంస్కృతి, సంప్రదాయాలు, ఘనతలు ఎన్నడో జగద్విఖ్యాతి పొందాయి.

బహుళజాతి కార్పొరేట్ కంపెనీల దృష్టంతా ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన భారతదేశంలోని మార్కెట్‌పైనే. ఎప్పుడో 1966లో భారతదేశానికి మొదటిసారిగా రీటా ఫారియా రూపంలో 'మిస్ వరల్డ్' కిరీటం దక్కింది. మరోసారి దక్కేందుకు సుమారు మూడు దశాబ్దాలు పట్టింది. 1991లో ఆర్థిక సంస్కరణల పేరిట దేశ విపణి ద్వారాలు తెరుచుకున్న వెంటనే అంతర్జాతీయ మార్కెట్ శక్తుల కళ్ళు ఇటువైపు మళ్ళాయి. 90వ దశాబ్దంలో ప్రపంచ అందాల పోటీల్లో భారతదేశం నుంచే దాదాపుగా వరుస విజేతలయ్యారు. 1994లో ఐశ్వర్యా రాయ్, 1997లో హైదరాబాద్‌కు చెందిన డయానా హెడెన్, 1999లో యుక్తా ముఖి, 2000లో ప్రియాంక చోప్రాలకు మిస్ వరల్డ్ టైటిల్ దక్కాయి. అదే కాలంలో విశ్వ సుందరీ మణులుగా 1994లో సుస్మితా సేన్, 2000లో లారా దత్తాలు 'మిస్ యూనివర్స్' గా గెలుపొందారు. దీనిని బట్టి అంతర్జాతీ య కాస్మోటిక్స్ కంపెనీలు భారతదేశంలో తమ లిప్‌స్టిక్కులు, పౌడర్‌లు, సన్‌స్క్రీన్ లోషన్‌లు, షాంపూలు, సబ్బులు, స్కిన్ క్రీములు అమ్ముకునేందుకు ఎంత ఉబలాట పడ్డాయో అర్థం చేసుకోవచ్చు.

హైదరాబాద్‌లో జరిగే మిస్ వరల్డ్ పోటీలను మహిళా సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. రాష్ట్ర ఆర్థికస్థితి ఉత్తేజజనకంగా లేనప్పుడు రూ.200 కోట్లకుపైగా వెచ్చించి వీటిని నిర్వహించడం అవసరమా అని ప్రతిపక్షాలు ప్రశ్నించాయి. దీనికి ప్రభుత్వం వివరణ ఇస్తూ, మిస్ వరల్డ్ పోటీలకు చేసే ఖర్చు రూ.54 కోట్లలో సగం మిస్ వరల్డ్ నిర్వాహకులు, మిగతా సగం రూ.27 కోట్లు తెలంగాణ పర్యాటక శాఖ వాటా అని, అవి కూడా స్పాన్సర్‌ల రూపంలో సమీకరిస్తున్నామని చెప్పుకొచ్చింది. ఈ పోటీల ద్వారా తెలంగాణ సామర్థ్యం అంతర్జాతీయంగా ప్రదర్శించవచ్చని వాదన వినిపిస్తున్నది.

అందాల పోటీలంటే కేవలం అంగాంగ ప్రదర్శనే కాదు.. మేధస్సుకు కూడా ప్రాధాన్యత ఉంటుందని నిర్వాహకులు సమర్థించుకుంటారు. నిజమే, ఇందులో పోటీదారుల తెలివిని పరీక్షించే విభాగం ఉండొచ్చు గాక. అది మసిపూసి మారేడుకాయను చేయడం కోసమే. అందాల పోటీల విజేతలైన భారతీయ యువతులంతా మోడలింగ్, సినీ రంగాలలోనే తమ కెరీర్‌ను నిర్మించుకున్నారే తప్ప అత్యున్నత పోటీ పరీక్షలైన సివిల్ సర్వీస్ వైపు, శాస్త్ర సాంకేతిరంగం వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. కాబట్టి అందాల పోటీలనేవి నిర్వాహకులు చెబుతున్నట్లుగా అందం, వైవిధ్యం, సాధికారత కోసమో, వేదికగా నిలిచే నగరాల విశిష్టతను ప్రపంచానికి పరిచయం చేయడం కోసమో కాదనేది నగ్నసత్యం. మహిళను అంగడి బొమ్మగా మార్చి, లాభాలు దండుకొని, ప్రపంచాన్ని క్షీణ సంస్కృతి వైపు వేగంగా నెట్టేసే పెట్టుబడిదారి వ్యవస్థ మార్కెట్ విస్తరణ కోసం చేసే మాయాజాలంలో భాగమే ఈ పోటీలు.

# ఒక 'క్షతగాత్రుడి' రజతోత్సవం!



ఎస్‌కె. జకీర్
సీనియర్ జర్నలిస్ట్

"తమంతట తామే తగిలించుకునే గాయాలో,కొని తెచ్చుకునే బాధలో మనుషులు తమకు తామే ఎంచుకున్నట్లయితే కాలక్రమంలో మరొకరు చేసే గాయాల కన్నా తక్కువ బాధకు గురి చేస్తాయి'' అని 1469–1527కు చెందిన రాజకీయ తత్వవేత్త నికొలో మాకియవెలి అన్నాడు. ఇది ముమ్మాటికి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు వర్తిస్తుంది. ఆయనను ఎవరూ గాయపరచలేదు. తనను తానే గాయపరచుకున్నారు. ఆయన ఇప్పుడు ఒక 'గాయపడ్డ' మనిషి. వేయి యుద్ధములలో ఆరితేరిన యోధునిగా గుర్తింపు పొందిన కెసిఆర్ ఓటమి గాయం నుంచి కోలుకోలేకపోతున్నారు. రేవంత్ రెడ్డి రూపంలో ఒక 'ఉపద్రవం' వచ్చి ముంచేయగలదని ఆయన ఊహించలేదు. అంచనాలు తలకిందులు కావడానికి, ప్రజల తిరస్కారానికి గురికావడానికి కెసిఆర్ ఒక్కరే కారణం. ఆయన ఎవరి మాటనూ లెక్క చేయకపోవడం, కొడుకు, కూతురు, మేనల్లుడు, తోడల్లుని కొడుకు వంటి స్వపరివారాన్ని నమ్ముకోవడమే నట్టేట ముంచింది.

'ప్రజలకేమి కావాలో తనకు తెలుసు అని అనుకున్నారు కానీ, ప్రజలు ఏమనుకుంటున్నారో ఎప్పుడూ తనిఖీ చేసుకోలేదు. ప్రజాభిప్రాయం ఎలా ఉందో పసిగట్టలేకపోయారు. ప్రతి ఇంట్లో కుటుంబ సభ్యులందరికీ, రైతుబంధు, పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, కెసిఆర్ కిట్స్ రూపంలో డబ్బు పంపిణీ చేసినందున వాళ్లంతా తనను అధికారంలో శాశ్వతంగా ఉంచుతారని భావించారు. అయితే తెలంగాణ ప్రజలు ఎడ్డి వాళ్ళు కాదు. గుడ్డి వాళ్ళు అంతకన్నా కాదు. కెసిఆర్ 'ప్రగతిభవన్' పరిపాలనను ప్రజలు జీర్ణించుకోలేకపోయారని, ఆయన పరివారం అహంకార ధోరణి పట్ల జనంలో ఆగ్రహం 'లావా' వలె గూడు కట్టుకుంటోందని కెసిఆర్ సరిగ్గా విశ్లేషించుకోలేకపోయారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ కూడా కెసిఆర్ దారిలోనే విచ్చలవిడిగా 'సంక్షేమం' పేరిట నేరుగా ఓటర్లకు డబ్బు అందించారు. తీరా ఎలక్ట్రానిక్ ఓటింగు యంత్రాలలో ఓట్లు కురవలేదు. జనం ఆయనను ఇంటికి పంపించారు. 11 సీట్లకే పరిమితం చేశారు. ఆ మాటకొస్తే కెసిఆర్ నయం. 39 అసెంబ్లీ స్థానాలతో బిఆర్ఎస్ బలమైన ప్రతిపక్షంగా తయారైంది. కానీ అధికారం వేరు. ప్రతిపక్షం వేరు. అధికారంలో కొనసాగిన పదేండ్ల కాలంలో కెసిఆర్, ఆయన కుటుంబం వ్యవహరించిన తీరుకు వ్యతిరేకంగా ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి.

ఇదంతా గడచిపోయి 15 నెలలు దాటాయి. ఇప్పుడిక పార్టీ రజతోత్సవాల పేరిట భారీ 'బలప్రదర్శన' కు కెసిఆర్ నడుం బిగించారు. బిఆర్ఎస్ పార్టీ హెడ్ క్వార్టర్ 'తెలంగాణ భవన్' అన్నది కేవలం సాంకేతికమే. మొత్తం కార్యకలాపాలను కెసిఆర్ తన ఎర్రవల్లి ఫార్మ్ హౌజ్ కు బదిలీ చేశారు. ఫార్మ్ హౌజ్ నుంచి రాజకీయపార్టీ కార్యక్రమాలను, సమావేశాలు, సమీక్షలు నడుపుతున్న పార్టీగా బిఆర్ఎస్ దేశంలోనే ప్రత్యేక ప్రాధాన్యాన్ని సంపాదించుకున్నది. ప్రజలకు ప్రగతిభవన్ అయినా, ఫార్మ్ హౌజ్ అయినా 'ఏవగింపు' అన్న సంగతి కెసిఆర్ గ్రహించకపోవడం ఒక విషాదం. 'నా మాటే శాసనం' అని ఆయన అనుకుంటారు కనుక దానికిక తిరుగుండదు. జనంలో ఇలాంటి వ్యవహారాల వలన తప్పుడు సంకేతాలు వెడతాయని ఆయనకు ఎవరూ చెప్పే సాహసం చేయరు. చేసినా ఆయన వినే రకమూ కాదు.

ఎల్కతుర్తి బహిరంగసభలో కెసిఆర్ ఏమి మాట్లాడతారన్నది సర్వత్రా ఆసక్తిని కలిగిస్తోంది. 'జాతీయ పార్టీ' కథ ముగిసినట్లుగా అందరూ భావిస్తున్నారు. కనుక 'ప్రాంతీయ వాదాన్ని' ఆయన మళ్లీ ఆశ్రయించనున్నారు. తెలంగాణ ప్రజల బాధలు, గాథలు తనకు కాకుండా మరెవరికీ తెలియదనీ, తాము మరలా అధికారంలోకి వస్తే తప్ప 'తెలంగాణను గాడిలో పెట్టడం సాధ్యం కాద'ని కెసిఆర్ చెప్పనున్నట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయాంలో తెలంగాణ పూర్తిగా విధ్వంసమైపోయిందని ఆయన కొన్ని లెక్కలు చెప్పవచ్చు. మాటల గారడీలో దిట్ట కనుక తెలంగాణ మాండలికపు పంచ్‌లు ఎలాగూ ఉంటాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని 'మోకాలెత్తు లేనోడు' అని బాడీ షేమింగ్ చేయవచ్చు. రజతోత్సవసభను కొందరు 'జన బలప్రదర్శన' అంటుండగా, మరికొందరు 'ధనబల' ప్రదర్శనగా విమర్శిస్తున్నారు. 25 ఏళ్ల వైభవాన్ని చాటిచెప్పడానికి బాహుబలి వేదిక నిర్మించారు.కనీవినీ ఎరుగని రీతిలో జనసమీకరణ జరుగుతోందని బిఆర్ఎస్ నాయకులు చెబుతున్నారు. పది లక్షల మంది జనం హాజరవుతారని ఒక అంచనా. 1213 ఎకరాల్లో బహిరంగ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. 159 ఎకరాల్లో సభా ప్రాంగణం, 5 ఎకరాల విస్తీర్ణంలో సభా వేదిక ఉన్నాయి. ఐదు వందల మంది కూర్చునేలా సభా వేదిక తయారైంది. సభకు వెనుక 4 ఎకరాలు విఐపి పార్కింగ్‌కు కేటాయించారు. 150 ఎకరాల్లో ప్రజలు, మీడియా, ఉద్యమకారులకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నారు. మిగిలిన స్థలాన్ని భోజన వసతి, పార్కింగ్ కోసం కేటాయించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పది లక్షల మజ్జిగ ప్యాకెట్లు, 10 లక్షల వాటర్ ప్యాకెట్లను అందుబాటు లో ఉంచనున్నారు. ఈ సభకు మొత్తంగా దాదాపు 200 కోట్లకు పైగానే ఖర్చు చేస్తున్నట్టు ప్రచారం సాగుతోంది.

కాగా 'మర్దన కళ' గురించి మనం మాట్లాడుకోవాలి. భౌతిక మర్దనకు దేహ సౌఖ్యం, ఆరోగ్యం మాత్రమే పరమ ప్రయోజనాలైతే, అభౌతిక మర్దనకు అంతకు మించిన ఆధిభౌతిక ప్రయోజనాలు ఎన్నో



ఉన్నాయి. 'మహదానందానికి మీరు కేవలం ఒక మర్దనదూరంలో ఉన్నారు' అనేది ఒక మర్దన కేంద్రం వ్యాపార నినాదం. మర్దన కలిగించే మహదానందం కోసమే మనుషులు అర్రులు చాస్తుంటారు. భౌతిక మర్దనలో కించిత్ శారీరక శ్రమ ఉంటుంది గాని, అభౌతిక మర్దనలో అలాంటిదేమీఉండదు. ఊరకే నోటికి పనిచెప్పి, ఎదుటివారికి పరమానందం కలిగించే మాటలు అదనుచూసి మాట్లాడితే చాలు భౌతిక మర్దనకు మించిన ప్రయోజనాలు అనాయాసంగానే నెరవేరుతాయి. అభౌతిక మర్దనకు కీలక సాధనం పొగడ్త. పొగడ్త అగడ్త అని అంటారు. చాలామందికి ఈ సంగతి తెలిసినా, తెలిసితెలిసి మరీ పొగడ్తలకు పడిపోతారు.

పొగడ్త 'మనోమర్దన' కళ. పొగడ్తలతో ఎదుటివారిని పడగొట్టడం ఒక కళ అయితే, పొగడ్తలకు పడిపోవడం ఒక బలహీనత.మనుషులన్నాక బలహీనతలు సహజం. మరి మనుషులన్నాక కొంత కళాపోషణ కూడా ఉండాలి కదా! అధికారంలో ఉన్న అత్యధికులకు పొగడ్తలు ఒక వ్యసనం. అధికారంలో ఉన్నవారిని పొగుడుతూ పబ్బం గడుపుకోవడం చాలామంది బతకనేర్పరులకు ఒక కాలక్షేపం. అధికారంలో ఉన్నవారు చండశాసనులుగా ఎంతటి ప్రచండ ప్రఖ్యాతి పొందినా, 'ముక్కోపానికి విరుగుడు ముఖస్తుతి' అని ఎరిగిన ధీమంతులు అలాంటివారిని కూడా తమ 'వాగ్మర్దన కళ'తో సులువుగా లోబరచుకుంటారు. కెసిఆర్ అంతటి గొప్ప రాజకీయ నాయకుడు ఈ పొగడ్తలకు,మనో మర్దన కళకు లొంగిపోయినందువల్లనే ఆయన జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలని అనుకున్నారు. 'ప్రధాని అయ్యే అవకాశాలున్నాయని' భజనపరులు చేసిన 'మసాజ్' కెసిఆర్ ను ఎక్కడో ఊహాలోకాల్లోకి తీసుకుపోయింది.

తెలంగాణ గడ్డ పోరాటాలకు అడ్డ అనేది జగమెరిగిన సత్యం. ఆత్మగౌరవ పోరాటం నుంచే తెలంగాణ ఉద్యమం ఉద్భవించింది. తుపాకీ గుళ్లకు ఎదురొడ్డి నిలిచిన కొమరం భీం చరిత్ర మనకున్నది. నైజాం నవాబుల అరాచకాలను అణిచివేసిన, రాంజీ గోండు పోరాట వారసత్వం మనది. చివరకు ఆంధ్ర పాలకులను పారద్రోలడానికి, తొలి, మలిదశ తెలంగాణ పోరాటాలను చేసి, తెలంగాణ సాధించిన నేల మనది. ఈ ఉద్యమం పోరాటాలలో వేలమంది నేలకొరిగారు. లక్షలమంది గొప్ప త్యాగధనులుగా చరిత్రలో నిలిచిపోయారు. ఎన్నో చారిత్రక ఆధారాలు, మరెన్నో చరిత్ర పుస్తకాలు ఇవి నిజమని చెప్పడానికి మనకు సాక్ష్యాధారాలుగా ఉన్నవి. కానీ కెసిఆర్ మాత్రం తానే చరిత్ర అని, తనతోనే చరిత్ర లిఖించబడిందని గట్టిగా నమ్ముతారు. అందుకే ఆయనను 'జాతిపిత' గా ఎవరైనా పిలిస్తే సంబరపడిపోతారు. 'తెలంగాణ ఉద్యమ నిర్మాణంలో రాళ్ళెత్తిన కూలీలను' ఉద్దేశపూర్వకంగానే కెసిఆర్ విస్మరించారు.

తెలంగాణ ఉద్యమంలో ముఖ్యపాత్ర పోషించిన విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతే పెద్దఎత్తున ఉద్యోగాల కల్పనా జరుగుతోంది. కెసిఆర్ హయాంలో ఉద్యోగాల భర్తీ జరగక పోగా జరిగినా లీక్‌లు, రద్దు, కోర్టు కేసులు అంటూ నిరుద్యోగుల ఆకాంక్షలు దెబ్బతీశారు. అయినా నిరుద్యోగులలో మునుపటి ఉద్యమాలు లేకపోవడం ఒక పరిణామమే. అప్పటి పోరాటాలు లేవు. ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ ఉద్యోగాన్ని పణంగా పెట్టి తెలంగాణ ఉద్యమం కోసం పోరాడారు. ఆ సమయంలో ఉపాధ్యాయుల సమస్యలు సర్వీసు రూల్స్‌కు 'ఇన్ని పేజీలెందుకు,మూడు పేజీలు సరిపోవా'? అని తెలంగాణ వస్తే అసలు సమస్యలే ఉండవన్నట్టు కెసిఆర్ అన్నారు. ఒకప్పుడు ప్రభుత్వాలను గడగడలాడించిన ఉద్యోగ సంఘాల నాయకులు పదవుల కోసం పాలకుల చుట్టూ పాకులాడేలా కెసిఆర్ చాకచక్యంగా వ్యవహరించారు.

తెలంగాణ వస్తే మన నిధులు మనమే ఖర్చుపెట్టుకుంటామని, మన నీళ్ళు మనకే వస్తాయని తద్వారా తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నమ్మి ఉద్యమంలో జనం పాల్గొన్నారు. కానీ తెలంగాణ వచ్చాక ఏమైంది? మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణ 7 లక్షల కోట్లకు పైగా అప్పు చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించి, పైగా సంపద సృష్టించినట్టుగా ప్రచారం చేసుకోవడం బిఆర్ఎస్ పార్టీకే చెల్లుబాటు అవుతోంది. అధికారం కోసం ఉచితాల పేరుతో దగ్గర బంధువులకు, కోట్లకు కోట్లను కట్టబెట్టి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నా ప్రశ్నించిన వారు లేరు.

ఉచిత పథకాల పేరుతో మానవ వనరులను, ప్రకృతి సంపదను, జలవనరులను చెరబట్టినా ప్రతిఘటించిన వారు లేరు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో కెసిఆర్ పాలన లో భావ ప్రకటన స్వేచ్ఛ లేదు. ప్రజాస్వామిక స్వేచ్ఛ లేదు. ఎన్నో నిర్బంధాలు, మరెన్నో ఆంక్షలు. ఇప్పుడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే ఈ 15 నెలల్లోనే ఆర్థిక రంగం చిన్నాభిన్నమైపోయినట్లు, రాష్ట్రమంతటా అంధకారం అలుముకున్నట్టు, ప్రజలు తిండి లేక మలమల మాడిపోతున్నట్లు, రైతులు పొలాల్లో, వ్యవసాయ మార్కెట్లలో పిట్టల మాదిరిగా రాలిపోతున్నట్టు కెసిఆర్ చేస్తున్న ప్రచారం ప్రజల్లోకి బలంగా తీసుకువెడుతున్నారు.

ఇలాంటి ప్రచారపర్వానికి పరాకాష్టగానే ఎల్కతుర్తి సిల్వర్ జూబిలీ సభను చూడవలసి ఉన్నది.పైగా 'ప్రభుత్వ వ్యతిరేక సభ' గా రజతోత్సవ సభ మారిపోతుందని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి నిర్వచించారు. ఈ సభలో రేవంత్ రెడ్డిపై ఎన్ని టన్నుల నిప్పులు కురిపించగలరో, ఎన్ని టన్నుల బురద జల్లనున్నారో ఊహించడం కష్టం కాదు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ప్రజల్లో 'తిరుగుబాటు' మొదలయిందంటూ కెసిఆర్ వ్యాఖ్యానిస్తున్నారు. అధికారాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ, రెండో టర్మ్‌లోనూ గెలిచే వ్యూహాలను ఇప్పటి నుంచే రేవంత్ పదునుబెడుతున్నారు. బిఆర్ఎస్ ప్రాంతీయవాద జాతీయ పార్టీయా? లేక జాతీయవాద ప్రాంతీయ పార్టీయా? అన్న అంశంపై బిఆర్ఎస్ నిర్మాత కెసిఆర్ తమ పార్టీ రజతోత్సవ సభలో స్పష్టత ఇవ్వవచ్చు. ఉద్యమ ఆకాంక్షల పునాదులపై నిర్మించిన టిఆర్ఎస్‌కు, ఇతర ప్రాంతీయ పార్టీలతో పోలికే లేదు. టిఆర్ఎస్ 'రాజ్యాంగం' వేరు. కెసిఆర్ 'సిలబస్' వేరు. ఆయనే ఒక యూనివర్సిటీ. 'ఫక్తు రాజకీయపార్టీ' అని ప్రకటించిన నాటినుంచే మిగతా పార్టీల అవలక్షణాలన్నీ వచ్చేశాయి.

# ఆదివాసీల అస్తిత్వంలో ఇప్పపువ్వు మూల వనరు

భారతదేశ ఆదిమ తెగల ప్రకృతి జీవనంలో ఒక చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకున్న వృక్షం ఇప్ప చెట్టు. అందుకే అదిలాబాద్ ఇప్ప పువ్వు లడ్డులను మన్ కి బాత్ కార్యక్రమం లో ప్రధాని నరేంద్ర మోడీ ప్రస్తావించి ఇప్ప పువ్వు యొక్క పోషకాలు ఆహార పద్ధతిపై గొప్పగా చెప్పారు. ఉట్నూర్ గోండు మహిళల కృషి నీ కొనియాడారు. ఈ క్రమం లో ఈ పువ్వు ప్రాధాన్యత సంతరించుకుంది. ఆదివాసీల ప్రధాన ఆహారపు అలవాట్లలో ఇప్ప పువ్వు ప్రధానమైనది. ఒకానొక సందర్భంలో కరువు కాటకాలు సంభవించినపుడు ఆదివాసీ జాతికి అనేక రకాల ఆహార ఉత్పత్తులను అందించి బ్రతికించింది అని చెప్తారు గూడెం పెద్దలు. అందుకే ఆదివాసీల ఆరాధ్య దైవంగా నేడు ఇప్ప చెట్టు ఉంది. తమ సాంస్కృతిక జీవనంలో ఇది లేకుండా పండుగలు జాతరలు జరగవు. భౌగోళిక దక్కన్ పీఠభూమిలో చోట నాగపూర్, సెంట్రల్ హైలాండ్ పీఠ భూమిలో ఆ భూమి యొక్క సారంకి అనుగుణంగా ఇప్పచెట్టు తన రూపం మార్చుకుంటుంది కానీ దానిని ఉపయోగించటంలో మాత్రం ఒకే విధానాలు అవలంబిస్తారు. లేత పసుపురంగులో ఎర్రని రెమ్మలతో మాఘ పున్నమిలో కొమ్మలకు కోలువేసి కాముని పున్నమి వరకు పువ్వు వికసించే ఒక అందమైన పరిమళం ఇది. బుట్టలో ఇంటికి తీసుకు వచ్చి వెంటనే వాకిట్లో ఆరబోస్తారు, అలా 20 నుండి 30 రోజుల పాటు ఎండలో ఆరబోసిన వాటిని మళ్లీ బుట్టలోకి తీసుకున్న తర్వాత అడవికి వెళ్లి పెద్ద తునికాకులు సేకరించి ఇస్తారి ఆకు కుట్టి జల్లగానీ గంపలుగానీ తీసుకొని వాటి లోపల ఇస్తార్లు కుట్టిన ఆకులను పరిచి ఎండపెట్టిన ఇప్ప పువ్వులను గంపలో వేసి తొక్కుతారు. సంవత్సరం వరకు నిల్వ ఉంటాయి. దీనికి గాలి మరియు నీరు తగలకుండా భద్రపరుస్తారు. ఇప్పపువ్వు కుడుములు అంటె లడ్డూలు కూడ ఇడ్లిల వలె చేస్తారు. ఇప్ప పువ్వులను కుడుములు చేయటానికి కొన్ని తీస్కొని పొయ్యి మీద కుండ పెట్టి సరిపడ నీళ్లు పోసి మధ్యలో వెదురు పుల్లలు పెట్టీ వాటిపై ఇప్పపూలు, తెల్ల జొన్నల గడక కలిపి ముద్దలు చేసి గుడ్డ పరిచి వాటిపై పెడుతారు. అలా ఆవిరికి ఉడికి ఇప్ప పూల లడ్డు తయారు అవుతుంది ఆహారంగా తింటారు. ఇప్ప గింజల నుండి నూనెను ఉత్పత్తి చేస్తారు ఆదివాసులు. జూన్‌లో పలుకులు తీస్తారు అవి ఎండిన తర్వాత రోట్లో వేసి దంచి పిండిలా చేసి ఆ పిండిని కుండలో వేసి ఉడకబెడతారు. రెండు గంటల సమయం ఉడికిన తర్వాత దాన్ని తీసి వేడిగా ఉన్నప్పుడే తాటి ఆకుల బుట్టలో గట్టిగా కూరుస్తు ఈ బుట్టలను గానుగ మొద్దులో పెట్టి నూనె ఉత్పత్తి చేస్తారు – ఇది ప్రాచీన పద్ధతి.



ఇప్ప పువ్వుతో రొట్టెలు కూడా చేస్తారు. తెల్లజొన్నలను పోసి ఉడకపెట్టి రుబ్బు బండ పైన వేసి మెత్తగా రుబ్బి ఆ ముద్దను ఒక అటికలో వేసుకుని పిండిలో ఉప్పు కలిపి పొయ్యిమీద పెంక పెట్టి వేడయ్యాక అందులో నూనె లేద నెయ్యి వేసి ఒక ఆకు పైన రొట్టె లాగ అద్ది పెంక పైన వేసి రెండు వైపుల కాల్చి చేస్తారు



ఇప్పపువ్వు సార ఆదివాసి జీవనంలో అతి ప్రాచీనమైనది, ప్రధానమైనది, అతి పవిత్రమైనది కూడ. ఈ సార మనిషి సేవించడం మానవునిలో రోగనిరోధకశక్తిని మెరుగు పరుస్తుంది. అందుకే దీనిని స్త్రీ, పురుషులు, చిన్నపిల్లల తేడా లేకుండ సేవిస్తారు. ప్రధానంగా పండుగలు సమ్మక సారలమ్మ ఇలవేల్పు జాతరలు, పెళ్లిళ్ళు, దిన కార్యాలు ఉమ్మడిగా నిర్వహించే ప్రతి కార్యక్రమంలో ఉమ్మడిగా సేవిస్తారు. ఇప్పపువ్వులను కుండ లో 9 రోజులు నాన పెట్టి కుండ పై చిన్న కుండ పెట్టి ఆవిరి ద్వార సార తీస్తారు . ఇలా 30 రకాల ఆదివాసీల ఆహారపు అలవాట్లకు, కడుపు నింపటానికి ఒక ఆధారం అయింది ఇప్ప పువ్వు.

గణేష్ కోర్నిబెల్లి
సమ్మక్క సారలమ్మ ఆర్కియాలజి ఇండిజినస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ తెలంగాణ
9493260760

# సమాచార కమిషనర్ల నియామకమెప్పుడు?

అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా వర్ధిలుతున్న భారతదేశంలో సమాచార హక్కు చట్టం 2005 అమలులోకి రావడం వెనుక మేధావుల సైద్ధాంతిక దార్శనికతలు, స్వచ్ఛంద సంస్థల జనజాగృతులు మరియు ప్రజల పోరాటోద్యమాల నిర్విరామ కృషి ఎంతగానో ఉంది. ప్రజలకు సుపరిపాలన అందించడం లక్ష్యంగా 2005 అక్టోబర్ 12 నాడు దేశంలో సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చింది.

అవినీతిని నిరోధించడంలో పౌరులకు ఉన్న ఏకైక 'బ్రహ్మాస్త్రం'గా ఈ సమాచార హక్కు చట్టం ఎంతగానో దోహదపడుతూనే ఉంది. కాని ఈ సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి 20 ఏళ్లు కావస్తున్ననూ కూడా నేటికిని కూడా ఈ చట్టం సజావుగా అమలుకు నోచుకోవడం లేదు. ఫలితంగా సమాచార హక్కు లక్ష్యాలు నీరుగారిపోతున్నాయి. ముఖ్యంగా సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం రాష్ట్ర సమాచార కమీషన్‌లో ఒక ప్రధాన సమాచార కమీషనర్‌తో పాటు గరిష్ఠంగా పదిమంది సమాచార కమిషనర్లు ఉంటారు. కాని నేడు తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన సమాచార కమీషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన బుద్ధా మురళి, మిగతా కొందరు సమాచార కమీషనర్లు పదవీ విరమణ చేసి రెండేళ్లకు పైగానే గడిచిపోయింది.

2023 ఫిబ్రవరి 24 నాడు చివరి సమాచార కమీషనర్ కూడా పదవీ విరమణ చేశారు. అయిననూ నేటికిని తెలంగాణ రాష్ట్ర సమాచార కమీషనర్ల నియామకాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఎండమావిగ మిగిలిపోవడం కడు విచారకరం. తెలంగాణ రాష్ట్ర సమాచార కమీషన్ కార్యాలయంలో ఈ రకంగా ప్రధాన సమాచార కమీషనర్ సహా సమాచార కమిషనర్ పదవులు ఏకంగా సంవత్సరాలకు తరబడి ఖాళీగా ఉన్నందున పౌరులు సమాచారం కోసం అప్పీ లు చేసుకుంటున్నా కూడా వాటిని స్వీకరించి ప క్కన పెట్టుకుంటున్నారు. తత్ఫలితంగా సమాచార కమీషన్ కార్యాలయంలో దరఖాస్తుదారుల సమాచార హక్కు అప్పీళ్లు పేరుకుపోతూనే ఉన్నాయి. 2024 డిసెంబర్ 28 నాటికి 10,688 అప్పీళ్లు సమాచార కమీషన్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నాయి. రోజురోజుకు ఈ అప్పీళ్లు పెరిగిపోతూనే ఉన్నాయి.

అందువలన రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సమాచార కమీషనర్లను నియమించాలి అని ప్రజలు, సమాచార కార్యకర్తలు అడపాదడపా డిమాండ్ చేస్తూనే ఉన్నారు. సమాచార కమీషనర్లు ఉన్నప్పుడు అరకొర సమాచారం అయినా పౌరులకు అందుబాటులోకి వచ్చేది. ఇప్పుడు ఏకంగా కమీషనర్లు లేకపోవడం మూలంగా ఏ చిన్న సమాచారాన్ని కూడా ప్రజలు పొందలేకపోతున్నారు. ఆయా సమాచార కమీషనర్ పోస్టులు రెండేళ్లకు పైగానే భర్తీకి నోచుకోకపోవడం వల్ల అంతిమంగా 'సమాచార హక్కు చట్టం లక్ష్యాలు అసలుకే ఎసరులా ఆవిరి అవుతున్నాయి' అని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు. 'త్వరలో సమాచార కమీషన్ల నియామకం కోసం సెర్చ్ కమిటీని ఏర్పాటు చేస్తాం. దీనికోసం నాలుగు వారాల గడువు కావాలి' అని ప్రభుత్వం గతంలో హైకోర్టుకు నివేదించిననూ ఆ దిశగా ఏ మాత్రం పురోగతి కనిపించడం లేదు.

జెజెసిపి బాబూరావు
94933 19690

# కావలసింది నినాదాలు కాదు... నిర్మాణాత్మక నిర్ణయాలు




ఐ.పి.రావు

ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలన అంతా మతం, మద్యం పైనే కేంద్రీకృతమై ఉంటుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మహాత్మాగాంధీజీ మద్యపాన రహిత దేశంగా భారత్ ఉండాలని ఆశించగా, స్వాతంత్ర్య సమరయోధులు, రాజ్యాంగ నిర్మాతలు, దార్శనికులు భారతదేశం సోషలిస్టు, సెక్యులర్, ప్రజాస్వామ్య పద్ధతిలో కొనసాగాలని ఆశించారు.. దీనికోసమే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కూడా రాజ్యాంగం రచించడమే కాకుండా, అందరికీ సమన్యాయం చేయాలని ఆర్థిక, సామాజిక, రాజకీయ, సమానత్వం కోసం పాటుపడ్డారు. బౌద్ధ మతం స్వీకరించి తదనుగుణంగా తన జీవిత లక్ష్యాలను ప్రజలకు తేటతెల్లం చేసాడు..ఇక మొట్టమొదటి ప్రధాన మంత్రి జవహర్లాల్ నెహ్రూ మత పరమైన కార్యక్రమాలకు దూరంగా, దేవాలయాలు సందర్శనాలకు దూరంగా ఉంటూ, దేశంలో లౌకిక విధానానికి అనుగుణంగా తన జీవిత ప్రయాణం కొనసాగించారు. దేశంలో శాస్త్ర సాంకేతిక రంగాలకు, పారిశ్రామిక అభివృద్ధికి పునాదులు వేశారు..తరువాత వచ్చిన ఇందిరాగాంధీ కూడా దాదాపు ఇవే ప్రమాణాలు పాటించడం జరిగింది. అయితే ప్రస్తు త పాలకులు తరచూ దేశంలో ఉన్న దాదాపు అన్ని దేవాలయాలు, గుళ్ళు సందర్శించడమే పెద్ద పనిగా పెట్టుకున్నారు.. అదే సమయంలో అల్లర్లతో అట్టుడుకుతున్న మణిపూర్ లాంటి రాష్ట్రాన్ని మాత్రం దర్శించరు. అక్కడ ప్రజలకు భరోసా ఇవ్వరు. ఇటీవల కాలంలో ముఖ్యంగా గత ఇరవై సంవత్సరాలుగా దేశంలో ఉన్న'భిన్నత్వంలో ఏకత్వం' అనే భావనకు వ్యతిరేకంగా రాజకీయ పార్టీలు నాయకులు కులం, మతం, ప్రాంతం, భాష వంటి సున్నితమైన అంశాలను వివిధ సందర్భాల్లో ప్రజలపై రుద్దుతూ, ప్రజల ఓట్లతో అధికారం చేపట్టడం జరుగుతుంది.. అదే సందర్భంలో మనీ, మద్యం విపరీతంగా వినియోగిస్తూ రాజకీయ పార్టీలు అధికారంలోకి వస్తున్న సంప్రదాయం పెరిగింది.. దీనికి తోడు కేంద్రం, రాష్ట్రాలు అప్పులు ఊబిలో చిక్కుకున్నా, మరల విచ్చలవిడిగా ఉచిత పథకాలు, సంక్షేమ పథకాలు అమలు చేస్తాం అంటూ ప్రజలకు హామీలు ఇచ్చి అధికారంలోకి రావడం మనం అందరం చూస్తున్నం. దీనికి తాజా ఉదాహరణ ఇటీవల జరిగిన హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్నికలే...

గత దశాబ్దకాలంగా దేశాన్ని పాలిస్తున్న పాలకులు ఒకే మతానికి ప్రాధాన్యత ఇస్తూ, మతం, దేవాలయాలు, మత క్రతువులు, కుంభమేళా వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను మతం వైపు మొగ్గు చూపే విధంగా తర్ఫీదు ఇవ్వడం జరుగుతుంది.అన్ని అంశాలను'ఒకే' అనే నినాదంతో ముడిపెట్టడం జరుగుతుంది. దేశంలో పెరుగుతున్న నిత్యావసర ధరలు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి విషయాలుపై ప్రజలు ఆలోచన చేయకుండా చేస్తున్న గమ్మత్తైన గేమ్ ఆడుతున్నారు.. ఈ ఉచ్చులో ప్రజలు కూడా పడిపోతున్నారు. ఇక చాలా రాష్ట్రాలు అపరిమిత మైన ఉచిత పథకాలు అమలు చేస్తూ అప్పుల్లో మునిగి తేలుతూ ఉన్నాయి.. దీనికి మన తెలుగు రాష్ట్రాలే చక్కటి ఉదాహరణ... గత ప్రభుత్వాలు చేసిన అప్పులు తెలిసికూడా, ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా ఇంకా ఉచిత పథకాలు ప్రకటించి అధికారంలోకి వచ్చాయి... తీరా అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను అమలు చేయడానికి 'టెంపుల్ టూరిజం' అని మతపరమైన కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ, మరోపక్క 'మద్యం(లిక్కర్)' అమ్మకాలు పెంచడం, ప్రోత్సహించడం జరుగుతూ ఆదాయ సముపార్జన చేయడానికి సన్నాహాలు ముమ్మరం చేస్తున్నారు... ఇది ప్రస్తుతం మన కళ్ళకు కట్టినట్లు కనపడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలన...

> ప్రస్తుతం 'ట్రంప్' తీసుకుంటున్న 'టారిఫ్' నిర్ణయాలు ప్రపంచ దేశాలను వణికిస్తుంటే,. ఒకే ఒక 'చైనా' దేశం 'భయపడేది లేదు' అంటూ అమెరికాను హెచ్చరించ గలుగుతుంది అంటే, దీనికి ప్రధాన కారణం ఆ దేశం సాధించిన పారిశ్రామిక అభివృద్ధి అని గ్రహించాలి..ఇక మన దేశం రాష్ట్రాలు స్వయం సమృద్ధి సాధించేందుకు కృషి చేయాలి.. ఆత్మ నిర్భర్ భారత్ సాధనలో నిమగ్నమవ్వాలి. మతం, మద్యం వైపు ప్రజలను ప్రయాణింప చేయడం గాకుండా, ప్రభుత్వం విద్య, వైద్యం ప్రజలకు అందిస్తూ స్వయం ఉపాధి అవకాశాలు పొందే విధంగా ప్రయత్నాలు చేయాలి. అపరిమితమైన ఉచిత పథకాలకు స్వస్తి పలకాలి.

వికసిత భారత్, వికసిత ఆంధ్రప్రదేశ్, రైజింగ్ తెలంగాణ వంటి నినాదాలతో హోరెత్తిస్తున్నారు..ఆ దిశగా మన దేశం, రాష్ట్రాలు చేరాలంటే, నినాదాలు సరిపోవు అని పాలకులు ఇకనైనా గ్రహించాలి.. నిర్మాణాత్మకమై న నిర్ణయాలు తీసుకోవాలి. నాణ్యమైన విద్య అందరికీ అందించవలసిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది అని గ్రహించాలి. శాస్త్ర సాంకేతిక విజ్ఞానం అందించాలి. విద్య, వైద్యంపై దృష్టి సారించాలి. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాలి. పారిశ్రామిక రంగానికి ఊతం ఇవ్వాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగు పరచడానికి కృషి చేయాలి... ప్రస్తుతం 'ట్రంప్' తీసుకుంటున్న 'టారిఫ్' నిర్ణయాలు ప్రపంచ దేశాలను వణికిస్తుంటే,. ఒకే ఒక 'చైనా' దేశం 'భయపడేది లేదు' అంటూ అమెరికాను హెచ్చరించ గలుగుతుంది అంటే, దీనికి ప్రధాన కారణం ఆ దేశం సాధించిన పారిశ్రామిక అభివృద్ధి అని గ్రహించాలి..ఇక మన దేశం రాష్ట్రాలు స్వయం సమృద్ధి సాధించేందుకు కృషి చేయాలి.. ఆత్మ నిర్భర్ భారత్ సాధనలో నిమగ్నమవ్వాలి. మతం, మద్యం వైపు ప్రజలను ప్రయాణింప చేయడం గాకుండా, ప్రభుత్వం విద్య వైద్యం ప్రజలకు అందిస్తూ స్వయం ఉపాధి అవకాశాలు పొందే విధంగా ప్రయత్నాలు చేయాలి. అపరిమితమైన ఉచిత పథకాలకు స్వస్తి పలకాలి.. ప్రజల్లో సోమరితనం పెంచరాదు.. మతం, మద్యం మత్తులో ప్రజలను ముంచరాదు.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## 575 మంది కేరళీయులు ఇంకా కశ్మీర్‌లోనే: విజయన్



**తిరువనంతపురం :** జమ్ముకశ్మీర్‌లో పహల్గామ్ ఉగ్రవాద దాడిలో 26 మం ది ప్రాణాలు కోల్పోగా, కేరళకు చెందిన 575 మంది ఇప్పటికీ కశ్మీర్‌లోనే ఉన్నారని, అవసరమైన వారికి ప్రయాణం, వైద్య సహాయం, ఆహారం అం దించడానికి చర్యలు తీసుకున్నామని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. కశ్మీర్ నుండి ఢిల్లీకి వచ్చేవారికి తదుపరి ప్రయాణానికి టికెట్ బుకింగ్‌తో సహా ఏర్పాట్లు చేసినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి దేశ మనస్సాక్షిని దిగ్భ్రాంతికి గురిచేసిన దాడిగా అభివర్ణించిన విజయన్, ఇది మళ్ళీ జరగడానికి అనుమతించకూడదని, ఇది మానవాళిపై జరిగిన దాడి అని అన్నారు. అక్కడ ప్రాణాలు కోల్పోయిన వారిలో ఒక కేరళీయు డు ఉండటం మా దుఃఖాన్ని రెట్టింపు చేసిందని, మరణించిన ఎన్ రామచంద్రన్ బంధువుల దుఃఖంలో తాము కూడా పాలుపంచుకుంటున్నామన్నారు. ఇలాంటి దాడులకు, వాటికి ఆజ్యం పోసే ద్వేషపూరిత ప్రచారానికి వ్యతిరేకంగా అందరూ ఐక్యంగా నిలబడాలని ఆయన అన్నారు.

## మన గణతంత్ర విలువలపై
# నేరుగా జరిగిన దాడి

పాకిస్థానే సూత్రధారి,
ఇది పిరికిపంద చర్య
దాడిని ఖండిస్తూ సిడబ్ల్యుసి సమావేశం తీర్మానం



**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి పాకిస్థాన్ సూత్రధారి అని, ఇది పరికిపంద చర్య అని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. ఈ దాడి మన గణతంత్ర విలువలపై ప్రత్యక్ష దాడి అని అభివర్ణించింది. ఐక్యత అత్యంత అవసరమైన సమయంలో ఈ విషాదాన్ని బిజెపి విద్వేషానికి ఉపయోగించుకుంటుందని ఆరోపించింది. పార్టీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి).. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రత్యక్షం పరిధిలో ఉన్న కేంద్రపాలిత ప్రాంతంలో ఇటువంటి దాడికి దారితీసిన నిఘా వైఫల్యాలు, భద్రతా లోపాలపై సమగ్ర విశ్లేషణ నిర్వహించడం అత్యవసరం ఉద్ఘాటించింది. ఢిల్లీలో 24, అక్బర్ రోడ్‌లో ఉన్న పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన సిడబ్ల్యుసి సమావేశానికి పార్టీ మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శులు కెసి వేణుగోపాల్, జైరామ్ రమేష్, ప్రియాంక గాంధీ వాద్రా తదితరులు పాల్గొన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి బాధితుల జ్ఞాపకార్థం నాయకులు ఒక క్షణం మౌనం పాటించి నివాళులర్పించారు. అయితే కీలకమైన సమావేశంలో పాల్గొనడానికి రాహుల్ గాంధీ తన అమెరికా పర్యటనను ముగించుకుని తిరిగి వచ్చారు. సిడబ్ల్యుసి సమావేశంలో పహల్గామ్‌లో జరిగిన దారుణమైన ఉగ్రవాద దాడిలో 26 మంది అమాయక పర్యాటకులు ప్రాణాలు కోల్పోగా, అనేక మంది గాయపడటం పట్ల పార్టీ అత్యున్నత నిర్ణయాధికార సంస్థ దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. దాడిని తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్, జైరాం రమేష్, పవన్ ఖేరా విలేకరుల సమావేశంలో చదివి వినిపించారు. దేశవ్యాప్తంగా హిందువులను లక్ష్యంగా చేసుకుని జరిగిన దాడి అని, దేశవ్యాప్త భావోద్వేగాలను రెచ్చగొట్టడానికే చేశారన్నారు. 'పహల్గామ్ దాడికి పాకిస్థాన్ సూత్రధారి. ఇది ఒక ప్రణాళికాబద్ధంగా జరిగింది. గణతంత్ర విలువలపై ప్రత్యక్ష దాడి. దేశవ్యాప్తంగా భావోద్వేగాలను రెచ్చగొట్టడానికే హిందువులను ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకోవడం జరిగింది. ఈ తీవ్రమైన రెచ్చగొట్టే చర్యను ఎదుర్కొని ప్రశాంతంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నాము. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని మన సమష్టి బలాన్ని పునరుద్ఘాటిద్దాం' అని తీర్మానం పేర్కొంది. ఈ సమయంలో ప్రజలు శాంతియుతంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది. సీమాంతర ఉగ్రవాదాన్ని యుక్తితో ఐక్యంగా ఎదుర్కోవాలని తీర్మానంలో చెప్పింది. జమ్ముకశ్మీర్‌లో జరిగిన ఈ మారణహోమాన్ని అన్ని రాజకీయ పార్టీలు, కేంద్రపాలిత ప్రాంత ప్రజలు సమర్థవంతంగా ఖండించారని కాంగ్రెస్ గుర్తుచేసింది. అయితే ఐక్యత, సంఘీభావం అత్యంత అవసరమైన సమయంలో మరింత అసమ్మతి, అపనమ్మకం, విభజనను ప్రోత్సహించేందుకు బిజెపి అధికారిక, పరోక్ష సోషల్ మీడియా వేదికల ద్వారా ఈ ఘోర విషాదాన్ని ఉపయోగించుకోవడం దిగ్భ్రాంతికరమని తీర్మానం పేర్కొంది. పహల్గామ్ అత్యంత రక్షణాత్మక ప్రాంతంగా ప్రసిద్ధి చెందిందని, మూడు అంచెల భద్రతా ఏర్పాట్ల ద్వారా సురక్షితంగా ఉందని, ఈ పరిస్థితుల్లోనూ దాడికి దారితీసిన నిఘా వైఫల్యాలు, భద్రతా లోపాలపై సమగ్ర విశ్లేషణ చేయాలని సిడబ్ల్యుసి కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. విశాల ప్రజా ప్రయోజనం దృష్ట్యా ఈ ప్రశ్నలను లేవనెత్తాలని, ఇంత దారుణంగా నాశనమైన కుటుంబాలకు నిజంగా న్యాయం జరిగేలా చూడగలిగే ఏకైక మార్గం ఇదే అని తీర్మానం పేర్కొంది. అమర్‌నాథ్ యాత్ర త్వరలో ప్రారంభం కానుందని సిడబ్ల్యుసి గుర్తు చేస్తూ బలమైన, పారదర్శకమైన, చురుకైన భద్రతా ఏర్పాట్లను ఆలస్యం లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేసింది. భారతదేశం అంతటా లక్షలాది మంది యాత్రికులు ఈ వార్షిక ప్రయాణంలో పాల్గొంటారని, వారి భద్రతను జాతీయ ప్రాధాన్యతగా పరిగణించాలని కోరింది. జమ్ముకశ్మీర్ ప్రజల జీవనోపాధిని, అలాగే యాత్రికుల భద్రతను పూర్తి నిజాయితీ కాపాడాలని సిడబ్ల్యుసి నొక్కి చెప్పింది. అదే విధంగా భారతదేశ ఆలోచనను నిలబెట్టడానికి పర్యాటకులను రక్షించడానికి నిస్వార్థంగా ప్రయత్నిస్తున్నప్పుడు అమరవీరులైన స్థానిక 'పోనీవాలాస్', టూరిస్ట్ గైడ్‌లకు కూడా సిడబ్ల్యుసి నివాళులర్పించింది. భయంకరమైన ఉగ్రవాద దాడిలో మరణించిన వారికి సంఘీభావంగా ఈనెల 25న దేశవ్యాప్తంగా రాష్ట్ర, జిల్లా స్థాయిలో కాంగ్రెస్ కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహిస్తుందని వేణుగోపాల్ ప్రకటించారు. సిడబ్ల్యుసి తర్వాత కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గులాం అహ్మద్ మీర్ విలేకరులతో మాట్లాడుతూ పహల్గామ్ ఉగ్రవాద దాడి భద్రత, నిఘా వైఫల్యం గురించి తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతుందన్నారు. ఈ ప్రాంతంలో భద్రత ఎందుకు లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

## ఉగ్రవాదులకు ఊహించని శిక్ష విధిస్తాం

### భూమిపై ఏ మూలకు ఉన్నా వెంబడిస్తాం : ప్రధాని మోదీ ప్రకటన



**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులను దారుణంగా కాల్చివేసిన హంతకులను భూమి ఏ మూలకు ఉన్నా వెంబడించి శిక్షిస్తామని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారు. ప్రతి ఉగ్రవాదిని , వారికి మద్దతు ఇచ్చేవారిని గుర్తించి వారిని వేటాడి మరీ శిక్ష విధిస్తామని హెచ్చరించారు. ఈనెల 22న పహల్గామ్‌లో జరిగిన దాడిలో 26 మంది మరణించిన తర్వాత తొలిసారి ప్రధాని స్పందించారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా బిహార్‌లోని మధుబనిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోదీ పాల్గొని ప్రసంగించారు. దాడి వెనుక ఉన్న ఉగ్రవాదులను శిక్షిస్తామని ప్రధానమంత్రి ప్రతిజ్ఞ చేశారు. ఉగ్రవాదం ద్వారా భారతదేశ స్ఫూర్తి ఎప్పటికీ విచ్ఛిన్నం కాదని పేర్కొన్నారు. 'మిత్రులారా ఈ రోజు బీహార్ నేల నుండి, నేను మొత్తం ప్రపంచానికి చెబుతున్నాను. భారతదేశం ప్రతి ఉగ్రవాదిని, వారికి మద్దతు ఇచ్చేవారిని గుర్తించి, ట్రాక్ చేసి శిక్షిస్తుంది. మేము వారిని భూమి చివరి వరకు వెంబడిస్తాము. ఉగ్రవాదం ద్వారా భారతదేశ స్ఫూర్తి ఎప్పటికీ విచ్ఛిన్నం కాదు. ఉగ్రవాదాన్ని శిక్షించకుండా ఉండము' అని మోదీ ఇంగ్లీషులో గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు యావత్ దేశం దృఢసంకల్పంతో ఉందన్నారు. మానవత్వాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ మనతో ఉన్నారని, ఈ కాలంలో మనతో పాటు నిలిచిన వివిధ దేశాల ప్రజలకు, వారి నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. దాడి చేసిన ఉగ్రవాదులు, కుట్ర పన్నిన వారిని వారి ఊహకు మించి శిక్షిస్తామని పరోక్షంగా పాకిస్థాన్‌ను హెచ్చరించారు. 140 కోట్ల మంది భారతీయుల సంకల్ప శక్తి ఉగ్రవాదలు వెన్నెముకను విరిచివేస్తుందని ప్రధానమంత్రి అన్నారు. బాధితులకు వారి కుటుంబాలకు సంతాపం తెలియజేస్తూ, ఏప్రిల్ 22న కశ్మీర్‌లో ఉగ్రవాదులు 26 మంది అమాయక పౌరులను చంపిన దారుణమైన తీరుపై దేశవ్యాప్తంగా పౌరులు శోకసంద్రంలో ఉన్నారని అన్నారు. దేశం వారి కుటుంబాలకు అండగా నిలుస్తుందని చెప్పారు. ప్రధాని తన ప్రసంగానికి ముందు వేదికపై ఉన్న ఇతర నాయకులు, సభకు హాజరైన వారు ఉగ్రదాడి బాధితులకు నివాళులర్పించి మౌనం పాటించారు. ప్రజలు తమ కుమారులు, సోదరులు, భర్తలను కోల్పోయారని, బాధితులు బెంగాల్, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, ఒడిశా మరియు బీహార్ తదితర రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు చెందినవారని ఆయన అన్నారు. కార్గిల్ నుండి కన్యాకుమారి వరకు దుఃఖం, కోపం ఒకేలా ఉన్నాయని చెప్పారు.

## పాక్ హైకమిషన్ వద్ద నిరసనలు



**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోవడాన్ని వ్యతిరేకిస్తూ ఢిల్లీలోని పాకిస్తాన్ హైకమిషన్ సమీపంలో 500కుపైగా మంది నిరసన తెలిపారు. ప్లకార్డులు పట్టుకుని, పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పొరుగు దేశంపై నిర్ణయాత్మక చర్య తీసుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. భారతదేశంలో ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు. ఉగ్రవాద వ్యతిరేక చర్య ఫోరం వంటి వివిధ సామాజిక సంస్థలతో పాటు బిజెపి కూడా ఈ నిరసనలో పాల్గొంది. ఢిల్లీ పోలీసులు హైకమిషన్ నుండి 500 మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. నిరసనకారులను అక్కడ అడ్డుకున్నట్లు ఒక అధికారి తెలిపారు. గతంలో, ప్రభుత్వం సర్జికల్ స్ట్రైక్ చేసిందని, ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి మళ్ళీ ఇలాంటి చర్యలను చేపట్టాడలని డిమాండ్ చేస్తున్నట్లు యాంటీటెర్రర్ యాక్షన్ ఫోరం సభ్యుడు పిటిఐకి చెప్పారు. పహల్గామ్‌లో జరిగిన దాడి అమాయక పర్యాటకులపై సిగ్గుచేటు దాడి అని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికే ఒక ప్రణాళికను రూపొందించి ఉంటుందని తాము విశ్వసిస్తున్నామన్నారు. ప్రభుత్వం పాకిస్తాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని మరొక నిరసనకారుడు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం మరిన్ని సర్జికల్ స్ట్రైక్స్ అవసరమని తాము భావిస్తున్నామని, ఇది ఉగ్రవాదుల సిగ్గుచేటు చర్య అని, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఉగ్రవాదంపై కఠిన చర్యలు తీసుకుంటారని ప్రతి భారతీయుడు ఆశిస్తున్నాడన్నారు. జమ్ముకశ్మీర్‌లో జరగనున్న అమర్‌నాథ్ యాత్ర కోసం వెళ్లే యాత్రికుల భద్రతను నిర్ధారించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. 'అమర్‌నాథ్ యాత్రికుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే జరుగుతోంది, ఈ దాడి వారిలో భయాందోళనలకు గురిచేసింది. చాలా మంది భక్తులు తమ ప్రణాళికలను రద్దు చేసుకుంటున్నారు. ఇప్పుడు, కఠినమైన చర్యలు తక్షణం అవసరం' అని మరొక నిరసనకారుడు అన్నారు. హైకమిషన్ వైపు ర్యాలీగా వెళ్లడానికి కొంతమంది నిరసనకారులు బారికేడ్లను ఎక్కేందుకు ప్రయత్నించగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. అయితే ఇంకా అనేక సంస్థలు నిరసనకు పిలుపునిచ్చిన తర్వాత ఢిల్లీ పోలీసులు హైకమిషన్ వెలుపల భద్రతను కట్టుదిట్టం చేశారు. పాకిస్తాన్ హైకమిషన్ సమీపంలోని త్రిమూర్తి చౌక్ వద్ద నిరసన జరుగుతుందని తమకు సమాచారం అందిందని ఒక పోలీసు అధికారి తెలిపారు.

## ప్రపంచదేశాల దౌత్యవేత్తలకు..
# పాకిస్థాన్ ఆగడాలు వివరించిన భారత్



**న్యూఢిల్లీ:** భారత్ సరిహద్దుల్లోంచి పాకిస్థాన్ చేస్తు న్న ఉగ్రవాద ఆగడాలను ప్రపంచ దేశాల దౌత్యవేత్తలకు భారతదేశం వివరించింది. దక్షిణ కశ్మీరు అనంత్‌నాగ్‌జిల్లా పహల్గామ్ సమీపం బైసారన్ యాత్రాప్రాంతంలో మంగళవారం మధ్యాహ్నం 26 మంది పర్యాటకులను కాల్చి చంపిన ఉగ్రవాదుల దుశ్చర్యను, దాని వెనుక పనిచేస్తున్న కారకాలను వివిధ దేశాల దౌత్యవేత్తలకు భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ తెలియజేశారు. అమెరికా,రష్యా,చైనా, బ్రిటన్,ఫ్రాన్స్,జర్మనీ సహా అనేక దేశాల దౌత్యవేత్తలకు ఉగ్రవాదుల దుశ్చర్య గురించి ఆయన వివరించారు. భారత్–పాకిస్థాన్ సరిహద్దుల్లో పనిచేస్తున్న ఉగ్రవాదులు, వారికి ఉన్న సంబంధాల గురించి ఆయన వివరించారు. ఉగ్రవాదాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ భారతదేశం సహించబోదని, వారి ప్రతిచర్యకూ కఠినమైన శిక్ష లు విధిస్తుందనీ చెప్పారు. బైసారన్‌లో కాల్పుల దాడి జరిగిన మరునాడు కేంద్ర ప్రభుత్వ సిసిఎస్ సమావేశమై పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఐదు కీలక నిర్ణయాలు తీసుకుని వాటిని తక్షణ ప్రాతిపదికపై అమలులోకి తీసుకువచ్చింది. 1960 లో పాకిస్థాన్‌తో చేసుకున్న సింధు జలాల ఒప్పందం రద్దు, వాఘా సరిహద్దు మూసివేత, ప్రత్యేక వీసాల రద్దు, పాకిస్థాన్ దౌత్యకార్యాలయంలో సిబ్బంది సంఖ్యను 55 నుండి 30కి తగ్గింపు, పాకిస్థాన్ దౌత్యకార్యాలయాల్లో పనిచేసే సైనిక సిబ్బంది, దౌత్యాధికారులను అవాంఛిత వ్యక్తులుగా ప్రకటించి దేశం విడిచ వెళ్ళాలని చెప్పడంతోపాటు తాజాగా వైద్యపరమైన వీసాలతోపాటు పాకిస్థాన్ జాతీయులకు ఇచ్చిన అన్ని రకాల వీసాలను రద్దుచేస్తున్నట్లు భారత ప్రభుత్వం ప్రకటించింది. భారత పౌరులను పాకిస్థాన్‌లో పర్యటించవద్దని కూడా గట్టి ఆదేశాలు జారీ చేసింది. గతంలో భారత్ సరిహద్దులు దాటి పాకిస్థాన్ సహాయంతో ఉగ్రవాదులు చేసిన ఆగడాలను కూడా విదేశీ దౌత్యవేత్తలకు భారత ప్రభుత్వం వివరించింది. విక్రమ్ మిశ్రీ ఈ సమాచారం తెలియజేయడానికి ఏర్పాటు చేసిన సమావేశంలో ఓమన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతార్, నార్వే, ఇటలీ, ఇండోనేసియా, మలేసియా దౌత్యవేత్తలు కూడా పాల్గొన్నారు. పహల్గామ్ సమీపంలో జరిగిన దాడి వెనుక సరిహద్దుల వెలుపల నుండి ఉగ్రవాదులకు లభించిన సహాయం, వారితో ఉన్న సంబంధాలు కూడా సిసిఎస్ సమావేశంలో వెలుగులోకి వచ్చాయని, దీంతో ప్రభుత్వం పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా పలు చర్యలు తీసుకోవాలని దేశ భద్రతకు సంబంధించిన మంత్రివర్గ కమిటీ నిర్ణయించిందని మిశ్రీ చెప్పారు. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం కావడంతో, పహల్గామ్‌లో కాల్పులు జరిపిన కిరాతకులు, వారి సూత్రధారులకు ఈ భూమ్మీద ఎక్కడా చోటు లేకుండా చేస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారంనాడు ప్రకటించారు. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా గతంలో తీసుకున్న చర్యలు కాకుండా తాజా నిర్ణయాలతో రెండు దేశాలమధ్య సంబంధాలు మరింత క్షీణస్థాయికి చేరుకున్నట్లయింది.

ఇదిలా ఉండగా, ఉగ్రవాదులకు భూమ్మీద చోటు లేకుండా చివరివరకూ తరిమికొడతామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారంనాడు బీహార్‌లోని మధుబనిలో పలుకార్యక్రమాల్లో ప్రధానమంత్రి ప్రసంగించారు. ఉగ్రవాద దాడులకు వెనక ఉన్న శక్తులను శిక్షించి తీరుతామని చెప్పారు. భారతదేశ స్ఫూర్తిని ఉగ్రవాదం ఎన్నటికీ నాశనం చేయలేదని అన్నారు.

## పాక్ జాతీయులకు భారత్ వీసాల నిలిపివేత



**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందిస్తోంది. పాకిస్థాన్‌తో దౌత్య సంబంధాలపై కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా పాక్ జాతీయులకు వీసా సేవలు నిలిపివేసింది. వైద్యపరమైన వాటితో సహా ఆ దేశ ప్రజలకు ఇచ్చిన అన్ని వీసాలను రద్దు చేసింది. ఈ మేరకు మన విదేశాంగ శాఖ ఆదేశాలు ఇచ్చింది. పాక్ జాతీయులకు భారత్ జారీ చేసిన అన్ని చెల్లుబాటు అయ్యే వీసాలు 2025 ఏప్రిల్ 27 నుంచి రద్దుకానున్నాయి. ఆ దేశీయులకు జారీ చేసిన అన్ని మెడికల్ వీసాలు ఏప్రిల్ 29 వరకు మాత్రమే చెల్లుబాటు అవుతాయి. ఈ గడువు ముగిసేలోగా వారంతా భారత్‌ను వీడివెళ్లిపోవాలి. ఈ దేశ పౌరులు పాక్‌లో పర్యటించవద్దని సూచిస్తున్నాం అని విదేశాంగ శాఖ గురువారం ప్రకటన విడుదల చేసింది. ఇదిలా ఉంటే.. పహల్గాం ఘటన తర్వాత ప్రధాని మోదీ అధ్యక్షతన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సిసిఎస్ ) సమావేశమైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత కొన్ని కీలక నిర్ణయాలు వెలువడ్డాయి. భారత్‌లోని పాకిస్థాన్ దౌత్య కార్యాలయాల్లో పనిచేస్తోన్న ఆ దేశ సైనిక సిబ్బంది, అధికారులను అవాంఛిత వ్యక్తులుగా ప్రకటిస్తూ నిర్ణయం తీసుకోవడంతో పాటు వారు దేశం వీడి వెళ్లేందుకు వారం గడువు విధించారు. సార్క్ వీసా మినహాయింపు పథకం ద్వారా మన దేశంలో పర్యటిస్తున్న పాకిస్థాన్ జాతీయులకు అనుమతుల రద్దు చేస్తున్నట్లు చెప్పారు. మే ఒకటో తేదీలోగా దేశం వీడి వెళ్లిపోవాలని ఆదేశించారు. ఈ క్రమంలో తాజాగా విదేశాంగ శాఖ ఆ దేశ ప్రజలనుద్దేశించి సవివర ప్రకటన విడుదల చేసింది.

## ఉధంపూర్‌లో ఎన్‌కౌంటర్

**జమ్ము :** జమ్ముకశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లాలో భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య గురువారం ఎన్‌కౌంటర్ జరిగింది. ఎదురు కాల్పుల్లో ఆర్మీ ప్రత్యేక దళాలకు చెందిన ఒక సైనికుడు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. ఉగ్రవాదులు నక్కి ఉన్నారనే సమాచారం ఆధారంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో ప్రారంభించారు. ఈ నేపథ్యంలో దుదు–బసంత్‌గఢ్ ప్రాంతంలో కాల్పులు జరిగాయని అధికారులు తెలిపారు. నిఘావర్గాల పక్కా సమాచారం ఆధారంగా, జమ్ముకశ్మీర్ పోలీసులతో కలిసి ఉధంపూర్‌లోని బసంత్‌గఢ్ ప్రాంతంలో గురువారం సంయుక్తంగా ఆపరేషన్ ప్రారంభించినట్లు వైట్ నైట్ కార్ప్స ఎక్స్‌లో పోస్టు చేసింది. కాల్పుల ప్రారంభంలో తూటాలు తగిలి ఒ సైనికుడు గాయపడగా, అతనికి మెరుగైన చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆర్మీ తెలిపింది. మరణించిన సైనికుడిని ప్రత్యేక దళాల 6 పారాకు చెందిన హవల్దార్ ఝంటు అలీ షేక్‌గా గుర్తించారు. అయితే ఆపరేషన్ ఇంకా కొనసాగుతూనే ఉంది. అయితే విచారణ నిమిత్తం ఆ ప్రాంతం నుంచి నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. గత 24 గంటల్లో జమ్ములో ఉగ్రవాదులు, భద్రతా దళాల మధ్య జరిగిన మూడవ ఎన్‌కౌంటర్ ఇది. దక్షిణ కశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలోని టాంగ్‌మార్గ్ ప్రాంతంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ సందర్భంగా ఉగ్రవాదులు భద్రతా సిబ్బందిపై కాల్పులు జరిపిన తర్వాత బుధవారం ఎన్‌కౌంటర్ జరిగింది. బారాముల్లాలోని ఉరి నాలా ప్రాంతంలో చొరబాటు ప్రయత్నాన్ని భారత సైన్యం భగ్నం చేసింది. బుధవారం జరిగిన తీవ్ర కాల్పుల మధ్య ఇద్దరు ఉగ్రవాదులను హతమార్చింది. మంగళవారం పహల్గామ్‌లో జరిగిన ఘోరమైన ఉగ్రవాద దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన తర్వాత ఈ ఘటన జరిగింది. ఉధంపూర్ జిల్లాలోని బసంత్‌గఢ్ బెల్ట్ గత ఏడాది కాలంలో వరుస ఉగ్రవాద ఘటనలను చవి చూసింది. ఆ నెల 9న, ఉధంపూర్ జిల్లాలోని రాంనగర్‌లోని జోఫర్‌మార్తా బెల్ట్‌లో భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. అయితే, ఉగ్రవాదులు తప్పించుకున్నారు. గత సంవత్సరం సెప్టెంబర్ 11న, బసంత్‌గఢ్ ఎగువ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో జైషే మహమ్మద్ (జెఎం) సంస్థకు చెందిన ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. గత ఏడాది ఏప్రిల్ 29న, బసంత్‌గఢ్‌లోని పనారా గ్రామంలో గుర్తుతెలియని ముష్కరులతో జరిగిన కాల్పుల్లో ఒక విలేజ్ డిఫెన్స్ గార్డ్ సభ్యుడు మరణించాడు. కతువా సరిహద్దు జిల్లా, దోడాకిష్వార్ బెల్ట్ మధ్య ఉన్న ఈ వ్యూహాత్మక బెల్ట్‌లో చొరబాటు మార్గాలలో భాగంగా అనేక ఎన్‌కౌంటర్లు, ఆపరేషన్లు జరిగాయి.

## ఢిల్లీ జెఎన్‌యు ఎన్నికల డిబేట్..
# 'మినీ పార్లమెంట్ '!

డ్రమ్స్ ధ్వనులు, రెపరెపలాడిన జెండాలు, పోటాపోటీ నినాదాల వేదికగా యాంఫిథియేటర్

బుధవారం రాత్రి మొదలైన అధ్యక్ష అభ్యర్థుల ప్రసంగాలు గురువారం ఉదయం వరకూ కొనసాగింపు

'నేడే' ప్రతిష్ఠాత్మక జెఎన్‌యు స్టూడెంట్స్ యూనియన్ ఎన్నికలు



**న్యూఢిల్లీ :** భారతదేశంలో అత్యంత రాజకీయ స్పృహ కలిగిన ఢిల్లీలోని ప్రఖ్యాత జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం(జెఎన్‌యు)లో జరుగబోతున్న విద్యార్థి యూనియన్ ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. జెఎన్‌యు ప్రెసిడెంట్ ఎన్నికకు సంబంధించిన డిబేట్‌కు వేదికైన యాంఫిథియేటర్ అత్యంత బలంగా డ్రమ్స్ ధ్వనులు, దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు, చప్పట్లు, కేరింతలు, రెపరెపలాడుతున్న జెండాల నడుమ హోరెత్తింది. జెఎన్‌యు ఎన్నికలలో 7,906 మంది విద్యార్థులు ఓటు హక్కు అర్హత కలిగిఉన్నారు. ఇందులో పురుషులు 57శాతం, స్త్రీలు 43శాతం ఉన్నారు. ఏప్రిల్ 25న (శుక్రవారం) నాడు రెండు సెషన్లలో అంటే ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం 230 గంటల నుండి సాయంత్రం 530 గంటలవరకు పోలింగ్ జరుగనున్నది.అదే రోజు రాత్రి కౌంటింగ్ జరుగనుండగా, ఏప్రిల్ 28న ఫలితాలు వెల్లడించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. బుధవారం రాత్రి ఎన్నికల డిబేట్ సందర్భంగా 'కశ్మీర్ హమారా హై'. 'హిందూ జీవనపోరాటం' ఎబివిపి 'ఆజాదీ' నినాదాలు, ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) పాలస్తీనా జెండాకు సంఘీభావం ప్రదర్శన మధ్య యాంఫిథియేటర్ మినీపార్లమెంట్‌ను తలపించింది. వేదిక ప్రతీ అంగుళం ఒక కథ చెబుతున్నట్లుగా మారింది. చేతిరాతలతో కూడిన పోస్టర్లు సమాధానాలను డిమాండ్ చేస్తున్నాయి. 'మా హాస్టల్ ఎక్కడ ఉంది'? అని ఓ వ్యక్తి అడిగారు. నెహ్రూ చిత్రపటం కొద్దిగా చినిగి ఉండటం కనిపించింది. యూనివర్సిటీ మూలాలను జనసమూహాలు గుర్తు చేస్తున్నాయ్. మైక్రోఫోన్లతో కూడిన చెవులు చిల్లులు పడేలా ధాప్లిస్, డ్రమ్స్, నినాదాలను తరచూ ఎన్నికల కమిటీ అడ్డుకోవడం కంటపడింది. బుధవారం రాత్రి 1130గంటలకు మొదలైన డిబేట్ గురువారం తెల్లవారుజాము వరకూ కొనసాగింది. దాదాపు 4గంటలకు ముగిసింది. అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న 13మంది అభ్యర్థులు ఒక్కొక్కరూ 10నిమిషాల చొప్పున వారి అభిప్రాయాలను వినిపించారు. ఒక్కసారిగా జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ఆదర్శ భావజాలపరమైన ముఖాముఖీ చర్చతో రాజకీయ వాతావరణాన్ని దర్శనమిచ్చింది. ప్రసంగాలకు ముందు జమ్ముకశ్మీర్ లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల చేతిలో అత్యంత కిరాతకంగా చంపబడిన 28మంది ప్రజల జ్ఞాపకార్థం రెండు నిమిషాలపాటు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఉపన్యాసాలు ప్రారంభ సమయంలో పోటాపోటీగా యాంఫిథియేటర్‌లో దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు ప్రతిధ్వనించాయి. ఆల్ ఇండియా స్టూడెంట్స్ యూనియన్, ఎస్‌ఎఫ్ఐ కార్యకర్తలు మధ్య ఘర్షణ వాతావరణం తలపించింది. వక్తలు వేదికమీదకు వచ్చినప్పుడల్లా ఎబివిపి వాలంటీరుల ధోలక్స్, మెటల్ ప్లేట్స్ మోగించారు. ఇటీవలి పహల్గామ్ ఉగ్రదాడిని ఘటనపై ఎబివిపి అధ్యక్ష అభ్యర్థి శిఖా స్వరాజ్ జనాన్ని ఉద్దేశించి తనదైన శైలిలో రెచ్చగొట్టే ప్రసంగంచేశారు. ఉగ్రవాదానికి మతం అంటూ లేదని అన్నారు. జెఎన్‌యులో వామపక్షం విద్యార్థి సంఘాలు వైఫల్యం చెందాయన్నారు. విద్యార్థుల హక్కులపై ఎబివిపి ఎంత నిజాయితీగా పోరాటం చేస్తుందనేది చూపించేందుకు ఈ ఎన్నికలు ఒక మంచి అవకాశం అన్నారు. జెఎన్‌యు ఎన్నికలను తారుమారు చేసి గెలవాలనుకుంటున్నారని , రిగ్గింగ్ చేసేందుకు ఛండీగఢ్ మేయర్ ఎన్నికలు అనుకుంటున్నారా? ఇది జెఎన్‌యు అని పదునైన చురకలు వేశారు. చౌదరి తయ్యబా అహ్మద్ ప్రసంగిస్తున్నంత సేపు కొంతమంది అత్యంత నాటకీయ అంతరాయం కలుగజేశారు. ఎస్ఎఫ్ఐ, బిఎపిఎస్ఎ, పిఎస్ఎ సంకీర్ణం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న మహిళ ప్రసంగిస్తున్నంతసేపు ఎబివిపి మద్దతుదారులు లోహపు మూతల శబ్దాలతో ఆటంకపరిచారు. ఈసారి ఎన్నికలలో ప్రధాన పునర్వ్యవస్థీకరణలు చోటుచేసుకున్నాయి. దీర్ఘకాలం ఐక్యంగా ఉన్న వామపక్ష విద్యార్థి సంఘాలు చీలిపోయాయి. ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ డిఎస్ఎఫ్‌తో జతకట్టింది. కాగా అదేసమయంలో ఎస్ఎఫ్ఐ, బిఎపిఎస్ఎ , ఏఐఎస్ఎఫ్ మరియు పిఎస్ఏ మరొక కూటమిని ఏర్పాటుచేసుకున్నాయి.

## బెంగళూరులో భరత్‌భూషణ్‌కు
# సిఎం సిద్ధరామయ్య నివాళి



**బెంగళూరు :** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన భరత్ భూషణ్‌కు బెంగళూరులోని నివాసంలో గురువారం కర్ణాటక ము ఖ్యమంత్రి సిద్ధరామయ్య నివాళులు అర్పించారు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుం డా ఉగ్రవాదులను తుదముట్టించాలని సిద్ధరామయ్య కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా చర్య చేపట్టే విషయంలో ప్రతీ ఒక్కరూ కేంద్రం పక్షాన ఉంటారని ఆయన నొక్కిచెప్పారు. మంగళవారం నాడు పహల్గామ్‌లో ఉగ్రవాదుల కాల్పులలో మరణించిన 26మందిలో కర్ణాటకకు చెందిన మంజునాథరావు, భరత్ భూషణ్ ఉన్నారు. వారి మృతదేహాలను గుర్తుపట్టిన అనంతరం ఇక్కడకు తీసుకువచ్చా రు. అయితే పహల్గామ్ ఉగ్రదాడిలో చనిపోయిన 26మందిలో అధిక సంఖ్య లో పర్యాటకులే ఉన్నారు. మంజునాథరావు మృతదేహాన్ని ఆయన స్వస్థలం శివమొగ్గకు తీసుకువెళ్లగా, భరత్‌భూషణ్ మృతదేహాన్ని ఆయన బెంగళూరులోని నివాసానికి తీసుకువచ్చారు.'ప్రభుత్వం సమక్షంలో 7కోట్లమంది కన్నడిగులు భరత్‌భూషణ్‌కు నివాళులు అర్పిస్తున్నారు. 'ఆయన తక్కువ వయస్సు(41)లోనే బిఇ, ఎంబిఏ గ్రాడ్యుయేట్‌గా ఉన్నారు. జరగకూడని సంఘటన జరిగింది. అది అమానవీయ చర్య. దీనిని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను' అని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చెప్పారు. భరత్‌భూషణ్‌కు నివాళులు అర్పించిన తర్వాత సిఎం సిద్ధరామయ్య విలేకరులతో మాట్లాడుతూ 'ఉగ్రవాదులను తుదముట్టించే బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. ఈ దేశంలో ఉగ్రవాదం, ఉగ్రవాద చర్యలకు స్థానం ఉండకుండాచేయాలన్నారు. ఈ ఘటన పట్ల కేంద్ర ప్రభుత్వం ఉపేక్షించాల్సిన అవసరం లేదని, మేమందరం కేంద్రం పక్షాన ఉం టామని, ఉగ్రవాదులను ఏరిపారేయాలని నేను కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నానని, అందుకోసం కేంద్రానికి పూర్తి మద్దతు తప్పక ఉంటుంది. టూరిస్టులుగా కశ్మీర్‌కు వెళ్లినఅ మాయకులైన పర్యాటకులను ఉగ్రవాదులు వారి భా ర్యా పిల్లల ముందే అత్యంత దారుణంగా కాల్చి చంపడం ఇంతకంటే కిరాతక, అమానవీయ చర్య ఇంకేదైనా ఉంటుందా' అని ప్రశ్నించారు. పహల్గామ్ ఉగ్రదాడి ఇంటెలిజెన్స్ వైఫల్యం వల్లే జరిగిందని తాను భావిస్తున్నానని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చెప్పారు.

## జిల్లా అదనపు కలెక్టర్‌గా నారాయణ్‌అమిత్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ గురువారం నల్లగొండ కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. సెప్టెంబర్ 5, 2024న మిర్యాలగూడ సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నారాయణ్‌అమిత్ ఏడున్నర నెలలు పనిచేశారు. గతంలో వికారాబాద్‌లో అడిషనల్ కలెక్టర్‌గా పనిచేసిన నారాయణ్‌అమిత్ బదిలీపై మిర్యాలగూడకు వచ్చారు. ఇప్పుడు నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు.



## జోగులాంబ ఆలయ ఉప ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ సస్పెన్షన్

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి:** జోగులాంబ ఆలయ ఉప ప్రధాన అర్చకుడుగా విధులు నిర్వహిస్తున్న ఆనందశర్మపై పలు అవినీతి ఆరోపణలు రావడంతో విచారణ జరిపిన అనంతరం దేవదాయ శాఖ సస్పెన్షన్ వేటు వేసింది. ఆలయ కార్యకలాపాల్లో ఆనంద శర్మ మాటే వేదంగా వ్యవహరిస్తూ అక్రమాలకు పాల్పడుతూ ఆలయ ప్రతిష్ఠ దెబ్బతీస్తున్నారని ధార్మిక సంస్థలు, భక్తులు దేవాదాయ కమిషనరేట్ లో , మంత్రికి ఫిర్యాదు చేశారు. పలు దఫాలుగా ఆలయంలో విచారణ జరిపిన అనంతరం ఆరోపణలు నిజం కావడంతో ఆ నివేదిక ఆధారంగా దేవాదాయ శాఖ ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. ఈ క్రమశిక్షణ చర్యలు తక్షణం అమల్లోకి రానున్నట్లు పేర్కొంది జిల్లాను వదిలి వెళ్ల కూడదని ఆంక్షలు విధించింది. ఆలయానికి సంబంధించిన ఆభరణాలు, వస్తువులు అప్పగించాలని ఆదేశించారు. ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా అక్రమాలకు ఆనంద్ శర్మ పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి.



## రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి


### జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు

**ప్రజాపక్షం/అర్వపల్లి(నాగారం):** రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకరావాలని, మిల్లర్లు ధాన్యంను వెంటనే దిగుమతి చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు కోరారు. గురువారం జాజిరెడ్డిగూడెం మండలంలోని రామన్నగూడెంలోని పిఎసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను అకస్మికంగా పరిశీలించారు. ఇప్పటి వరకు ఈ సెంటర్ ద్వారా 1680 క్వింటాల ధాన్యం మిల్లులకి ఎగుమతి చేశామని పేర్కొన్నారు. భద్రయ్య అనే రైతుకు చెందిన ధాన్యం పరిశీలించి రైతులు తాలు లేకుండా తూర్పాల పోసి శుభ్రం చేసి తేమశాతం 17 ఉండేలా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకరావాలని కోరారు. కొనుగోలు కేంద్రాలకి ముందుగా వచ్చిన ధాన్యం ప్రకారం సీరియల్ నెంబర్లు ఇవ్వాలని తేమ శాతం 17 రాగానే కాంటావేసి ధాన్యం మిల్లులకు తరలించాలని సూచించారు. ఈకార్యక్రమంలో తహసిల్దార్ భద్రయ్య, సెంటర్ ఇన్‌ఛార్జి శ్రీను, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చెక్‌బౌన్స్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్

**ప్రజాపక్షం/భువనగిరి :** తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ వారి ఆదేశాలు , జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు వారి సూచనల మేరకు జూన్ 9వ తేదీ నుండి 14వ తేదీ వరకు చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించబడుతుందని, దీనికై జిల్లా వ్యాప్తంగా పెండింగులో ఉన్న 691 చెక్ బౌన్స్ కేసులను గుర్తించినట్లు, ఇట్టి కేసులలో నోటీసులు కూడా జారీ చేసే ప్రక్రియ ప్రారంభం అయ్యిందని, దీనికై బ్యాంకు అధికారులచే ప్రత్యేక సమావేశాలు నిర్వహించి కేసుల పరిష్కారానికి తీసుకొనే చర్యలకై సూచనలు చేయడమైనది తెలియచేసి, చెక్ బౌన్స్ కేసులలో ఇరు పక్షాలు ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకొని తమ కేసులను పరిష్కరించుకోవాలని, ప్రత్యేక కౌన్సెలింగుకై తేదీ 5.5.2025 నుండి 19.05.2025 వరకు ప్రీ సిట్టింగులు నిర్వహించబడుతాయని, ఇట్టి ప్రీ సిట్టింగులలో లోక్ అదాలత్ సభ్యులను, మీడియేషన్ న్యాయవాదులు కౌన్సెలింగు నిర్వహించటానికి జిల్లాలోని భువనగిరి, రామన్నపేట, ఆలేరు, చౌటుప్పల్, యాదాద్రి కోర్టుల న్యాయమూర్తులకు తగిన సూచనలు తెలియచేయటమైనదని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, యాదాద్రి భువనగిరి కార్యదర్శి వి.మాధవిలత పత్రిక ప్రకటన జారీ చేశారు.

## ఏఐవైఎఫ్ మహాసభ కరపత్రాల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూరు మండల కేంద్రంలో అఖిలభారత యువజన సమైక్య జిల్లా 2వ మహాసభ కరపత్రాలను సిపిఐ మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం గురువారం విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ అఖిలభారత యువజన సమైక్య దేశవ్యాప్తంగా దేశ సమగ్ర సమైక్యతను పరిరక్షించడానికి సమరశీల ఉద్యమాలు నిర్ణయిస్తున్న సంఘం అన్నారు. మన భారత దేశ భవిష్యత్తు అభివృద్ధిలో యువత పాత్ర చాలా ముఖ్యమైనదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి బాలరాజ్, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు కార్యదర్శులు బోలగాని అశోక్, గొట్టిపాముల సునీల్ కుమార్, జీవికలపల్లి పాండు, ఎండి గుంశి, జీవికలపల్లి గణేష్, ఎంపాల నర్సిరెడ్డి, జీవికలపెల్లి శేఖర్, గడ్డం శ్రీను, రాములు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసులు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/ నల్లగొండ :** సాధ్యమైనంత త్వరగా పెండింగ్ కేసులు క్లియర్ చేయాలని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులతో నిర్వహించిన నెలవారి నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ పాల్గొని మాట్లాడుతూ పెండింగ్ కేసులు లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, పెండింగ్ కేసులను త్వరితంగా పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.పెండింగ్‌లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి అడిగి, గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ తో పూర్తి పారదర్శకంగా చేయాలి అన్నారు. కేసు నమోదు నుండి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్నికూలంకుషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలి అన్నారు. ఫోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. ప్రతి అధికారికి సి.సి.టి.యన్.ఎస్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్‌పి మౌనిక,అడిషనల్ ఎస్‌పి రమేష్, నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి,మిర్యాలగూడ డిఎస్‌పి రాజశేఖర్ రాజు,సైబర్ క్రైమ్ డిఎస్‌పి లక్ష్మీ నారాయణ,సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు

**ప్రజాపక్షం/ నాంపల్లి:** తెలంగాణ ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన పేదలకే ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ అంజచారి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల కౌన్సిల్ సమావేశం మండల సహాయ కార్యదర్శి ఊరుపాక వెంకటయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన నిరుపేదలకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఘనంగా మేడే ఉత్సవాలను గ్రామ గ్రామాన జెండాలు ఎగురవేయాలని కార్మికులకు సూచించారు. సిపిఐ గ్రామ శాఖ సమావేశాలు జరపాలని, పార్టీ అభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. రైతులు పండించిన వడ్లకు ఎలాంటి ఆంక్షలు విధించకుండా ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేసి, సమయానికి రైతులకు బస్తాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్, సహాయ కార్యదర్శి నేతాళ్ల రాజు, మండల కార్యవర్గ సభ్యులు కోరే సత్తయ్య, దండిగా వెంకటయ్య, గిరి స్వామి, కానుగుల మహేష్, బుషిపాక యాదయ్య, దశరథ, బుషిపాక యాదయ్య, అగ్గిరాజు పాల్గొన్నారు.




## సాదా బైనామా, భూ సమస్యలకు మోక్షం

# భూభారతి చట్టం

### భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** భూ కబ్జా మీద ఉండి సాదా బైనామా ఉన్న ప్రతి రైతు భూ సమస్యలకు మోక్షం భూభారతి చట్టమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం అమలు రైతులకు విస్తృత అవగాహన సదస్సులో ఆయన పోచంపల్లి పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో భూభారతి అవగాహన సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయనతోపాటు భువనగిరి అదనపు కలెక్టర్ వీరారెడ్డి వివిధ పార్టీ ముఖ్య నాయకులు రైతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అధికారం ఒక్క దగ్గర కేంద్రీకృతం అయ్యిందని అస్తవ్యస్తమైన పాలనతో ధరణి పేరుతో రైతులనూ భూహక్కు కలిగిన యజమానులను అయోమయానికి గురిచేసి అధోగతి పాలు చేసిందని ఆయన ఘాటుగా విమర్శించారు. మే 1 నుండి ప్రతి గ్రామం వెళ్లి సమస్యలు తెలుసుకొని పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. భూభారతి రూపశిల్పి లాండ్ సునీల్ కృషిని కొనియాడారు. ఇంద్రియాల గ్రామంలో తెల్లరేషన్ కార్డు లబ్దిదారులు మొగిలిపాక పుష్ప కుమారుడు అనిల్ ఇంట్లో సన్న బియ్యం అన్నంతో పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ఆయన భోజనం చేశారు. కార్యక్రమానికి ముందే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్ వీరారెడ్డి ఇన్చార్జి తహసీల్దార్ నాగేశ్వరరావు, ఎండిఓ భాస్కర్, మార్కెట్ కమిటి చైర్మన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు తడక వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, డిసిసి ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి, జిల్లా నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మర్రి నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు టౌన్ అధ్యక్షుడు భారత లవ కుమార్, ఉపాధ్యక్షుడు పకీరు నర్సిరెడ్డి పాల్గొన్నారు.



## భూ సమస్యల పరిష్కారానికి భూభారతి: కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/ నాంపల్లి:** భూ సమస్యలు పరిష్కరించేందుకే భూభారతి చట్టాన్ని తీసుకు వస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ లో భూ భారతి చట్టం 2025 పై రైతులకు కల్పిస్తున్న అవగాహన సదస్సులలో భాగంగా ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధరణిలో గుర్తించిన లోపాలన్నింటిని భూ భారతి ద్వారా సరిచేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. జూన్ 2 నుండి భూ భారతి చట్టం అందుబాటులోకి రానుందని, రైతులు వారి భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకొనేందుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ధరణి లో వీఆర్వో వ్యవస్థను తీసివేయడం జరిగిందని, దీనివల్ల ఇబ్బందులు ఏర్పడగా, తిరిగి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రతి గ్రామానికి ఒక గ్రామ పాలన అధికారిని నియమించనున్నదని తెలిపారు. భూ భారతి చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాంపల్లి మండలంలో ఆర్ఐ కొరతను దృష్టిలో ఉంచుకొని ఒక ఆర్ఐని నియమించడం జరిగిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీదేవి, తహసిల్దార్ దేవసింగ్, మండల ప్రత్యేక అధికారి, సర్వే ల్యాండ్ రికార్డ్ ఏ డి శ్రీనివాస్, ఎంపీడీవో శర్మ, పిఎసిఎస్ చైర్మన్ గట్టుపల్లి నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్‌కార్డులున్న ప్రతి రైతుకూ ‘భూధార్’

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్




**ప్రజాపక్షం/తుంగతుర్తి:** గ్రామాల్లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి అందుబాటులో భూ భారతి నూతన ఆర్‌ఓఆర్ చట్టం 2025 అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. గురువారం భూభారతి 2025పై తుంగతుర్తి పట్టణంలోని ధనలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామ్యేలు, ఆర్డీవో వేణుమాదవరావు హాజరై తెలంగాణ గీతం అలపించి, పిపిటి చదివి వినిపించి రైతులకు భూ భారతి చట్టంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామ్యానులకు, ప్రజలకు అందుబాటులో భూభారతి నూతన ఆర్‌ఓఆర్ చట్టం 2025, భూ భారతిలో గ్రామాల్లో నెలకొన్న సమస్యలకు పరిష్కారం ఉందని, దీనిలో కొన్ని అధికారాలు తహసిల్దర్, ఆర్డీవో, అడిషనల్ కలెక్టర్, కలెక్టర్ స్థాయిలో వికేంద్రీకరణ చేశారని తెలిపారు. మండలాలలో త్వరలో భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పిల్ వ్యవస్థ ఉందని, ఆధార్‌కార్డుల ప్రతి రైతుకు భూఆధార్ కార్డు జారీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు మాట్లాడుతూ ధరణి వల్ల రైతులు అధికారులు చాల సమస్యలను ఎదుర్కొంటున్నారని, గత ప్రభుత్వం ధరణి వల్ల ఎలాంటి పరిష్కారాలు జరగలేదని అన్నదమ్ములు, అక్కచెల్లెలు భూ తగాదాలు బాగా జరిగేవని, దాని వల్లే గత ప్రభుత్వాన్ని వ్యతిరేకించారని అన్నా రు. ఉద్యోగ విరమణ పొందిన మేధావులు, రెవిన్యూ అధికారులతో 14నెలలు శ్రమించి భూ భారతి చట్టాన్ని రూపొందించారన్నారు. ఆర్డీవో వేణుమాదవరావు, తహసిల్దార్ దయానందం, తిరుమలగిరి తహసిల్దార్ హరిప్రసాద్, ఎంపీడీవో సురేష్ కుమార్, మార్కెట్ కమిటి చైర్మన్, గిరిధర్‌రెడ్డి, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, పిఎసిఎస్ చైర్మన్ సైదులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో శ్రీ వశిష్ట విద్యార్థుల విజయకేతనం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో హయత్ నగర్ శ్రీ వశిష్ట కాలేజ్ విద్యార్థులు స్టేట్ మొదటి, రెండవ ర్యాంకులు సాధించినట్లు కళాశాల సూర్యాపేట ఎగ్జిక్యూటివ్ పోలగాని జానకిరాములు, జోనల్ ఇన్‌చార్జీ కరణం అనూఫ్ చక్రవర్తిలు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సృజన కళాశాలలో ఇంటర్ ఎంపిసి విభాగంలో 468 మార్కులు సాధించిన గుగులోతు సాయిచరణ్, ద్వితీయ సంవత్సరంలో 994 మార్కులు సాధించిన మిర్యాల అక్షయ తారలను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కళాశాల చైర్మన్ లింగమనేని ప్రమీల రాణి, జిఎం వంశిచంద్ర, డిన్ రాచకొండ శ్రీనివాస్ పర్యవేక్షణలో ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధపెట్టి అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు తెలిపారు. సృజన పాఠశాల కరస్పాండెంట్ మిర్యాల రవికుమార్, ప్రిన్సిపల్ శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు సైదులు, సంధ్య పాల్గొన్నారు.

## అక్రమంగా డ్రగ్స్ విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

### నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** మెడికల్ షాప్ నిర్వాహకులు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా డ్రగ్స్ అమ్మినట్లయితే షాప్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు తప్పవని నల్లగొండ డిఎస్పి శివరాం రెడ్డి హెచ్చరించారు. అక్రమంగా డ్రగ్స్ విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేసి మీడియా ముందు ప్రవేశపెట్టారు ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ మునుగోడు రోడ్ లో నల్లగొండ వన్ టౌన్ సిఐ ఏమి రెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ సందీప్ రెడ్డి అతని సిబ్బంది మునుగోడు రోడ్డులో వాహన తనిఖీ నిర్వహిస్తుండగా, ఒక వ్యక్తి అనుమానాస్పదంగా బైక్ పై బ్యాగుతో ఉండగా, అతన్ని పట్టుబడి చేసి విచారించగా, అతని పేరు మమ్మద్ ఖాజా వసీముద్దీన్ గత కొంతకాలంగా స్పాస్మో టాబ్లెట్స్ సేవిస్తూ వాటికి బానిసై, ఈజీగా డబ్బులు సంపాదించాలని వసీం, అతని స్నేహితులైన ఇద్దరు పరారీ లో ఉన్నారని తెలిపారు. నల్గొండ చుట్టుపక్కల మెడికల్ షాపులలో ఇట్టి టాబ్లెట్స్ అమ్మట్లేదని, పోలీసువారికి ఇక్కడ నిఘా ఉంటుందని, ఆరు నెలల నుండి పిడుగురాళ్ల లోని ఛాయా మెడికల్ షాప్ నిర్వాహకుడైన ఏ4 మణిదీప్ దగ్గరికి బైక్ పై వెళ్లి ఒక షీటును వంద రూపాయలకు కొని, అట్టి టాబ్లెట్స్ ను వినియోగిస్తూ, అవసరం ఉన్నవారికి 180 రూపాయలకు అమ్ముతూ డబ్బులు సంపాదిస్తూ ఉన్నారని ఇదే క్రమంలో మమ్మద్ వసీముద్దీన్ 288 టాబ్లెట్స్ షీట్స్ తీసుకుని, అవసరం ఉన్నవారికి అమ్ముదామని వెళుతూ ఉండగా పట్టుబడడం జరిగిందని తెలిపారు . ఇతడిని తీసుకొని గురజాలలోనే మెడికల్ షాప్ నిర్వాహకుడైన మణి దీపిని పట్టుబడి చేసి, అతని వద్ద నుండి 15 షీట్స్, సెల్ ఫోన్, షాపు డాక్యుమెంట్స్ స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.

## బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి :** పోలీస్ స్టేషన్ ల నిర్వహణలో హెడ్ కానిస్టేబుల్స్ దే కీలక పాత్ర అని అందుకు అనుగుణంగా బాధ్యతా తో విధులు నిర్వహించి ప్రజలకు మంచి సేవలు అందించాలని జిల్లా ఎస్పీ టి శ్రీనివాస్ రావు హెడ్ కానిస్టేబుల్స్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ లలో , వివిధ విభాగాలలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్స్ అధికారులతో గురువారం జిల్లా ఎస్పీ గ్రీవెన్స్ హాల్ నందు సమావేశమై తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ నిర్వహణలో హెడ్ కానిస్టేబుల్స్ ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని పోలీస్ వ్యవస్థలో గతంలో కంటే సాంకేతిక పరిజ్ఞానం చాలా పెరిగిందని, సిసిటిఎన్ఎస్ పై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని అన్నారు. పోలీస్ స్టేషన్‌లలో ఎవరెవరు ఏఏ విధులు నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. సెక్షన్ ఇంచార్జి తో పాటు కేసుల ఇన్వెస్టిగేషన్‌లో అవగాహన మరింత పెంచుకోవాలని అన్నారు. కోర్టు డ్యూటీ అధికారులతో రోజు వారి కోర్టు కేసుల వివరాలు, ట్రయల్స్, సమ్మాన్స్ వివరాలు తెలుసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదు దారుడికి చట్ట ప్రకారం న్యాయం చెయ్యాలని, గస్తి డ్యూటీ వారిని రాత్రి వేళల్లో నేరాలు జరగకుండా బ్రీఫింగ్ చేసి సరైనా విధంగా జరిగేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ ఇన్స్పెక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల నుండి వచ్చిన హెడ్ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు

### తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యుల సోదాలు
### యాపిల్ స్కానింగ్ సెంటర్, సాయి గణేష్ డాక్టర్ల గుట్టు రట్టు
### నిద్రావస్థలో జిల్లా ప్రభుత్వ వైద్యాధికారులు




**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి:** ఇటీవల సూర్యాపేట జిల్లా కేంద్రంలో శరత్ గుండెవైద్య నిపుణుల ఆసుపత్రిని తెలంగాణ మెడికల్ సభ్యులు జిల్లా వైద్యాధికారితో సీజ్ చేయించిన సంఘటన మరవక ముందే గురువారం మరో మారు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రులను తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఆసుపత్రుల వైద్యుల గుట్టు రట్టు అయ్యింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మహాత్మగాంధీ రోడ్డులోని యాపిల్ స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేసిన కౌన్సిల్ సభ్యులు ఈ సెంటర్ నిర్వహకులు డాక్టర్ వనమా కిరణ్ రెడియాలజిస్టు కాకున్న ఫోర్జరి సర్టిఫికెట్లతో రెడియాలజిస్టుగా చెలామాణి అవుతున్నట్లు గుర్తించారు. ఎంబిబిఎస్ చదివిన సదరు వైద్యుడు తన తండ్రిపేరు వీరభద్రయ్య కాగా అందులోని ఎండి అనే రెండు అక్షరాలను స్కానింగ్ చేసి తాను రెడియాలజిస్టుగా చలామణి అవుతూ గత 15 సంవత్సరాలుగా రోగులను మోసం చేస్తూ దోచుకుంటున్న పరిస్థితి బయటపడింది. ఇందులో పని చేస్తున్నా మరో వైద్యుడు తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో సభ్యత్వం లేకున్న ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సభ్యత్వంతో వైద్యం చేస్తున్నట్లు తనిఖీలో నిర్ధారించారు. ఇది ఇలా ఉండగా విద్యానగర్‌లోని శ్రీ సాయిగణేష్ ఆసుపత్రిలో తనిఖీ చేసిన కౌన్సిల్ సభ్యులు అందులో వైద్యం చేస్తున్న డాక్టర్ సందీప్ ఎంబిబిఎస్ చదివి ఎండి అని చలామణి అవుతూ బోర్డుపై డిగ్రీ ఉన్నట్లుగా లెటర్ ఫ్యాడ్‌లో ముద్రించుకొని అర్హత లేకున్న రోగులకు వైద్యం చేస్తున్నారు. 2019కు చెందిన ఎంబిబిఎస్ డిగ్రీను కూడా రెన్యూవల్ చేయించుకోకుండా చెల్లని సర్టిఫికెట్లతో వైద్యం చేస్తున్నట్లు తనిఖీలో బట్టబయలయ్యింది. కొత్తబస్టాండ్ సమీపంలోని సూర్య ఆసుపత్రిని కూడా కౌన్సిల్ సభ్యులు తనిఖీ చేయగా డాక్టర్ లేకుండానే రోగులకు నిర్వహకులు వైద్యం చేస్తున్నట్లు గుర్తించారు. ఆసుపత్రి బోర్డుపై ఓ వైద్యుడి పేరు ఉండడంతో అతడికి ఫోన్ చేసి తెలుసుకోగా తాను ఆ ఆసుపత్రిలో వైద్య సేవలు అందించడం లేదని చెప్పారు. ఇది ఇలా ఉండగా నక్షత్ర ఆసుపత్రిలో కాలం చెల్లిన సర్టిఫికెట్లను చూపించి నిర్వహకులు ఆసుపత్రి నిర్వహణ చేస్తున్నట్లు సభ్యులు గుర్తించారు. సూర్యాపేటలో తెలంగాణ మెడికల్ సభ్యుల తనిఖీలలో బయపడ్డ నిజాలకు స్థానిక వైద్యులు నివ్వెరబోయారు. అర్హత లేకున్న నకిలీ సర్టిఫికెట్లతో వైద్య సేవలు అందిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి అండగా నిలవడంతోనే వీరి ఆటలు సాగుతున్నాయంటూ ఐఎంఎ డాక్టర్లు గుర్రుమంటున్నారు. ఇలాంటి వైద్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సీనియర్ వైద్యులు కోరుతున్నారు. జిల్లా వైద్యాధికారులు వీరపై చర్యలు తీసుకోకపోతే వారిని మేమే తరిమికొడుతామని చెప్పారు. ఈ నకిలీ వైద్యులతో తమ వైద్య వృత్తి కలంకమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

**తనిఖీ నివేదికను కౌన్సిల్ ముందు పెడతాం కౌన్సిల్ సభ్యులు డాక్టర్ నరేష్**

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రులపై తాము చేసిన తనిఖీలలో బయటపడ్డ విషయాలను తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ముందు పెడుతామని కౌన్సిల్ సభ్యులు డాక్టర్ నరేష్ తెలిపారు. తనిఖీల అనంతరం మరో సభ్యులు రాజీవ్‌తో ఆయన మీడియాతో మాట్లాడుతూ అర్హత లేకున్నా వైద్యం చేస్తూ ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని అన్నారు. స్టెరాయిడ్స్, యాంటిబయాటిక్ మందులను మోతాదుకు మించి ఇచ్చి రోగులను బలి తీసుకుంటున్నారని అన్నారు. స్థానిక జిల్లా వైద్యాధికారులకు కూడా తన తనిఖీ నివేదికను అందజేస్తామని చెప్పారు.

## ‘ఓపెన్ టెన్త్ ’పరీక్షలో ఒకరికి బదులు మరొకరు

### ఇద్దరిపై కేసు నమోదు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో ఓపెన్ టెన్త్ పరీక్షలో ఒకరికి బదులుగా మరొకరు పరీక్ష రాస్తుండగా సబ్ కలెక్టర్ ఆదేశాలతో పట్టుకోని కేసు నమోదు చేశామని తహసీల్దార్ హరిబాబు తెలిపారు. బకల్‌వాడ ఉన్నత పాఠశాలలో ఓపెన్ టెన్త్ పరీక్షలకు దరఖాస్తు చేసిన గువ్వల శ్రీనివాస్‌కు స్థానికంగా బాలికల ఉన్నత పాఠశాలలో సెంటర్ పడింది. గువ్వల శ్రీనివాస్‌కు బదులు అప్పాముల శ్రీనివాస్ అనే మరో విద్యార్థి పరీక్ష రాస్తున్నాడు. ఈనెల 20 నుంచి పరీక్షలు జరుగుతుండగా చివరి రోజు సాంఘీక శాస్త్రం పరీక్ష జరుగుతుంది. ఎంసీపీఐయు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య గురువారం సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించిన సబ్ కలెక్టర్ తహసీల్దార్ హరిబాబు, ఎంఈవో బాలునాయక్‌ను పరీక్షా కేంద్రానికి పంపి తనిఖీ చేయాలని ఆదేశించారు. రూమ్ నెం.8లో 166 రూల్ నెంబర్‌తో ఒకరికి బదులుగా మరొకరు పరీక్ష రాస్తున్నట్లు గుర్తించారు. వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్, కోఆర్డినేటర్లపై విచారణ నివేదికను డీఈవోకు పంపుతామని ఎంఈవో బాలునాయక్ తెలిపారు. కాగా గురువారం పట్టణంలో పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన భిక్షపతిని ఈ విషయమై విలేకరులు ప్రశ్నించగా ఓపెన్ పరీక్షలు ఓపెన్‌గానే జరుగుతాయని సమాధానం చెప్పడం గమనార్హం.

## ఉపాధి పనుల పరిశీలన

**ప్రజాపక్షం/ఎర్రవల్లి :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన గ్రామీణ అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు గురువారం ఇటిక్యాల మండలంలోని ఇటిక్యాల, ధర్మవరంలోని చేపట్టిన పొలంబాట నిర్మాణ పనులు పరిశీలించి, గ్రామీణ ప్రాంత రైతుల రవాణా సౌకర్యాల మెరుగుదలకు తోడ్పడే ఈ రోడ్ ఫార్మేషన్ పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రతి పనిని సమర్థవంతంగా అమలు చేయాలని, ఉపాధి హామీ కూలీలకు నిరంతరంగా ఉపాధి కల్పించాలని అధికారులకు సూచించారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల వల్ల కూలీలు ఉదయం పనులను ప్రారంభించాలన్నారు.

## రైతు శ్రేయస్సు కోసమే భూ భారతి

ఎమ్మెల్యే కడియం

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** భూ వివాదాల శాశ్వత పరిష్కారానికి నూతన ఆర్‌ఓఆర్ చట్టం ఎంతగానో దోహదపడుతుందని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌తో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ భూ భారతి చట్టంతో రైతుల భూములకు రక్షణ లభిస్తుందన్నారు. ప్రత్యేకించి రైతుల భూములపై భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టం వల్ల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. సాదాబైనామా దరఖాస్తులు కూడా పరిష్కారమవుతాయన్నారు. మార్కెట్ చైర్మన్ లావణ్యారెడ్డి, వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, పిఎసిఎస్ చైర్మన్ కర్ణాకర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య, ఆర్డీవో వెంకన్న, తహశిల్దార్ శంకరయ్య, ఎంపిడిఒ సుమన్, డిటి అనిల్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఎఐసిసి ఇన్‌చార్జితో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి భేటీ



**ప్రజాపక్షం/పాలకుర్తి:** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌ను గురువారం పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సిరెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను మీనాక్షి నటరాజన్‌కు వివరించారు. అలాగే పార్టీ నిర్మాణం, స్థానిక రాజకీయ పరిస్థితులు, బూత్ స్థాయిలో కార్యచరణ ప్రణాళికలను గురించి వారితో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, పార్టీ ఇన్‌చార్జి ఝాన్సిరెడ్డి చర్చించగా సానుకూలంగా స్పందించి రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ఎంపిపి, జడ్‌పిటిసి, అన్ని గ్రామాలలో సర్పంచ్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేయడానికి కృషి చేయాలన్నారు.

## రాజీవ్ యువ వికాసానికి 2,625 ఆన్‌లైన్ అప్లికేషన్లు

కమిషనర్ బిర్రు శ్రీనివాస్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో2,625 మంది ఆన్లైన్ దరఖాస్తు చేసుకున్నారనిభూపాలపల్లి మున్సిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ ఒక ప్రకటన తెలిపారు. రాజీవ్ యువ వికాసం ద్వారా ఆన్లైన్లో అప్లికేషన్ చేసినటువంటి దరఖాస్తుదారులు వారి ఆన్లైన్ చేసినటువంటి పత్రము తో సహా రేషన్ కార్డు జిరాక్స్, ఇన్కమ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, క్యాస్ట్ సర్టిఫికెట్, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ ఒక పాస్ ఫోటో జత చేసి మున్సిపల్ కార్యాలయంలో రూమ్ నెంబర్ 12 లో అందజేయాలని తెలిపారు. కావున అప్లై చేసినటువంటి ప్రతి దరఖాస్తుదారుడు తప్పకుండా పైన తెలిపిన జిరాక్స్ ప్రతులను అందజేయాలని కోరారు. ఇప్పటి వరకు ఆన్లైన్ ద్వారా 2625 దరఖాస్తులు రాగా కార్యాలయంలో 2,368 అప్లికేషన్లు (ఆన్లైన్ చేసిన దరఖాస్తులు హార్డ్ కాపీలు) మాత్రమే అందజేశారని మిగిలిన దరఖాస్తుదారులు వెంటనే కార్యాలయంలో మీ జిరాక్స్ పత్రాలను అందజేయాలని కమిషనర్ కోరారు.

## ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య

వక్ఫ్ పరిరక్షణ కమిటీ కన్వీనర్ మహమ్మద్ ఇక్బాల్




**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** పహల్గవ్‌లో జరిపిన ఉగ్రవాదుల దాడి పిరికిబంద చర్యఅని వక్ఫ్ పరిరక్షణ కమిటీ కన్వీనర్ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. మహబూబాబాద్ వక్ఫ్ పరిరక్షణ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో పహల్గవ్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన కుటుంబాలకు ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలియజేస్తూ బుధవారం రాత్రి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్లాం శాంతిని ప్రబోధిస్తుందని అన్నారు. ఈ ఘటన భారతీయ సమాజాన్ని శోకసముద్రంలోకి నెట్టిందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటూ ఉగ్రవాదాన్ని తుదిముట్టించాలని కోరారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఈ దాడి సమస్త భారతీయులపై జరిగిన దాడిగా అభివర్ణించారు. మానుకోట అంబేద్కర్ విగ్రహం నుండి నెహ్రూ చౌరస్తా వరకూ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మహమ్మద్ ఫరీద్, ఇమాముద్దీన్, ఇస్మాయిల్, నదీమ్, నయూమ్,ఫజల్,సయ్యద్ ఆదిల్, బుల్లెట్ ఇమాం, మోసిన్, మౌలానాసాజిత్, నాసర రహీం, అప్సర్జాకీర్, జావీద్, యాకూబ్ ఆరరీఫ్,ఆయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మేడేను విజయవంతం చేయాలి




**ప్రజాపక్షం/ నర్సంపేట :** మేడేను విజయవంతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ అన్నారు. నర్సంపేట పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రక్కన లారీ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం వద్ద ఎఐటియుసి సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమావేశం నర్సంపేట మండల అధ్యక్షులు ఓదెల కనుకమల్లు అధ్యక్షతన గురువారం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 1రోజున మేడే సందర్భంగా ప్రతి కార్మికుడు ఎర్ర చొక్కా ధరించి కార్మిక హక్కుల సాధనకై పోరాడుతూ పథకాన్ని ఆవిష్కరణ చేసి, ర్యాలీలో పాల్గొని మేడే ఉత్సవాలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవి, కుమార్, అనిల్ కుమార్, రమేష్, లక్ష్మయ్య, వెంకన్న, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన ప్రభుత్వ బాలికల కళాశాల

**ప్రజాపక్షం/ నర్సంపేట :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన 2024–25 విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలలో నర్సంపేట మండలకేంద్రం సర్వాపురంలో ఉన్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల బాలికలు అత్యధిక మార్కులను సాధించి సత్తాచాటారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో నిర్వహించిన బాలికల అభినందన సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ సువర్ణ మాట్లాడుతూ ఇంటర్ మీడియట్ విద్య కమిషనర్ శ్రీకృష్ణ ఆదిత్యఆదేశాల మేరకు 90 రోజుల ప్రణాళిక, 30 రోజుల ప్రణాళికలను తయారు చేయించి బాలికలను పరీక్షలకు సంసిద్ధం చేయించామన్నారు. అత్యధిక మార్కులను సాధించిన బాలికలకు పుష్పగుచ్చాలు ఇచ్చి శాలువాతో ప్రిన్సిపాల్ సన్మానించారు. కళాశాల స్టాఫ్ సెక్రటరీ కె. మల్లేష్ చంద్ర, సీనియర్ అధ్యాపకురాలు కృష్ణకుమారి, మహిపాల్ కృష్ణమోహన్ సింగ్, వెంకట్ రెడ్డి ,రజిత,అనూష, నాన్ టీచింగ్ సిబ్బంది, కోమల,యాదగిరి, ఆండాలు, జాఫర్, పాల్గొన్నారు.

## ఎస్‌సి వర్గీకరణ కోసం తుడుందెబ్బ ఆవిర్భావం

ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి చింత కృష్ణ

**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:**ఎస్‌సి వర్గీకరణ కోసమే తుడుందెబ్బ ఆవిర్భావం అయినట్లు ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి చింత కృష్ణ అన్నారు. రాయినిగూడెం గ్రామంలో ఆదివాసీ తుడుందెబ్బ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి చింత కృష్ణ హాజరై మాట్లాడుతూ ఆదివాసీ తెగల్లో షెడ్యూల్ తెగల ఎబిసిడి వర్గీకరణ కోరుతూ 1996లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు అమరులు దబ్బకట్ల నరసింహారావు ఆశయ సాధనలో షెడ్యూల్ తెగలల్లో ఎబిసిడి వర్గీకరణ జరగాలని గత 29 సంవత్సరాల నుండి ఆదివాసీ తుడుం దెబ్బ ఆవిర్భవించిందన్నారు. గత సంవత్సరం 2024 ఆగష్టు ఆకటవ తేదీన సుప్రీంకోర్టు ఎస్‌సి, ఎస్‌టిల్లో ఉప కులాలను అన్ని రంగాల్లో అభివృద్ధి కొరకు ఆయా రాష్ట్రాలు వర్గీకరించాలని అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌టి వర్గీకరణకు తుడుం దెబ్బ డిమాండ్‌లో కోరుకుంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎస్‌టిలలో చిన్న తెగలు అభివృద్ధికి ఎస్‌సి వర్గీకరణ కమిషన్ నియమించాలని కోరుతూ ఈ నెల 25వ తేదీన ఐటిడిఏ కేంద్రంగా ఆదివాసీ జేఏసి సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్నటువంటి కార్యక్రమానికి ఈ రాష్ట్రంలో ఉన్న ఆదివాసీ ప్రజలు, కుల, ప్రజా సంఘాలు ప్రజాస్వామిక వాదులు బుద్ధి జీవులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎంఆర్‌పిఎస్ జాతీయ నేత దళిత రత్న నెమలి నర్సయ్య మాదిగ, తుడుం దెబ్బ ములుగు జిల్లా అధ్యక్షులు వట్టం జనార్ధన్, నాయకపోడ్ దెబ్బ దున్నత తెలంగాణ జిల్లాల ఇన్‌చార్జి గాలి సమ్మయ్యనాయకపోడ్,ఆదివాసీపోరాటాలసీనియర్‌నాయకులుపాల్గొన్నారు.

# రైతుల ఇబ్బందులు తీర్చడానికే భూభారతి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** ధరణిలో ఉన్న లోపాల దృష్ట్యా రైతులు ఇబ్బందులను గమనించి రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తెచ్చినట్లు భూపాలపల్లి శాసన సభ్యుడు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం భూపాలపల్లి నియోజకవర్గంలోని మొగుళ్ల పల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన భూ భారతి అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా భూ భారతి చట్టం అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆయన మాట్లాడుతూలో ధరణి అనేది లోపభూయిష్టంగా ఉన్నదని, పట్టా జారీలో ఏదేని పొరపాటు జరిగితే అప్పీలు చేయడానికి అవకాశం లేదని, రైతులు సివిల్ కోర్టు చుట్టూ తిరగాల్సి వచ్చేదని దానివల్ల రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరణి స్థానంలో భూ భారతి తెస్తామని చెప్పిన ప్రకారం సీనియర్ అధికారులతో అన్ని రాష్ట్రాల్లో విచారణ చేసి సులువైన పటిష్టమైన చట్టాన్ని అమల్లోకి తెచ్చినట్లు తెలిపారు. భూములు కొన్నా, అమ్మినా లైసెన్స్ సర్వే యర్ ద్వారా హద్దులుతో మ్యాపు తయారు చేసి పట్టాదారు పాసుపుస్తకాల్లో నమోదు చేస్తారని తద్వారా భూమి గుర్తింపుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. తహసీల్దార్ ద్వారా ఏదేని పొరపాటు జరిగి ఉచిత న్యాయ సహాయ సేవలు అందించడానికి అవకాశం కల్పించారని అన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిసెంబర్ 31న రికార్డుల నవీకరణలను చేయడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ప్రజలకు ఆధార్ ఎలా ఉందో అలానే భూములకు భూదార్ జారీ చేయనున్నట్లు తెలిపారు. గ్రామ పహణి కూడా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ధరణి వచ్చిన తరువాత పహణిలో నమోదులు జరగలేదని తెలిపారు. 2014 జూన్ 2 కంటే ముందు గ్రామీణ ప్రాంతంలోని వ్యవసాయ భూమిని సాదా బైనామా ద్వారా కొనుగోలు చేసి, గత 12 ఏండ్లుగా అనుభవంలో ఉంటూ 12–10–2020 నుండి 10–11–2020 మధ్య కాలంలో క్రమబద్ధీకరణ కోసం సన్న చిన్నకారు రైతులు పెట్టుకున్న దరఖాస్తులపై ఆర్డిఓ విచారణ చేసి అర్హత ఉన్న వారి నుండి ప్రస్తుత రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ ప్రకారం భూ హక్కులు జారీ చేస్తారని అన్నారు. ఆర్డిఒ రవి, తహసీల్దా ర్ సునీత, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## పుష్కరాల పనుల్లో జాప్యం జరిగితే సహించేది లేదు : రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ప్లాస్టిక్ రహిత పుష్కరాలు చేయడమనే మన లక్ష్యమని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం సరస్వతి పుష్కర పనుల ప్రత్యేక పర్యవేక్షణ అధికారులు, తహశీల్దార్, ఎంపిడిఓ లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సరస్వతి పుష్కరాల పనుల్లో ఎలాంటి జాప్యం జరగొద్దని ప్రత్యేక అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సరస్వతి పుష్కర పనులకు చాలా ప్రాధాన్యత ఇవ్వాలని పర్యవేక్షణ చేయలేక పోతే జిల్లా విడిచి వెళ్లాలని, జాప్యం జరిగితే చర్యలు తీసుకుంటామని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పుష్కరాల పర్యవేక్షణ కోసం ఒక్కో జిల్లా అధికారికి పర్యవేక్షణ అధికారులుగా నియమించామని, ప్రతి రోజు పనులు పర్యవేక్షణ చేసి నిర్దేశిత సమయంలో పూర్తి చేయు విధంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ రహిత పుష్కరాలు చేయడం మన లక్ష్యమని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అవగాహనకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యర్దాలు నిర్వహణకు ఇన్సినినేటర్ ఏర్పాటు చేయాలని తెలిపారు.ఈ సమావేశంలో ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం



**ప్రజాపక్షం/హనుమకొండ :** పహల్గామ టెర్రరిస్ట్ దాడిని ఖండిస్తూ అత్యంత విషాదకరమైన ఈ ఘటనపై ఉగ్రవాదాన్ని అంతం చేయాలని, ఉగ్ర మూకల కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ దేశ సమగ్రత సమగ్రతను సమైకృతను పరిరక్షించడానికి కేంద్ర ప్రభుత్వం, అదే విధంగా కాశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో కాళోజి సెంటర్ నందు ఉగ్రవాదుల దిష్టిబొమ్మలను సిపిఐ ఆధ్వర్యంలో దగ్ధం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ పాల్గొని మాట్లాడుతూ దేశంలో ఉగ్రవాదాన్ని నిర్మూలించాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు కాళోజి సెంటర్ నందు ఈ కార్యక్రమం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, నాయకులు మాలోత్ శంకర్ నాయక్, గుంటి రాజేందర్, మద్దెల శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి

ప్రజా సంఘాల నాయకులు మాదాసి సురేష్, తెలంగాణ కొమురయ్య డిమాండ్



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులపై అమలు చేస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ప్రజాసంఘాల జెఎసి జిల్లా చైర్మన్ మాదాసి సురేష్, తెలంగాణ ఉద్యమకారుల జెఎసి రాష్ట్ర కార్యదర్శి తెలంగాణ కొమురయ్యలు డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, అమాయకపు ఆదివాసీల ప్రాణాలను కాపాడాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వారు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ, చత్తీస్ ఘఢ్‌తో పాటు మరికొన్ని రాష్ట్రాల్లోగత కొంతకాలంగా కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో అమాయకపు గిరిజనులను, మావోయిస్టులను చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టులు చర్చలకు సిద్ధమని ప్రకటించినప్పటికీ వారితో చర్చలు జరపకుండా కర్రెగుట్టల ప్రాంతాలలో కేంద్ర బలగాలు మోహరించడంవలన ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీలు ఎప్పుడు ఏమి జరుగుతుందోనని భయాందోళనలతో భయాందోళనలతో బతుకుతున్నారని అన్నారు. మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధమైనప్పుడు వారితో ఎందుకు చర్చలు జరపడం లేదని గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన ఎన్టీ రామారావు,మర్రి చెన్నారెడ్డి, వైఎస్ రాజశేఖర్ రెడ్డిలు చర్చలు జరిపిన విషయాన్ని వారు ప్రస్తావించారు. సహజ వనరులను కార్పోరేటర్ శక్తులకు దారతత్వం చేయడం కోసమే ఆపరేషన్ కాగార్ ను చేపట్టారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కలకోటి మహేందర్, ప్రజా సంఘాల నాయకులు మిరియాల కుమార్, మంద రవి, వట్టం సాయి కుమార్ తదితరులు పాల్గోన్నారు.

## జూన్ మొదటి వారం వరకూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ

గోదాంలో బియ్యం నిల్వలను తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/కమలాపూర్ :** జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను జూన్ మొదటి వారం వరకు నిర్వహించనున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో డిఆర్డిఎ ఐకెపి ద్వారా కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఇప్పటివరకు వచ్చిన ధాన్యం, ఎంత ధాన్యం కొనుగోలు చేసిన వివరాలతో పాటు ధాన్యపు సంచులు, టార్పాలిన్ కవర్లు, రికార్డుల నిర్వహణ, ధాన్యం అమ్మిన రైతుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయడం, మిల్లులకు ధాన్యం తరలింపు, తదితర వివరాలను జిల్లా కలెక్టర్ అధికారులు, ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆరబోసిన ధాన్యాన్ని కలెక్టర్ పరిశీలించారు. మాయిశ్చరైజర్ మిషన్ ద్వారా తేమ శాతాన్ని చూస్తున్నారా అని నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ కమలాపూర్ లో ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటివరకు రెండువేల క్వింటాల సన్న, దొడ్డు రకం ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 150 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉండగా ఇందులో 110 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగుతుందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని 37 మిల్లులకు తరలిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అకాల వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సరిపోను టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. హైదరాబాద్ లోని వాతావరణ కేంద్రం ద్వారా వాతావరణ పరిస్థితులను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సమాచారాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గత సీజన్ మాదిరిగానే సన్న, దొడ్డు రకం ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన విధంగా బోనస్‌ను అందజేయడం జరుగుతుందన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ జూన్ మొదటి వారం వరకు కొనసాగే దృష్ట్యా వీటన్నింటిని పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లను పూర్తి చేసామన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించిన అనంతరం మార్కెట్ యార్డు లోని గోదాముల్లో బియ్యం నిల్వలను అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కమలాపూర్ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ ఝాన్సీ రాణి, వైస్ చైర్మన్ ఐలయ్య, హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కొమరయ్య, స్థానిక ఎంపిడిఒ గుండె బాబు, ఇతర అధికారులతో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ విద్యార్థులను అభినందించిన కలెక్టర్ ప్రావీణ్య




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఇటీవల వెలువడిన ఇంటర్మీడియట్ వార్షిక ఫలితాలలో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన జిల్లాలోని పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలవిద్యార్థిని, విద్యార్థులను హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య గురువారం అభినందనలు తెలియజేశారు. హసన్ పర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల, హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, వడ్డేపల్లి లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ధర్మసాగర్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించగా జిల్లా కలెక్టరేట్ లో కలెక్టర్ అభినందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించి జిల్లాకు మంచి పేరును తీసుకువచ్చారని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గోపాల్, ఆయా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## నల్ల మహాత్మకు పలువురు న్యాయవాదుల పరామర్శ



**ప్రజాపక్షం/వరంగల్ లీగల్ :** హనుమకొండ జిల్లా న్యాయస్థానంలో ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదిగా విధులు నిర్వర్తిస్తున్న నల్లా మహాత్మా తల్లి నల్లా భాగ్యలక్ష్మి అనారోగ్యంతో మరణించగా పలువురు న్యాయవాదులు గురువారం ఆయనను పరామర్శించి నల్లమహాత్మ కుటుంబాన్నీ ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా నల్లమహాత్మ తన తల్లిని కోల్పోవడం చాలా బాధాకరమని అభిప్రాయపడ్డారు. తన తల్లి నల్లా మహాత్మాను ఈ స్థాయికి తీసుకురావడానికి చాలా కష్టపడ్డారు అని తెలిపారు. నల్లా మహాత్మ గతంలో వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీగా,బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ గా సేవలు అందించారని, ఇటీవల హనుమకొండ జిల్లా న్యాయస్థానం నందు ప్రభుత్వం తరఫున స్పెషల్ జిపిగా అపాయింట్ అయి సేవలు చేస్తున్నాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బార్ కౌన్సిల్ మెంబెర్స్ సిరికొండ సంజీవరావు, దుస్స జనార్దన్, టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వేముల రమేష్, టిపిసిసిటీ రాష్ట్ర సెక్రటరీ తోగరు జగన్మోహన రెడ్డి, కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ తోట రాజుకుమార్, వరంగల్ జిల్లా డిసిసి అధికార ప్రతినిధి రావుల శ్రీనివాస్ రేడ్డి, ఎంఎల్ఎఫ్ జాతీయ అధ్యక్షులు వివి రత్నం, గుర్రాల వినోద్ కుమార్, మైదం జయపాల్, కొండపాక కృష్ణ గోవింద్, నాగభూషణం, హన్మకొండ, వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు తదితరులు పాలుగోన్నారు.

## రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్స్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా కుడుదుల వెంకటేష్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :**ఈ నెల 21, 22లో రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఏరియాలో తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్స్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర 4వ మహాసభల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన కుడుదుల వెంకటేష్‌ను రాష్ట్ర కార్యదర్శిగా ఏ కగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ, ఈ మహాసభల్లో మా జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు బాధ్యతలను గుర్తించి పదవి బాధ్యతలు అప్పగించినందుకు జయశంకర్ భూ పాలపల్లి జిల్లా పక్షాన. అధ్యక్షులు మార గోని ప్రవీణ్ కుమార్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులందరికీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ పదవిని బాధ్యతగా నిర్వహిస్తూ కార్మికుల పక్షాన అను నిత్యం ఆందోళన పోరాట కార్యక్రమాలు నిర్వహిస్తూ రాష్ట్ర కమిటీకి సహాయ సహకారంగా ఉంటామని వెంకటేష్ తెలియజేశారు. ఈ మహాసభల్లో ముగ్గురికి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్గా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఆకుల శ్రీనివాస్, బండారి లావణ్య ,కుమ్మరి బాబు లకు రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లుగా అవకాశం కల్పించారు.

## మాది ఉద్యమ పార్టీ.. తెలంగాణ ప్రజల సేవే మా లక్ష్యం

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం / ఎల్కతుర్తి :** మాది ఉద్యమ పార్టీ తెలంగాణ ప్రజల సేవే మా లక్ష్యమని, బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపు నిచ్చారు. బిఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్సీ పో చంపల్లి శ్రీనివాస్, రెడ్డి, తక్కలపల్లి రవీంద్రరావు, హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వోడితల సతీష్ కుమార్, గురుకులాల సంస్థ మాజీ కార్యదర్శి బిఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ మంత్రులు, మాజీ ఎంపిలు, మాజీ ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లులతో కలసి సభ స్థలాన్ని గురువారం పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం ఏర్పడిన పార్టీ మా బిఆర్ఎస్ పార్టీ 2001లో పుట్టినప్పటి నుండి ప్రతి సంవత్సరం ఈ పండుగను జరుపుకుంటాం అన్నారు. 25వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని చింతలపల్లి వద్ద రజతోత్సవ సభను జరుపుకోబోతున్నాం అన్నారు. 2001లో కెసిఆర్ పిడికిలి బిగించి పార్టీని స్థాపించి 14సంవత్సరాలు ఉద్యమం చేశారు అని చెప్పారు. ఎన్నో ఇబ్బందులకు గురి చేసిన, కెసిఆర్ తెలంగాణ కోసం ఎన్నోసార్లు రాజీనామా చేశారు అని అన్నారు. రజతోత్సవ సభను ఈనెల 27న జరుపుకుంటున్నాం కెసిఆర్ రాష్ట్ర రాజకీయాలను కాదు దేశ రాజకీయాలను ప్రభావితం చేయగలరు అన్నారు. సభ కోసం సిపికి బందోబస్తు గురించి వివరించడం ఇలాంటి ఆటంకాలు లేకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, చూడాలని సూచించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్, వైస్ చైర్మన్ మునిగడప శేషగిరి, మండల సీనియర్ నాయకులు తంగేడ మహేందర్, యేల్తూరి స్వామి ,తంగేడ నగేష్, తంగెడ శాలిని, శ్రీపతి రమాదేవి, మేకల స్వప్న, కడారి రాజు గోల్లే మహేందర్, గుండేటి సతీష్,నేతకొమ్మిడిమహిపాల్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు

## 29 నుంచి భద్రకాళీ భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాలు

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి ఆహ్వానం

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** భద్రకాళి దేవస్థానం, హనుమకొండలో శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాలు ఈ నెల 29 మంగళవారం నుండి మే10 శనివారం వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల తొలి రోజు 29న మంగళవారం ఉదయం 9:00 గంటలకు, ఉభయ దాతలుగా మున్నూరు కాపు సంఘం, వరంగల్ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించబడతాయని సంఘం నాయకులు తెలిపారు. ఈ మహోత్సవంలో పాల్గొనాల్సిందిగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని కోరుతూ హనుమకొండలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆహ్వాన పత్రికను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన బ్రోచర్ ఆవిష్కరణలో పాల్గొన్న మున్నూరు కాపు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కటకం పెంట య్య, గౌరవ సలహాదారు ఈ.వి. శ్రీనివాస్ రావు, మునిసిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, హనుమకొండ జిల్లా అధ్యక్షులు కనుకుంట్ల రవికుమార్, గైనేని రాజన్ – కోశాధికారి పూజారి సత్యనారాయణ, కార్యదర్శి మందాటి మనోజ్ కుమార్, కాకతీయ సంఘం అధ్యక్షులు మున్నూరు కాపు పరపతి తోట కనకారావు, సంఘం అధ్యక్షులు పోలు లక్ష్మణ్, బండారి మహేందర్,దశరథ్‌కుమార్,తదితరులుపాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల విషయంలో పారదర్శకత పాటించాలి



ప్రజాపక్షం/కారేపల్లి: ఇందిరమ్మ ఇళ్ల విషయంలో పారదర్శకత పాటించాలని వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జిన్నింగ్ మిల్‌లో ఏర్పాటైన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నిజమైన నిరుపేదలకు దక్కేలా చూడాలని, స్వప్రయోజనాలకు తావులేకుండా ప్రజా ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమపథకాలు గురరించి క్షేత్రస్థాయిలో ప్రజానికానికి చైతన్యపరచాలన్నారు. గ్రామాల్లోని సమస్యలు నాదృష్టికి తీసుకురావాలని, అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగాలని కార్యకర్తలకు దిశానిర్థేశం చేశారు.

## పహల్గామ్ మృతులకు ఘన నివాళి




ప్రజాపక్షం/ అశ్వారావుపేట: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు నివాళులర్పించారు. గురువారం కళాశాల నుండి బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి ఉగ్రవాదుల దాడిని ఖండించారు. ఇలాంటి సంఘటనలు జరగటం ఎంతో బాధాకరమని, ప్రతిఒక్కరూ ఉగ్రవాదుల దాడులను ఖండించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదుల దాడులను నియంత్రించి బాధిత కుటుంబాలను న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో కళాశాల ఎఒ రాఘవరావు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, అనూష, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## మొక్కజొన్నకు నిప్పు అంటించబోయి ప్రమాదవశాత్తు రైతు మృతి

ప్రజాపక్షం/తిరుమలాయపాలెం: వేసవిలో మళ్ళీ వ్యవసాయ భూములను సిద్ధం చేసే సమయంలో ఓ రైతు ప్రతి కొట్టేకు నిప్పు అంటించబోయి పక్కనే ఉన్న అన్నచేనులో ఉన్న మొక్కజొన్నకు నిప్పు అంటుకోగా మంటను ఆర్పే సమయంలో ప్రమాదవశాత్తు రైతు కట్టుకున్న పంచకు అంటుకొని రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పిండిప్రోలు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పిండిప్రోలు గ్రామానికి చెందిన కిలారు వెంకయ్య 60 తనకున్న వ్యవసాయ భూమిలో ప్రతి పంటను సాగు చేయగా ప్రతి కట్టెకు నిప్పుంటించే క్రమంలో పక్కనే ఉన్న తన అన్న భూమిలో ఉన్న మొక్కజొన్న పంటను సాగు చేయగా మొక్కజొన్నకు నిప్పు అంటుకోగా నిప్పు ఆర్పబోయి కిలారు వెంకయ్య కట్టుకున్న పంచకు నిప్పు అంటుకొని రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సులోచన మూడు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. వీరికి ముగ్గురు ఆడ సంతానం కాగా అందరికీ వివాహం జరిపించారు. గ్రామంలో ప్రతి ఒక్కరితో స్నేహభావంతో కలివిడిగా నడుచుకునే కిలారి వెంకయ్య చనిపోవడం గ్రామస్తుల్ని కంటతడి పెట్టించిది. గ్రామస్తుల సమాచారం మేరకు స్థానిక ఎస్ఐ కూచిపూడి జగదీష్ సిబ్బందితో కలిసి వెళ్లి జరిగిన సంఘటనను పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## మేడే సాక్షిగా సమస్యల పరిష్కారానికి ప్రతినబూనుదాం

సింగరేణివర్కర్స్ యూనియన్ కేంద్ర కార్యదర్శి వెంకట్



ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ : ప్రపంచ కార్మికుల పర్వదినం మేడే సాక్షిగా సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిస్కారంకోసం, కార్మికుల హక్కుల పరిరక్షణకోసం పోరాడతామని ప్రతినబూనాల్సిన అవసరం ఏర్పడిందని, భవిష్యత్తులో జరుగబోయే పోరాటాలకు కార్మికవర్గం సిద్ధంగా ఉండాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ కార్యదర్శి వంగవెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.వీరాస్వామి పిలుపునిచ్చారు. 139వ మేడే సందర్బంగా యూనియన్ ప్రచురించిన డిమాండ్ల గోడ ప్రతిని గురువారంఏఐటియుసి కార్యాలయం శేషగిరిభవంలో విడుదల చేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, నూతన బొగ్గుగనుల ప్రారంభించాల్సిన అవసరం ఉందని, బొగ్గు వెలికితీత పనుల్లో ప్రేవేటి కార్మికులను నియమించే విధానాన్ని యూనియన్ వ్యతిరేకిస్తుందన్నారు. కార్మిక చట్టాల సవరణ, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ. 40వేల కోట్లను తక్షణమే తిరిగి సంస్థకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో మేడేను జరపాలని, బొగ్గుగనుల, ఉపరితల విభాగాల్లో మేడే జెండాలను ఆవిష్కరించాలను కోరారు. సమావేశంలో నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.

## చెల్లని చెక్కు కేసులో ఆరునెలల జైలు

ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ : చెల్లని చెక్కు కేసులో నిందితునికి ఆరు నెలల జైలుశిక్షతో పాటు చెక్కుకు సంబంధించిన మొత్తం ధనం చెల్లించాలని ఖమ్మం రెండవ అదనపు ప్రథమశ్రేణి న్యాయాధికారి వై. బిందుప్రియ గురువారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే... ఖమ్మం పట్టణం ద్వారకానగర్‌కు చెందిన పెంట్యాల వాసు వద్ద ఖమ్మం పట్టణం చెందిన గడ్డం ధనుంజయ 2016 డిసెంబర్ 25న ఐదు లక్షలు అప్పు తీసుకున్నాడు. అదే రోజు ప్రాంసరీ నోటు రాసిచ్చాడు. 2018న ఐదు లక్షల రూపాయలకు చెక్కు ఇవ్వగా బ్యాంకు ఖాతాలో సరిపడ నగదు లేకపోవడంతో తిరస్కరణకు గురైంది. బాధితుడు వాసు మందడపు శ్రీనివాసరావు న్యాయవాది ద్వారా కోర్టును ఆశ్రయించాడు. కోర్టులో నిందితునికి ఆరునెలల జైలుతో పాటు చెక్కుకు సంబంధించిన మొత్తం ధనాన్ని చెల్లించాలని తీర్పునిచ్చారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే రాందాస్



ప్రజాపక్షం/జూలూరుపాడు:జూలురుపాడుమండలంఅన్నారుపాడుగ్రామంకు చెందినబానోత్‌నుమా పద్మ ఆహ్వానం మేరకు వారికుమార్తెమంజుశ్రీవెడ్స్ రమే ష్‌ల వివాహవేడుకకువైరానియోజకవర్గశాస నసభ్యులుమాలోత్‌రాందాస్‌నాయక్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు.కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరు లు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.అయోధ్య



ప్రజాపక్షం/మణుగూరు;అశ్వాపురం మండలం, మొండికుంట గ్రామ పంచాయతీ సిపిఐ నాయకులు బోల్కొండ అంతయ్య పద్మ దంపతుల కుమారుడు వేణు కావ్య ల వివాహ రిసెప్షన్ వేడుకలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజ్ అయోధ్య పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమం లో సిపిఐపినపాక నియోజకవర్గం కార్యదర్శి సైరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి యం. లక్ష్మ కుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు, సిపిఐ అశ్వాపురం మం డలం కార్యదర్శి,మొండికుంట నెల్లిపాక సొసైటీ వైస్ చైర్మన్, మొండికుంట బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు , సిపిఐ అశ్వాపురం మండలం కార్యవర్గ సభ్యులు దండి నాగేష్, దంతాల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## 'లైసెన్స్‌సర్వేయర్స్' నూతన కమిటీ ఎన్నిక

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఉమ్మడి ఖమ్మంజిల్లా లైసెన్స్‌సర్వేయర్స్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గురువారం ఖమ్మంలో రాష్ట్ర కమిటీ సమక్షంలో రాష్ట్ర అధ్యక్షులు ఎం. వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉమ్మడి ఖమ్మంజిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బొద్దుపల్లి హరికృష్ణ, ఉపాధ్యక్షులుగా అంబటి మాధవరావు, జనరల్ సెక్రటరీగా దండు భాస్కర్‌రావు, సభ్యులుగా భద్రయ్య, శేఖర్, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, హేమంత్, వీరబాబు, రవితేజ, కృష్ణ, గోపాలచారి, జగన్‌మోహన్ ప్రసాద్, నాగరాజు, వెంకటేశ్వరరావు తదితరులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ ఆధ్వర్యంలో లైసెన్స్ సర్వేయర్స్ యొక్క సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు వారు తెలిపారు.

## డిజిపిఎస్ సర్వేతో .... నూతన భూ కొలతలు


* లక్షకు పైగా పెండింగ్ లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులకు పరిష్కారం
* భూ హక్కుల రికార్డు పై అభ్యంతరం ఉంటే అప్పీలు చేసుకునే అవకాశం
* జిల్లా కలెక్టర్ ముజమ్మిలాఖాన్





ప్రజాపక్షం/నేలకొండపల్లి:ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన భూ భారతి చట్టం చట్టంతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని జిల్లా కలెక్టర్ ముజమ్మిలాఖాన్ అన్నారు. మండలం లోని ముజ్జుగూడెం లో గురువారం నిర్వహించిన రెవిన్యూ సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించా రు. భూమి స్వభావం, కొలతలు ఎక్కడ ఉంది తెలితేనే భూ సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని అన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని భూ భారతి చట్టంను ప్రవేశపెట్టిందని అన్నారు. 1910 నుంచి 1930 వరకు నైజాం కాలంలో భూ సర్వే జరిగిందని అన్నారు. భూ సమస్యల పరిష్కారం సర్వేతోనే సాధ్యమని అన్నారు.జిపిఎస్ సా ంకేతికతతో కూడిన యంత్రాలతో సర్వే చేయటం జరుగుతుందని ప్రతీ గ్రామానికి సర్వేయం సర్వేతోనే సాధ్యమని అన్నారు. జిపిఎస్ సాంకేతికతతో కూడిన యంత్రాలతో సర్వే చేపట్టం జరుగుతుందని ప్రతీ గ్రామానికి సర్వేయర్లను కేటాయించి సర్వే పూర్తి చేస్తామని, మం డలం లోని సర్వేయర్ సర్వే సరిగా జరిగినట్లు ధృవీకరణ జరుపుతారని అన్నారు. భూమి కొలతలు, ఎక్కడ ఉందో తెలిసిన తరువాత యాజమాన్యం హక్కు తేల్చాల్సి ఉం టుందని అన్నారు. ఖమ్మం జిల్లాలో దాదాపు లక్షకు పై గా సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయ ని, వీరికి పట్టాలు అందించేందుకు భూ భారతి చట్టం సౌ లభ్యం కల్పించామని అన్నారు. వారసత్వ భూములకు రిజిస్ట్రేషన్ మ్యూటేషన్ చేసే ముందుతప్పనిసరిగా కుటు ంబ సభ్యులందరికీ నోటీసులు జారీ చేయాలని, తరువాత మాత్రమే భూ హక్కుల బదలాయింపు జరగాలని కొత్త చట్టం చేర్చుకున్నామని, దీని వలన వివాదాలకు తా వు లేకుండా ఉంటుందని అన్నారు. భూ హక్కుల రికార్డులలో తప్పులు జరిగితే అప్పీల్ చేసుకునేందుకు గతంలో సివిల్ కోర్టు కు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని, భూ భారతి చట్టం ప్రకారం రెవిన్యూ కోర్టులకు ప్రవేశపెట్టిందని అన్నారు. నిర్దేశిత సమయంలో ప్రజలకు సేవలు అందేలా చట్టంలో అధికారుల పై బాధ్యత పెట్టిందని అన్నారు. భూ హక్కుల రికార్డు మ్యూటేషన్ దరఖాస్తులను 30 రోజుల లోగా పూర్తి చేయాలని, చేయని పక్షంలో దరఖాస్తు ఆటోమేటిక్ గా అమోదం పొందుతుందని అన్నారు. ఈ సదస్సులో భూ భారతి చట్టం పై అడ్వకేట్ సునీల్ పలు అంశాలపై వివరించారు. రైతులు వివిధ అంశాల పై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి, తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ సంఘం సభ్యులు, అడ్వకేట్ సునీల్, ఖమ్మం ఆర్‌డిఒ నరసింహారావు, పాలేరు ప్రత్యేకాధికారి రమేష్, ఎడిఎబి.సరిత, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపిడిఒ యం.యర్రయ్య, ఎఒ యం.రాధ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతి ఆసుపత్రికి ఐఎస్‌వో,ఎన్‌ఎబిహెచ్ గుర్తింపు



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని ప్రశాంతి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ఐఎస్ఒ, ఎన్‌ఎబిహెచ్ (నేషనల్ అక్రిడేషన్ బోర్డు ఫర్ హాస్పటల్స్ అండ్ హెల్త్ కేర్ ప్రోవైడర్స్) గుర్తింపు పొందినట్లు ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ కేసోజు భరత్‌బాబు గురువారం తెలిపారు. ఖమ్మం జిల్లాతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, నల్లగొండ, కృష్ణా జిల్లాలతో పాటు ఉమ్మడి రాష్ట్రంలోనే సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందిస్తూ పేద, మధ్య తరగతి ప్రజలకు అత్యాధునీక వైద్యం తక్కువ ఖ ర్చుతో అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. తక్కువ ఫీజుతో నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్న య జమాన్యాన్ని ఐఎస్‌వో డైరెక్టర్ అభినందిస్తూ భవిష్యత్తులో కూడా అత్యుత్తమ వైద్య సేవలను అందించాలని తెలిపినట్లు భరత్‌బాబు తెలిపారు. నిజాయితీ, నిబద్ధత గల వైద్యుల పర్యవేక్షణలో నాణ్యమైన వైద్యం అందిస్తుండడంతో ప్రశాంతికి అరుదైన గౌరవం లభించిందని ఆయన తెలిపారు. ఐఎస్‌వో, ఎన్ఎబిహెచ్ గుర్తింపు పొందడం పట్ల ప్రశాంతి ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ భరత్‌బాబుతో పాటు వైద్యులకు పలువురు పుర ప్రముఖులు, వైద్యులు అభినందనలు తెలిపారు. ఆసుపత్రి వద్ద ఐఎస్‌వో గుర్తింపు లభించడంతో సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు రాజ్‌కుమార్, జీవన్‌కుమార్, మధుసూదన్ పాల్గొన్నారు.

## తక్కువ ఖర్చుతో ఆధునిక వైద్యం'మమత'లక్ష్యం

75 సంవత్సరాల మహిళకు అరుదైన శస్త్ర చికిత్స

మమత సంస్థల డైరెక్టర్ పువ్వాడ నరేన్ వెల్లడి



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : తక్కువ ఖర్చుతో ఆధునిక వైద్యం అందించడమే మమత వైద్య సంస్థల లక్ష్యమని మమత వైద్య విద్యా సంస్థల డైరెక్టర్ పువ్వాడ నరేన్ తెలిపారు. 75 సంవత్సరాల మహిళకు గైనకాలజీ విభాగంలో అరుదైన శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. గురువారం మమత జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డైరెక్టర్ పువ్వాడ నరేన్, డీన్ అనురాధ, సూపరింటెండెంట్ రామస్వామి, గైనకాలజీ హెచ్ఒడి నైమిషా లతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా హెచ్ఒడి నైమిషా మాట్లాడుతూ పది రోజుల క్రితం ఖమ్మం మమత ఆసుపత్రికి సూర్యాపేట జిల్లా రంగాపురం గ్రామానికి చెందిన 75 సంవత్సరాల పి. సుశీల కడుపునొప్పితో బాధపడుతూ ఆసుపత్రికి వచ్చిందని ఆమె తెలిపారు. ఆమెకు అన్ని రకాల వైద్య పరీక్షలను నిర్వహించి, అండాశయంలో కణితి (నీటి బుడగ) ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆ కణితి వల్ల ఆమె తీవ్ర కడుపునొప్పితో పాటు ఇతర అవయవాలకు కూడా ఇబ్బందులు ఏర్పడ్డాయని ఆమె తెలిపారు. ఆమెకు ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్స నిర్వహించి సుమారు ఏడు కిలోల కణితిని తొలగించినట్లు ఆమె పూర్తిగా కోలుకుందని శుక్రవారం డిశ్చార్జ్ చేస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి శస్త్ర చికిత్సలకు పెద్ద పెద్ద నగరాల్లో రెండు లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతుందని అటువంటి వైద్యాన్ని ఆరోగ్యశ్రీలో సుశీలకు ఉచితంగా అందించినట్లు తెలిపారు. ఈ శస్త్ర చికిత్సను హెచ్ఒడి నైమిషా, ఇందు, హర్షిక , గీత బృందం, అనస్థీషియా హెచ్ఒడి డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ శశాంక బృ ందం తదితరుల ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించినట్లు వారు తెలిపారు. డైరెక్టర్ పువ్వాడ నరేన్ మాట్లాడుతూ 25 సంవత్సరాల క్రితం స్థాపించిన మమత వైద్య సంస్థలు ఉమ్మడి ఖమ్మంజిల్లాతో పాటు చుట్టు పక్కల జిల్లాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందిస్తూ ప్రజల మన్ననలు పొందిందన్నారు. మారుతున్న పరిజ్ఞానానికి అనుగుణంగా అధునాతన సౌకర్యాలు కల్పిస్తూ పేదలకు తక్కువ ఖర్చుతో అత్యాధునిక వైద్యం మమతలో అందిస్తున్నట్లు తెలిపారు. పెద్ద పెద్ద నగరాలకే పరిమితమైన ఎన్నో క్లిష్ట తరమైన శస్త్ర చికిత్సలను కూడా తక్కువ ఖర్చుతో, ఆరోగ్యశ్రీలో మమతలో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మమతలో అన్ని విభాగాలలో నిష్ణాతులైన వైద్యులు అందుబాటులో ఉన్నారని అన్ని రకాల శస్త్ర చికిత్సలు తక్కువ ఖర్చుతో అందిస్తున్నట్లు ఉమ్మడి ఖమ్మంజిల్లా ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## నాణ్యమైన ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలి

ఎండ లేని సమయాల్లోనే కాంటా వేయాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన రాష్ట్ర బృందం



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ధాన్యం కొనుగోలుపై రాష్ట్ర బృందం, ఐకెపి, ప్యాక్స్, డిసిఎంఎస్,మెప్మా, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. పౌర సరఫరాల కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన రాష్ట్ర బృందం కూసుమంచి మండలం పాలేరు గ్రామంలో ఐకెపి ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను, నేలకొండపల్లి మండలంలో అరుణాచల రైస్‌మిల్లును తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు రికార్డును పరిశీలించి ప్రభుత్వం సూచించినవిధంగా నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని, కొనుగోళ్లలో సీరియల్ నెంబర్ పాటించాలని, కాంటా వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు నిర్దేశించిన రైసు మిల్లులకు తరలించాలన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున వృద్దులను ఎవరిని కొనుగోలు కేంద్రాల వద్ద ఉంచకూడదని ఎండ లేని సమయాల్లోనే కాంటా వేయాలని రైతులకు తాగునీరు,ఒఆర్‌ఎస్ ప్యాకెట్ అందుబాటులో ఉంచాలని సూచించారు. రైసుమిల్లుల వద్ద కొనుగోలు కేంద్రం నుంచి వచ్చిన ధాన్యం త్వరిత గతిన అన్‌లోడ్ చేసి ఒపిఎంఎస్‌లో అప్‌డేట్ చేసుకోవాలని ప్రభుత్వానికి చెల్లించాల్సిన బియ్యం మే నెల వరకు చెల్లించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు రైతుల వద్ద నుంచి 29,695 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని జిల్లాలో 799 మంది రైతుల నుంచి 6,165 క్వింటాళ్ల సన్నరకం ధాన్యం కొనుగోలు చేసి రూ. 3.08 కోట్లు బోనస్ రూపంలో చెల్లించామన్నారు.సమావేశంలో పౌర సరఫరాల డిప్యూటీ కమిషనర్ కొండలరావు, జనరల్ మేనేజర్ నాగేశ్వరరావు, జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి , జిల్లా పౌర సరఫరాల మేనేజర్ , డిప్యూటీ తహసీల్దార్ (సిఎస్), ఖమ్మంరూరల్, నేలకొండపల్లి సిఎస్ , ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

## మైన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి..

ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ వై. రాంగోపాల్




ప్రజాపక్షం/మణుగూరు:మణుగూరు ఏరియాలోని కొండాపురం మైన్ లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ మైన్ మేనేజర్ పి నరసింహారావుకి గురువారం ఎఐటియుసి ఆధ్వర్యంలో మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో బ్రాంచ్ సెక్రటరీ కామ్రేడ్ రాంగోపాల్ మాట్లాడుతూ గనిలో ఆర్ఒ వాటర్ ప్లాంట్ పనిచేయడం లేదని క్యాంటీన్‌లో త్రాగునీటి సౌకర్యం కల్పించాలని, వాష్ రూమ్ లలో కనీస సౌకర్యాలు కల్పించాలని, వాటర్ సప్లై చేయాలని, మైనింగ్ స్టాఫ్, టెక్నీషియన్స్ రూమ్‌లలో ఉన్న సమస్యలు పరిష్కరించి ఆధునీకరించాలని, మూడు షిఫ్టులలో విధిగా డ్రైవర్లను నియమించాలని, కార్మికులపై పని భారాన్ని తగ్గించాలని, మ్యాన్ రైడింగ్ సమస్యను పరిష్కరించాలని, సేఫ్టీ నిర్లక్ష్యం చేయడం వలన కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నారని, కావున సేఫ్టీ గా పనిచేయించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, మ్యాన్ రైడిం గ్ లో పనిచేస్తున్న టెక్నీషియన్స్‌కి ష్లేడేలు కల్పించాలని, కార్మికులందరి కీ లాకర్లు, కప్ బోర్డ్స్, గమ్ షూస్ ఇవ్వాలని, సేఫ్టీ కమిటీ, మైన్స్ కమిటీలలో ప్రస్తావించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అలాగే ఎఐటియుసి యాజమాన్య ం తో చేసుకున్న ఒప్పందం ప్రకారం జనరల్ మజ్దార్లను జ నరల్ అసిస్టెంట్లుగా మారుస్తూ యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసిందని ఇది కార్మికుల విజయంగా పేర్కొన్నారు. సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ ఎం.వి.రాంనర్సయ్య, ఆఫీ స్‌బెరర్, ఫిట్ సెక్రటరీ ,తదితరులు పాల్గొన్నారు.

## పాడి రైతుల అభివృద్ధికి ప్రభుత్వ తోడ్పాటు

సకాలంలో బిల్లులు చెల్లించేలా చర్యలు


విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : పాడి రైతుల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు నందిస్తుందని విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి తెలిపారు. గురువారం చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి ఖమ్మంలోని విజయ డెయిరీని సందర్శించారు. తొలుత ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్ గ్రామంలో పాల సేకరణ కేంద్రం వద్ద రైతులతో చైర్మన్ అమిత్‌రెడ్డి ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన విజయ డెయిరీ పార్లర్‌ను చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, మంత్రి తుమ్మల తనయుడు తుమ్మల యుగంధర్, డిసిసి ప్రెసిడెంట్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల నరేందర్ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం విజయ డెయిరీ ప్లాంట్‌ను చైర్మన్ సందర్శించి కంప్రెసర్, ప్యాకేజింగ్, కోల్డ్ రూమ్స్, బాయిలర్ తదితర వాటిని పరిశీలించి ఉద్యోగులతో ప్లాంట్ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం డెయిరీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో చైర్మన్ అమిత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. పాల ఉత్పత్తిదారులు, పాడి రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ సహకారంతో డెయిరీ కృషి చేస్తుందని ఆయన తెలిపారు. పాడి రైతులను ప్రోత్సహించేందుకు లీటరుకు ఐదు రూపాయలు ధర పెంచినట్లు ఆయన తెలిపారు. పాల బిల్లులు గత కొంత కాలంగా ఆలస్యంగా ఇస్తున్నామని బిల్లులు సకాలంలో అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చైర్మన్‌ను ఇందిర మహిళ డెయిరీ బృందం కలిసివారి సమస్యలనువివరించారు. విజయ డెయిరీకి పాల సేకరణ గతంలో కంటే మె రుగైందని మహిళ సంఘాల ద్వారా గణనీయంగా పాల సేకరణ పెరిగిందన్నారు. ఉప ముఖ్యమంత్రి ప్రోత్సాహంతో మ ధిర నియోజక వర్గంలో మహిళా సంఘాలకు ఇంటికి రెండు గేదెలను అందించనున్నట్లు చైర్మన్ తెలిపారు. పట్టణ స్థాయిలోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా విజయ డెయిరీని విస్తరించనున్నట్లు తెలిపారు. మరిన్ని డెయిరీ పార్లర్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సొసైటీ రిజిస్ట్రేషన్‌కు పాడి రైతులు తీర్మానించగా చైర్మన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ సిఅండ్ ఐ హైదరాబాద్ మధుసూదన్‌రావు, అడిషనల్ డిఆర్‌డివో నూరుద్దీన్, పాడి గణాభివృద్ధి సంస్థ చైర్మన్ , ఖమ్మం డిడి మోహన్‌మురళి, డెయిరీ మే నేజర్ మురళి కృష్ణ, డెయిరీ ఇంజనీర్ నాగమణి, హన్మంతు, సేల్స్ ఇంచార్జ్ , పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మామిడి పండ్ల మార్కెట్‌ను వినియోగించుకోవాలి

* సహజ సిద్ధంగా పండిన మామిడి పండ్ల విక్రయం
* వివిధ సీజన్‌లలో వచ్చే పండ్లను మార్కెట్‌లో విక్రయించేలా చర్యలు
* ఖమ్మం నగరంలో మామిడి పండ్ల మార్కెట్‌ను ప్రారంభించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్





ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : రైతులు, వినియోగదారులు మామిడి పండ్ల మార్కెట్‌ను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం ఖమ్మం నగరం రోటరీ నగర్‌లో గల వీధి వ్యాపారుల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మామిడి పండ్ల మార్కెట్‌ను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం నగరం రోటరీ నగర్‌లో వీధి వ్యాపారుల ప్రాంగణంలో 30కు పైగా స్టాళ్లతో మామిడి పండ్ల మార్కెట్‌ను నూతనంగా ఏర్పాటు చేసుకున్నామన్నారు. మొదటి రోజు మూడు స్టాళ్లలో రైతులు పండ్ల విక్రయం చేపట్టారని, విస్తృత ప్రచారం కల్పించి రైతులు ఎక్కువ సంఖ్యలో విచ్చేసి మొత్తం స్టాల్‌లు నిండుగా పండ్ల వ్యాపారం జరిగేలా చూడాలని తెలిపారు. ఖమ్మం పరిసర మండలాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి మామిడి రైతులు ఇక్కడికి విచ్చేసి పండ్లు విక్రయిస్తారని కలెక్టర్ తెలిపారు. రైతులకు, వినియోగదారులకు ఉపయోగపడేవిధంగా మార్కెట్ అందుబాటులోకి వచ్చిందన్నారు. దళారులు లేకపోవడంతో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. వినియోగదారులకు సహజ సిద్ధంగా పండించిన కార్బైడ్ రహిత మామిడి పండ్లు అందేలా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. మామిడి పండ్ల మార్కెట్ మాత్రమే కాకుండా మామిడి సీజన్ ముగిసిన తర్వాత వివిధ సీజన్లలో వచ్చే ప్రత్యేకమైన పండ్లు జామ, సీతాఫలం, బొప్పాయి వంటి రైతులు నేరుగా ఇక్కడకు వచ్చి విక్రయించేలా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అనంతరం కలెక్టర్ వ్యాపారులకు పండ్ల కవర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి ఎంవి. మధుసూదన్, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఎ అలీమ్, కార్పొరేటర్ నీరజ, ప్రజాప్రతినిధులు నల్లమల వెంకటేశ్వరరావు, మామిడి రైతులు పాల్గొన్నారు.

ఫోకస్

# వ్యవసాయం

## పంట వ్యర్థాల దగ్ధానికి ప్రత్యామ్నాయం ఏమిటి?





దేశంలో పంట వ్యర్థాలను తగలబెట్టే విధానానికి స్వస్తి పలకాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకే, యుద్ధ ప్రాతిపదికన ప్రత్యామ్నాయాలను అన్వేషించక తప్పని పరిస్థితి. పంట వ్యర్థాలను దగ్ధం చేయడాన్ని సుప్రీం కోర్టు ఆక్షేపించడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో, పంట వ్యర్థాల నిర్వహణ అంశం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సమస్య అధికంగా ఉన్న పంజాబ్‌లో అనుసరించాల్సిన విధానాలపై ఐఐఎం అమృత్‌సర్ ఒక అధ్యయనాన్ని నిర్వహించింది. దాని నివేదికను అనుసరించి, పంట దుబ్బులను తగలబెట్టే విధానాన్ని, నిర్మాణాత్మక మార్కెట్ విధానాలతోపాటు, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) వంటి ప్రోత్సాహకాల ద్వారా నియంత్రించవచ్చు. కేంద్ర ప్రభుత్వం నేతృత్వంలోని అంశాలు, నిర్ణయాలు, జోక్యాలు అనుకోకుండా స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ఎలా బలహీనపరిచాయో ఇది ప్రతిబింబిస్తుంది. కాగా, పంటల దగ్ధానికి గల కారణాల్లో విధాన ప్రేరిత 'మోనోక్రాపింగ్' నమూనాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. ఎంఎస్‌పి వ్యవస్థ గోధుమ, బియ్యం ఉత్పత్తికి ప్రాధాన్యత ఇస్తుంది. రైతులకు హామీ ఇచ్చిన ఆదాయాన్ని అందిస్తుంది. ధరల నష్టాలను తగ్గిస్తుంది. ముఖ్యంగా పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఎంఎస్‌పిపై తీవ్ర అసంతృప్తి నెలకొని ఉంది. రైతుల డిమాండ్‌కు అనుగుణంగా ఎంఎస్‌పికి చట్టబద్ధతపై లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీని సైతం మోదీ సర్కారు నిర్లక్ష్యం చేస్తున్నది. దీనితో పంట నిర్వహణ ఖర్చులను తగ్గించుకోవడానికి రైతులు పంట వ్యర్థాలను లేదా దుబ్బులను దగ్ధం చేసే కాలం చెల్లిన విధానాన్ని ఇప్పటికీ అనుసరిస్తున్నారు. పంట వ్యర్థాల నిర్వహణపై స్పష్టత లేకపోవడం పంట వైవిధ్యతను నిరుత్సాహపరుస్తున్నది. వరి పంట పేరుకుపోవడానికి దారితీస్తున్నది. రైతులు తరచుగా తదుపరి పంట సీజన్ కోసం పొలాలను త్వరగా క్లియర్ చేయడానికి కాల్చివేస్తారు. కాగా, మార్కెట్ వక్రీకరణలు, ధరల ఒత్తిళ్లు కూడా రైతులను ఇరుకున పెడుతున్నాయి. భారతదేశంలో వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థ వక్రీకరణ జరిగింది. రైతులు పంట ధరలు, రుణ సదుపాయం, మార్కెట్ సంబంధాలను నియంత్రించే మధ్యవర్తులపై (ఆర్థియాలు) ఆధారపడుతున్నారు. రైతులు తమ ఉత్పత్తులను ఈ మధ్యవర్తులు నిర్ణయించిన కృత్రిమంగా తక్కువ ధరలకు అమ్ముతారు. ఇది తరచూగా అప్పుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితిని సృష్టిస్తుంది. ప్రధాన రబీ పంటలకు రైతులు వినియోగదారుల ధరలో 4067శాతం మాత్రమే పొందారని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) సర్వే (మేజూలై 2024) స్పష్టం చేస్తున్నది. నిలకడగా ఉన్న ఎంఎస్‌పి రేట్లు పెరుగుతున్న సాగు ఖర్చులను భరించలేకపోతున్నాయి. దీని వలన రైతులు ఖర్చుతో కూడుకున్న, హానికరమైన, గడ్డి దహనం వంటి పద్ధతులను అనుసరించాల్సి వస్తున్నది. పరిస్థితులను కేంద్రం చక్కదిద్దలేకపోతున్నది. పంట వ్యర్థాలను తగలబెట్టడాన్ని శక్తి స్వస్థపటితే, పంట అవశేషాలు నిర్వహించడానికి సరసమైన, స్థిరమైన ప్రత్యామ్నాయాలను అందించడంలో విఫలమవుతోంది. తగినంత ప్రభుత్వ మద్దతు, మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల రైతులు త్వరితమైన, చౌకైన పరిష్కారంగా గడ్డి దహనాన్ని ఆశ్రయిస్తున్నారు. అస్తవ్యస్తమైన రుతుపవనాలు, వాతావరణ మార్పుల కారణంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు వ్యవసాయ అనిశ్చితిని పెంచాయి. ఉదాహరణకు, అక్టోబర్ 2023లో కురిసిన వర్షాల కారణంగా పంట కోత ఆలస్యమైంది. దీని వలన రైతులు పంట కోత కోసం పంట కోతలను త్వరగా తొలగించడానికి పంట కోతలను ఆశ్రయించారు. పుసా డీకంపోజర్ వంటి బయో డీకంపోజర్ల లాజిస్టికల్ ఆలస్యం, అస్థిరమైన ఫలితాలు, ఫాలో అప్ లేకపోవడం వల్ల తక్కువ ఫీల్డ్ వినియోగాన్ని ఎదుర్కొంటున్నాయి. సరైన శిక్షణ, సకాలంలో పంపిణీ లేకపోవడంతో, పర్యావరణ అనుకూల పరిష్కారాలు తగిన స్థాయిలో ఉండడం లేదు. ఇవన్నీ రైతులు అవలంభిస్తున్న సేద్య విధానాలు, పంట కోత తదుపరి తీసుకుంటున్న నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయి. పంట వ్యర్థాలను కాల్చడం అనే సమస్య ఉత్తర భారత దేశంలో ఎక్కువగా ఉంది. పంజాబ్, హర్యానా, వాటి సమీప రాష్ట్రాలలోని రైతులు అక్టోబర్‌నవంబర్‌లలో రబీ పంటల కోసం పొలాలను శుభ్రం చేయడానికి వరి దుబ్బులను కాల్చివేస్తున్నారు. ఈ సీజన్‌లో వాయు కాలుష్యానికి ఇది 22–35 శాతం దోహదపడిందని 2023లో ఐఐటిలు, టిఇఆర్ఐ నిర్వహించిన అధ్యయనంలో స్పష్టమైంది. ఈ ప్రాంతాల నుండి వచ్చే గాలులు ఢిల్లీ నేషనల్ క్యాపిటల్ ప్రాంతంలో పిఎం2.5 స్థాయిలను పెంచుతున్నాయి. ప్రతి అగ్ని ప్రమాదం పిఎం2.5లో 112.44యూనిట్ల పెరుగుదలకు దారితీస్తుంది.



పంట వ్యర్థాల దహనాన్ని అరికట్టడానికి కొన్ని సాంకేతిక చర్యలు అత్యవసరం. హ్యాపీ సీడర్‌ను ఉపయోగించడంలో వీటిలో ప్రధానమైనది. గడ్డిని కోసేటప్పుడు, ఎత్తేటప్పుడు గోధుమలను నేరుగా వరి పొలాల్లోకి విత్తే ట్రాక్టర్‌మౌంటెడ్ పరికరం కావడంతో, కాల్చే అవసరాన్ని తొలగిస్తుంది. సమయాన్ని ఆదా చేస్తుంది. ఖర్చులను తగ్గిస్తుంది. నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. అదే విధంగా పూసా డీకంపోజర్ అనేది వరి మొద్దును కంపోస్ట్‌గా కుళ్ళిపోయే సూక్ష్మ జీవుల సూత్రీకరణ. ఇది నేల సారాన్ని పెంచుతుంది. మొద్దులను కాల్చే అవసరాన్ని తగ్గిస్తుంది. అదే విధంగా పంట అవశేషాల పెల్లెటైజేషన్ కూడా రైతులకు ఉపయుక్తంగా ఉంటుంది. ఈ విధానంలో పంట అవశేషాలను శక్తి ఉత్పత్తికి ఉపయోగించే బయోమాస్ పెల్లెట్లుగా మారుస్తారు. ఇది గడ్డి దహనాన్ని తగ్గిస్తుంది. రైతులకు అదనపు ఆదాయాన్ని అందిస్తుంది. బయోచార్ ఉత్పత్తి విధానంలో పంట అవశేషాలను పైరోలైసిస్ ద్వారా బయోచార్‌గా మారుస్తారు. ఇది కూడా నేల సారవంతం, నీటి నిలుపుదల, సూక్ష్మ జీవుల కార్యకలాపాలను పెంచుతుంది. అదే సమయంలో కార్బన్ సీక్వెస్ట్రేషన్‌కు దోహదం చేస్తుంది.

# ప్రకృతి విలయం..



పర్యావరణం

ఇటీవల కాలంలో ప్రకృతి విలయాలు పెరుగుతున్నాయి. తాజాగా జమ్మూకశ్మీర్‌లోని రాంబన్ తహసీల్‌లో కుండపోత వర్షం కారణంగా గణనీయమైన ప్రాణనష్టం, మౌలిక సదుపాయాల, ఆకస్మిక వరదలు విస్తృతమైన విధ్వంసానికి ప్రధాన కారణాలు. కుంభ వృష్టి, అకాల భారీ వర్షాలను క్లౌడ్‌బర్స్ట్‌గా పేర్కొంటారు. అకస్మాత్తుగా, తీవ్రమైన వర్షపు తుఫాను, దీని ఫలితంగా ఒక చిన్న ప్రాంతంలో (సుమారు 10 కిమీ) ఒక గంట కంటే తక్కువ సమయంలో 10 సెం.మీ కంటే ఎక్కువ వర్షం పడుతుంది. దీనితో పాటు వడగళ్ళు పడతాయి. ఉరుములు వస్తాయి. పర్వత ప్రాంతాలలో, ముఖ్యంగా హిమాలయాలలో మేఘావృతాలు, కుంభవృష్టులు సర్వసాధారణం. స్థానికీకరించిన స్వభావం కారణంగా, మేఘాల విస్ఫోటనాలను అంచనా వేయడం లేదా గుర్తించడం కష్టం. కానీ ఆకస్మిక, వినాశకరమైన వర్షపాతం సంభవించి, ఆకస్మిక వరదలకు, కొండచరియలు విరిగిపడటానికి దారితీస్తుంది. తేమతో కూడిన గాలి పర్వత శ్రేణిపైకి బలవంతంగా పైకి లేచినప్పుడు ఇది సంభవిస్తుంది. గాలి పైకి వెళ్ళేటప్పుడు, అది చల్లబడి ఘనీభవిస్తుంది, ఫలితంగా భారీ వర్షపాతం వస్తుంది. బలమైన పైకి గాలి ప్రవాహాలు వర్షపు చినుకులు పడటానికి ముందు పెద్దవిగా మారడానికి కారణమవుతాయి. ఈ ప్రవాహాలు బలహీనపడినప్పుడు, పేరుకుపోయిన వర్షపు చినుకులు అకస్మాత్తుగా పడి, తీవ్రమైన వర్షపాతానికి దారితీస్తాయి. భారత ఉపఖండంలో, రుతుపవనాల మేఘం బంగాళాఖాతం లేదా అరేబియా సముద్రం నుండి ఉత్తరం వైపుకు కదిలి, మైదానాలను దాటి, హిమాలయాలను చేరుకుని, గంటకు 75 మిల్లీమీటర్ల వర్షపాతాన్ని విడుదల చేసినప్పుడు సాధారణంగా మేఘాల విస్ఫోటనం సంభవిస్తుంది. హిమాచల్ ప్రదేశ్ (2024) మరియు ఉత్తరాఖండ్ (2021) లలో సంభవించిన మేఘాల విస్ఫోటనాలు ప్రాణాంతక వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి ఘటనలు మౌలిక సదుపాయాలకు విస్తృతమైన నష్టాన్ని కలిగించాయి. కొండచరియలు విరిగిపడాన్ని గురుత్వాకర్షణ కారణంగా వాలుపై ఉన్న రాతి, నేల లేదా శిథిలాల క్రిందికి కదలికగా పేర్కొవచ్చు. ఇది ఒక రకమైన సామూహిక వృధా. దీనిలో భూమి పదార్థాలు గురుత్వాకర్షణ ప్రభావంతో వాలు పైకి కదులుతాయి. భారీ వర్షపాతం, భూకంపాలు, నీటి ఉధృతి వంటి సహజ కారకాలు వాలులను బలహీనపరుస్తాయి. అయితే అటవీ నిర్మూలన మరియు నిర్మాణం వంటి మానవ కార్యకలాపాలు ప్రమాదాలను పెంచుతాయి. నేల కూర్పు, భూభాగం వంటి భౌగోళిక అంశాలు కూడా వాలు స్థిరత్వాన్ని ప్రభావితం చేస్తాయి. కొండచరియలు విరిగిపడటానికి దారితీస్తాయి. మన దేశంలో 0.42 మిలియన్ చదరపు కి.మీ (భూభాగంలో 12.6%) కొండచరియలు విరిగిపడే అవకాశం ఉంది, ఈశాన్య హిమాలయాలు, వాయువ్య హిమాలయాలు, పశ్చిమ కనుమలు, కొంకణ్ కొండలు, తూర్పు కనుమలు ఎక్కువగా ప్రభావితమవుతాయి. 2024లో, వయనాడ్ (కేరళ) గణనీయమైన కొండచరియల పతనాన్ని ఎదుర్కొంది, అయితే 2013 కేదార్‌నాథ్ (ఉత్తరాఖండ్) కొండచరియలు విరిగిపడటం వల్ల 5,700 మందికి పైగా మరణించారు. 2021లో భారీ వర్షం మరియు హిమానీనదం విస్ఫోటనం కారణంగా సంభవించిన చమోలి కొండచరియలు విరిగిపడటం వలన విస్తృతమైన వరదలు, మరణాలు సంభవించాయి. ఇలావుంటే, తీవ్రమైన వర్షపాతం సమయంలో లేదా వెంటనే నీటి మట్టాలలో ఆకస్మిక పెరుగుదలను ఆకస్మిక వరదలు లేదా ఫ్లాష్‌ఫ్లడ్స్ అంటారు. ఇది సాధారణంగా కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితమవుతాయి. స్వల్పకాలిక సంఘటనలు, సాధారణంగా వర్షపాతం జరిగిన 6 గంటలలోపు సంభవిస్తాయి. ఆకస్మిక వరదల ప్రమాదం ప్రధానంగా తీవ్రమైన వర్షపాతం వల్ల పెరుగుతుంది. ఇది నేల శోషణ సామర్థ్యం మరియు మురుగునీటి పారుదల వ్యవస్థలను అధిగమిస్తుంది. భారీ వర్షాలతో పాటు, ఆకస్మిక ఉష్ణోగ్రత పెరుగుదల, ఆనకట్ట లేదా కట్టలు తెగిపోవడం, మంచు లేదా శిథిలాల జామ్‌లు, హిమనదీయ సరస్సుల ఆకస్మిక విస్ఫోటనాల కారణంగా వేగంగా మంచు కరగడం వల్ల కూడా ఆకస్మిక వరదలు సంభవించవచ్చు. అదనంగా, రోడ్లు – భవనాలు వంటి అభేద్యమైన ఉపరితలాలతో పట్టణీకరణ ప్రవాహాన్ని పెంచుతుంది. నీటి శోషణను తగ్గిస్తుంది. వరద ప్రమాదాలను తీవ్రతరం చేస్తుంది. హిమాచల్ 2023, ఉత్తరాఖండ్ 2013, మరియు ముంబై 2005 లలో తీవ్రమైన వర్షం కారణంగా భారీ ప్రాణనష్టం, ఆస్తి నష్టం సంభవించాయి.



## 'గౌతన్స్ మోడల్' అనుసరణీయం



ఛత్తీస్‌గఢ్ గౌతన్స్ మోడల్ అనేది కమ్యూనిటీ నేతృత్వంలోని ఒక కార్యక్రమం. ఇక్కడ గ్రామాలు పరలీ దాన్ ద్వారా ఐదు ఎకరాల భూమిని ఏర్పాటు చేసి, ఆవు పేడ, సహజ ఎంజైమ్‌లను ఉపయోగించి సేంద్రియ ఎరువుగా మారుస్తాయి. కస్టమ్ హైరింగ్ సెంటర్లు (సిహెచ్‌సిలు), యాంత్రీకరణ యాక్సెస్‌ను బలోపేతం చేయడం ఈ విధానంలో ఒక భాగం. బుకింగ్ యాప్‌లు మరియు GPSఎనేబుల్డ్ ఫ్లీట్ ట్రాకింగ్‌తో గ్రామ స్థాయిలో సుసంపన్నమైన సిహెచ్‌సిలను ఏర్పాటు చేస్తే ఉత్తమ ఫలితాలు అందుకోవచ్చు. అద్దె ఖర్చులకు సబ్సిడీ ఇవ్వడం, వాటిని పంట షెడ్యూల్‌లతో సమకాలీకరించడం, సొంత పరికరాలను కొనుగోలు చేయలేని చిన్న, సన్నకారు రైతులకు డిమాండ్ ఆధారిత యాంత్రీకరణను అందించడం వంటి చర్యలు కూడా అత్యవసరం. ఉమ్మడి టాస్క్ ఫోర్స్‌లను ఏర్పాటును పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. వాటి సూచనలను అనుసరించి, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ వంటి రాష్ట్రాలలో వ్యవసాయం, పర్యావరణం, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలతో కూడిన ఉమ్మడి టాస్క్ ఫోర్స్‌లను ఏర్పాటు చేయాలి. ఈ టాస్క్ ఫోర్సులు కాలుష్యాన్ని పరిష్కరించడానికి, కేంద్ర కాలుష్య ప్రణాళికలను స్థానిక వాస్తవాలతో సమలేఖనం చేయడానికి ఉమ్మడి జవాబుదారీతనంతో సమన్వయ ప్రయత్నాలను నిర్ధారించాలి. మొత్తం మీద భారతదేశంలో పంట వ్యర్థాలను తగలబెట్టడాన్ని నివారించడానికి వ్యవసాయ పనిముట్లకు సబ్సిడీ ఇవ్వడం, బయోమాస్ పవర్ ప్లాంట్లను అభివృద్ధి చేయడం, పంట అవశేషాల నుండి బయో ఇంధనాలు మరియు ఎరువులను ప్రోత్సహించడం వంటి ప్రత్యామ్నాయ పరిష్కారాలను ప్రోత్సహించడం అవసరం. పరిశోధనలను బలోపేతం చేయడం, అవశేషాల సేకరణ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, రైతు అవగాహనను పెంపొందించడం కూడా చాలా కీలకం.

## ఎర్రకోటపై ఎర్రజెండాను ఎగురవేయడమే కార్మికవర్గం ముఖ్యకర్తవ్యం: శివశంకర్



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణంలో డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లదగ్గర మేడే వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ జనరల్‌కాన్ ఫెడరేషన్ ఆఫ్‌లేబర్ 1895లో ఫ్రాన్స్‌లో ప్రారంభమైందన్నారు. 1905లో ట్రేడ్‌అండ్ యూనియన్‌గా ఏర్పడిందన్నారు. అమెరికా నగరం మే మార్కెట్లో 1886 మే 1న సమ్మె చేయాలని ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య సోషలిస్టు కార్మిక సంఘాల సమ్మె మే మార్కెట్లో భారీప్రదర్శన 8గంటల పనికై కార్మికులు కదంతొక్కారన్నారు. కార్మికులపై పెట్టుబడిదారులువారి వారి గుండాలు పోలీసులు జరిపిన తుపాకి కాల్పుల్లో చనిపోయిన వారి రక్తంతో తడిసి ఎగిరేసిన అదే మన ఎర్రజెండా అన్నారు. కావున మే 1న అమరవీరుల మరణానికి శ్రద్ధాంజలి ఘటిస్తూ భారతదేశంలో పెట్టుబడిదారుల పాలనను అంతంచేసి ఎర్రకోటపై ఎర్రజెండాను ఎగురవేయడమే కార్మికవర్గం యొక్క ముఖ్య కర్తవ్యమని అన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి భవననిర్మాణ కార్మికసంఘం జిల్లా కోశాధికారి బీసంమైబు, పెయింటర్స్ , కార్మికులు తప్పెట రామస్వామి, నర్సింహ్మ, రమేష్, కమాల్, సత్యం పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నూతనంగా ఎన్నికైన పిట్టల సమ్మయ్యకు సన్మానం

సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

**ప్రజాపక్షం/శంకరపట్నం :** ప్రభుత్వం బిల్డింగ్ వర్కర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యర్శి మర్రి వెంకటస్వామి డిమాండ్ చేశారు. శంకరపట్నం మండలం సిపిఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల సిపిఐ కార్యదర్శితో పాటు ఇటీవలే బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన పిట్టల సమ్మయ్యను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ బిల్డింగ్ కార్మికులను ప్రభుత్వం గుర్తించి అర్హులైన ప్రతి కార్మికునికి ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. వరి కొనుగోలు కేంద్రంలో రైతులను ప్రభుత్వం రెండు కిలోల తరుగు పేరుతో మోసం చేస్తుందని, వెంటనే తరుగు లేకుండా రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మార్చిలో రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో జరిగిన ఆ సంఘం రాష్ట్ర నాలుగో మహాసభలో పిట్టల సమ్మయ్య ప్రతిభను గుర్తించి బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. భవిష్యత్తు కాలంలో అంకితభావంతో కార్మిక, కర్షకుల ఐక్యత బలోపేతం చేసి మరింతగా వారి హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన సమ్మయ్య మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి బాధ్యతను అప్పగించిన సిపిఐ జిల్లా రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సంఘ బలోపేతానికి అంకితభావంతో నిర్విరామంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి కన్నం సదానందం, నాయకులు గోదారి లక్ష్మణ్, ఎండి ఖాజా పాషా, ఎండి షాకీర్, ఎండి పాషా తదితరులున్నారు.



# పహల్గామ్ ఉగ్రదాడి అమానవీయం

- అమాయక ప్రజలపై జరిగిన పాశవిక దాడిని ముక్తకంఠంతో ఖండించాలి
- జమ్ముకశ్మీర్ ప్రజలకు భారత పౌరసమాజం అండగా ఉంటుంది
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** జమ్ముకశ్మీర్ పహల్గామ్ యాత్రికులపై ఉగ్రవాదులు జరిగిన పాశవిక, పైశాచిక దాడి, మారణహోమం అమానవీయమని, ఈ దాడిని భారత కమ్యూనిస్టు పార్టీ కండిస్తుందని పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. పట్టణ పరిధిలోని రామవరం ఆటో అడ్డాలో జరిగిన కార్మికుల సమావేశం సందర్భంగా ఉగ్రదాడిలో మృతి చెందినవారికి నివాళులర్పిస్తూ మౌనం పాటించారు. అనంతరం జరిగిన సమావేశంలో సాబీర్ పాషా మాట్లాడుతూ ఉగ్రవాదులు దేశపౌరులపై కాల్పులు జరిపి హత్య చేయడం అనాగరిక చర్యని ఈ దాడిని యావత్ భారత పౌరసమాజం ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఉగ్రవాదులు కేవలం హిందువులని లక్ష్యంగా చేసుకొని కాల్చి చంపడం దేశంలో మతసామరస్యాన్ని దెబ్బతీసేందుకేనని స్పష్టమవుతోందని, ఇది ముమ్మాటికీ పిరికిపంద చర్యేనని స్పష్టం చేశారు. హిందూ, ముస్లింల మధ్య చిచ్చు రేపి దేశ సమైక్యతను దెబ్బతీసేందుకు పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు ఇలాంటి దుచర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దేశంలో కొందరు హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ పబ్బంగడుపుకుంటుంటే ఉగ్రవాదులు దాన్ని ఆసరాగా చేసుకొని మత చిచ్చు పెడుతున్నారన్నారు. కొద్ది రోజులక్రితం పాక్ ఆర్మిచిఎఫ్ అదేవిధంగా ఉగ్ర లష్కరే తోయిబా చీఫ్ కమాండర్ పరోక్షంగా హెచ్చరించినా కేంద్రం నిర్లక్ష్యం చేయడం వల్ల ఉగ్రదాడి జరిగిందని ఆరోపించారు. జరిగిన ఉగ్రదాడి ఇంటిలిజెన్స్ వైఫల్యమా, భద్రతా సిబ్బంది నిర్లక్ష్యమా కేంద్రమే తేల్చుకొని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, డిమాండ్లు, మేడే ఉత్సవాలపై చర్చించారు. సమావేశంలో ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు కంచర్ల జమలయ్య, మర్రి కృష్ణ, జలీల్, శ్రీనివాస్, హాబీబి, రాఫ్య్, ఆనందరావు, జంజర్ల శివ, బాషా, నాగుల్ మీరా, గుబ్బల శ్రీను, యూసుఫ్, జానీ, రవీందర్, సలీం, జిలాని, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న బిజెపి ప్రభుత్వం

నియోజకవర్గ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ భారత రాజ్యాంగ మూలసూత్రాలకు విఘాతం కలిగిస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వంపై ఉద్యమించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో డోర్నకల్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం బి.ప్రభేష్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గత 11సంవత్సరాలుగా పాలన చేస్తున్న బిజెపి భారత రాజ్యాంగ వ్యవస్థలను చిన్నా భిన్నం చేస్తూ మత విద్వేషాలను రెచ్చగొడుతూ క్లారిటీ వర్గాలపై విచ్చలవిడిగా దాడులు చేస్తూ రాజ్యాంగంలో కల్పించిన అవకావాలను తుంగలో తొక్కి లౌకిక వ్యవస్థకు గొడ్డలిపెట్టుగా మారిన బిజెపి పాలనపై ప్రజాస్వామిక శక్తులు ఏకమై ప్రతిఘటించాలని కోరారు. మేనెలలో శాఖ మండల మహాసభలు నిర్వహించాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆత్మ చైర్మన్‌గా నియామకమైన నల్లుసుధాకర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ విఫ్ డాక్టర్ రాంచంద్రునాయక్ మరిపెడ డివిజన్ ఆత్మ చైర్మన్‌గా నల్లు సుధాకర్‌రెడ్డిని ఎంపిక చేయడం పట్ల సిపిఐ జిల్లా పార్టీ హర్షం వ్యక్తం చేసింది. ఈ సమావేశంలో సిపిఐ జిల్లాకార్యవర్గ సభ్యులు నెల్లూరు నాగేశ్వరావు, కురవి, మరిపెడ డోర్నకల్, దంతాలపల్లి మండల కార్యదర్శులు కరణం రాజన్న,మారగాని బాలకృష్ణ, తురకరమేష్, పోలెపాక వెంకన్న, నాయకులుబుర్రసమ్మయ్య,బుడను వెంకన్న, దొంతు రాంమూర్తి, తురక రమేష్, నర్సింగం గురవయ్య, బసవ కొమరయ్య, బొల్లం ఉప్పలయ్య, నాగరాజు,వెంకన్న, సారయ్య,వెంకన్న, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## సుదీర్ఘమైన ఘనచరిత్ర కలిగిన పార్టీ సిపిఐ

రాజన్న సిరిసిల్లా జిల్లా సిపిఐ ప్రధాన కార్యదర్శి గుంటి వేణు

**ప్రజాపక్షం / వేములవాడ :** సిపిఐ పార్టీ శాఖల మహాసభ వేములవాడ స్థానిక మహాలక్ష్మి వీధిలోని గుమ్మిపుల్లయ్య భవన్‌లో గురువారం నిర్వహించారు. సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు కే.వి.అనసూర్య, సిపిఐ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిరిసిల్లా జిల్లా సిపిఐ ప్రధాన కార్యదర్శి గుంటి వేణు హాజరయ్యారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ సిపిఐ 100 సంవత్సరాల సుదీర్ఘమైన గణ చరిత్ర కలిగిందని భూమికోసం భుక్తి కోసం తెలంగాణ విముక్తి కోసం పోరాటాలు చేసిందని, దేశ స్వతంత్ర పోరాటంలో సైతం ఎనలేని పోరాటాలు కమ్యూనిస్టు పార్టీవేనని వేములవాడ ప్రాంతంలో కొండం చెరువు, బూడిది కుంట, పల్లగుట్ట తదితర ప్రాంతాల్లో ఇచ్చిన భూములను బ్లాక్ లిస్టులో పెట్టి లాక్కున్నారని పోడు వ్యవసాయం చేస్తున్న రైతులను కొట్టి కేసులు పెట్టారని కేసులు ఎత్తివేసి పోడుదారులకు పట్టాలు ఇవ్వాలన్నారు. రాబోయే రోజుల్లో వార్డు, గ్రామ సర్పంచ్, కౌన్సిలర్ లాంటి ఎన్నికల్లో సిపిఐ పార్టీ పోటీలో ఉంటుందని సిపిఐ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ కడారి రాములు అన్నారు. సిపిఐ పార్టీ పేదలు, కార్మికులు, కర్షకులు అందరి కోసం హక్కుల కోసం పోరాడుతుందని ప్రజలు పార్టీని ఆదరించి రాబోయే రోజుల్లో సిపిఐ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ సిపిఐ పార్టీ కార్యదర్శి గాజుల పోశెట్టి, అజ్జ వేణు, శ్రీరాముల నర్సయ్య, రూరల్ మండలం వేములవాడ కార్యదర్శి ఎల్ల దేవరాజు, కోకాపెల్లి శాంత, శేఖర్, పెంట మల్లయ్య, పెంట రాజేష్, పెంబర్ రాజు, నరేష్, తదితర సిపిఐ నాయకులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వం

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు



**ప్రజాపక్షం/ మంచిర్యాల :** 139వ మేడే వేడుకలను కార్మిక వర్గం విజయవంతంగా నిర్వహించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఎఐటియుసి జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా ఉపాధ్యాక్షులు మిట్టపల్లి పౌలు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మేడే పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం మేకల దాసు మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుండి కార్మికులు సాధించుకున్న హక్కులను కేంద్రం అధికారంలో ఉన్న ప్రభుత్వం చట్ట సవరణ ద్వారా నిర్వీర్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 44 కార్మిక కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా విభజించి కార్మికులకు హక్కులు లేకుండా, కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలను సవరిస్తుండటాన్ని కార్మిక వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆయన స్పష్టం చేశారు. 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, స్కీమ్ వర్కర్లను క్రమబద్ధీకరించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ. 26,000 నిర్ణయించాలని ఆయన కోరారు. పరిశ్రమల అమ్మకాన్ని ఆపాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమలన్నింటిని ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఇటీవల జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కలిందర్ అలీ ఖాన్, దాగం మల్లేష్, తోకల సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

## మేడే పోస్టర్ విడుదల

**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ జిల్లా బాలసముద్రంలోని ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో మేడే వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి హనుమకొండ జిల్లా అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శి వేల్పుల సారంగపాణి, జక్క రాజ్ గౌడ్ మాట్లాడుతూ మే 1న అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మికుల హక్కులు వారి సమస్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అమెరికాలో 1886లో మే 1న సమ్మె చేయాలని ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య సోషలిస్టు కార్మిక సంఘాలు సమ్మె చేపట్టి మే మార్కెట్లో భారీ ప్రదర్శనతో 8 గంటల పనికై కదం తొక్కారన్నారు. మేడే ను హనుమకొండ జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో, అన్ని గ్రామీణ కేంద్రాలలో నిర్వహించి ఎర్రజెండాను ఎగరవేసి ప్రపంచ కార్మికుల పోరాట దినంగా జరుపుకోవాలని, దానికి కార్మికులందరూ ఒకటై జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి హనుమకొండ జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి ,ప్రధాన కార్యదర్శి జక్కు రాజ్ గౌడ్, సిపిఐ నాయకులు మద్దెల ఎల్లేష్ , మున్సిపల్ వర్కర్స్ యూనియన్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏల్పుల ధర్మరాజు , సహాయ కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా, ఉపాధ్యక్షులు లంక దాసరి అశోక్, ఉపాధ్యక్షులు మాలోతి శంకర్ నాయక్ , సహాయ కార్యదర్శిలు బత్తిని సదానందం, గుంటి రాజేందర్, ఏలియా, ఎల్ల స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## స్టడీ మెటీరియల్ అందజేత



**ప్రజాపక్షం/రామడుగు :** ఒలంపియాడ్ ఫౌండేషన్ కోచింగ్‌లో భాగంగా మండలంలోని వెదిరలో అల్ఫోర్స్ హై స్కూల్‌లో గురువారం ప్రభుత్వ పాఠశాలలో 8వ, 9వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పుస్తకాలను అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా.వి.నరేందర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 21 రోజుల పాటు ఉచిత భోజన వసతితో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే చక్కటి ప్రణాళికలతో కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలుపుతూ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి రోజు ఉదయం వ్యాయామం, యోగా, సాయంత్రం డ్యాన్స్ ఇతర కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, డిఇఒ జనార్ధనరావులకు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

## భూ భారతితో రైతులకు మేలు



**ప్రజాపక్షం/ముత్తారం:** భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్ఓఆర్ భూ భారతి చట్టం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం ముత్తారం మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం భూ సమస్యల పరిష్కారానికి కీలకమైందని, భూ భారతి చట్టం ద్వారా పక్కగా భూ సరిహద్దులు నిర్ణయిస్తారని, రైతులకు, భూహక్కుదారులకు ఉచిత న్యాయ సాయం అందుబాటులో ఉంటుందన్నారు. పెండింగ్ సాదా బైనామాల పరిష్కారం కోసం భూభారతి చట్టంలో ప్రభుత్వం అవ కాశం కల్పించిందన్నారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్,తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, రైతులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను ఈనెల 25, 28 తేదీలలో పరిశీలన చేయనున్నట్లు పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ తెలిపారు. దరఖాస్తు సమయంలో వారు సూచించిన బ్యాంకుల వారిగా ఆయా బ్యాంక్ శాఖలకు సంబంధించిన అధికారులు దరఖాస్తులను పరిశీలించనున్నట్లు తెలిపారు. 25 శుక్రవారం ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, తెలంగాణ గ్రామీణ బ్యాంక్,బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐసిఐసిఐ, హెచ్‌డిఎఫ్‌సి యాక్సిస్, కెడిసిసి బ్యాంక్‌ల కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ లిమిటెడ్ బ్యాంకులకు చెందిన దరఖాస్తులను పరిశీలించనున్నారు. దరఖాస్తు పరిశీలనకు వచ్చేవారు ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఆధార్, పాన్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్, కుల ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రంతో సకాలంలో దరఖాస్తుల పరిశీలనకు హాజరుకావాలన్నారు.

## 24గంటల్లో రైస్ మిల్లులకు ధాన్యం తరలింపు

కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే చెల్లింపులు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి:** యాసంగి పంటలో కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్య మైన ధాన్యాన్ని కొనుగోలు చేసి 24 గంటల్లో రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులకు సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఓదెలమండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా నాణ్యమైన ధాన్యం కొనుగోలు ప్రక్రియ జిల్లాలో జరగాలన్నారు. ధాన్యానికి వెంటనే చెల్లింపులు పూర్తి చేయాలన్నారు.అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్,జనరల్ వార్డు, వ్యాక్సిన్ విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ వైద్య అధికారులకు సూచించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట పిహెచ్.సి డాక్టర్.షానవాజ్‌ఖాన్, సంబంధిత అధికారులు,పాల్గొన్నారు.

## రోడ్డెక్కిన రైతులు



**ప్రజాపక్షం / చందుర్తి :** ధాన్యం కొనుగోలులో జా ప్యాన్ని నిరసిస్తూ మండల కేంద్రం లో రైతులు గురువారం వేములవాడ కోరు ట్ల ప్రధాన రహదారిపై బై ఠాయించి నిరసన తెలిపారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట అమ్ముకోవడానికి రోడుక్కే దుస్థితి నెలకొందని రైతులు ఆవేదన చెందారు.ప్రభుత్వాలు మారినా రైతుల పరిస్థితి మాత్రం మారడం లేదని,రైతుని రాజుగా చేస్తామని చేప్పే నాయకులు ధాన్యం కొనుగోళ్ళు సజావుగా సాగేలా చూడ డం లేదని ఆరోపించారు.రైతులకు మద్దతుగా పలువురు నాయకులు రోడ్డుపై బైఠాయించారు.ధాన్యం కొనుగోళ్ళు వేగవంతం చేయాలని కోరు తూ స్థానిక తహసీల్దార్‌కి వినతి పత్రం అందజేశారు.

## వరి కుప్పలు దగ్ధం



**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామ శివారు లోని దుబ్బల్ల మానేరు వాగు ప్రాంతంలో సాయంత్రం ప్రమాదవశాత్తు నిప్పు అంటు కొని జరిగిన అగ్ని ప్రమాదంలో ఎట్టం శ్రీనివాస్‌రావు, సంపత్‌రావు, తోపాటు మరికొం త మంది రైతులకు చెందిన మగ వరి వడ్ల కుప్పలు దగ్ధమయ్యాయి. రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఓడేడు గ్రామానికి చెందిన కొంతమంది రైతులు గత కొద్ది రోజుల క్రితమే చేతికొచ్చిన పంటను కోసి ఒకచోట వరిని కుప్పగా పెట్టారు. గురువారం సాయంత్రం ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదానికి వరికుప్పలకు నిప్పంటుకొని వరికుప్పలు పూర్తిగా కాలిపోయాయి. కాగా మంటలను ఆర్పేందుకు వచ్చిన ఫైర్ ఇంజన్ పంట పొలాల నుండి ఘటన స్థలానికి రోడ్డు లేక పోవడంతో మరింత ప్రమాదం జరిగింది. చేతికొచ్చిన పంట కాలిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

# భూ సమస్యల పరిష్కారానికే...

ప్రతి ఒక్కరికి భూమి ఒక వరం

కోర్టుల చుట్టూ తిరిగే పని ఉండదు

మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హుస్నాబాద్:** తెలంగాణలో నూతన భూ భారతి చట్టం తో భూ సమస్యల పరిష్కార మవుతుందని ఇక నుండి ఏ రైతు కోర్టుల చుట్టు తిరగవసరం లేదని తెలంగాణ బిసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. గురువారం పోతారం ఎస్ గ్రామంలో శుభం గార్డెన్‌లో నూతన భూ భారతి చట్టంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్అబ్దుల్ హమీద్‌లు భూభారతి చట్టంపై రైతులకు అవగాన కల్పించారు. అనంతరం భూ సమస్యల పరిష్కారానికి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన భూభారతి చట్టంపై ప్రతి మండలంలో అవగాహన సదస్సు కార్యక్రమాలను నిర్వహించి వారి సమస్యలకు సరైన సమాధా నాల ను ఇస్తున్నట్లు అయన తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేదం లింగంమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ చందు, సహకార సంఘం చైర్మన్ బొల్లి శెట్టి శివయ్య, ఆర్‌డిఒ రామూర్తి, తహసీ ల్దార్ గుజ్జుల రవిందర్‌రెడి, అర్‌టిఎ మెంబర్ సూర్య వర్మ, అధికారుల స్థానిక ప్రజా ప్రతినిధుల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## వర్షపు నీటి సంరక్షణకు ప్రణాళిక

అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి వర్ష పు నీటి చుక్కను ఒడిసిపట్టేందుకు ప్రణాళిక రూపొందించాలని అడిషనల్ కలెక్టర్ ప్రఫు ల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో గురువారం వర్షపు నీటి సేకరణ, సంరక్షణ చర్యలపై మున్సిపల్, ఇరిగేషన్ తదితర అధికారులతో సమావేశం నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే వర్షాకాలంలో ప్రతి నీటి చుక్కను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోతున్న తరుణంలో రాబోయే వర్షాకాలంలో వర్షపునీటి సేకరణ, సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు అధికారులందరూ సమన్వయంతో ఇక ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. చెరువులు, కుంటల్లో పేరుకుపోయిన పూడిక తొలగింపు విషయంలో సాద్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు. సమావేశంలో మున్సి పల్ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్, మున్సిపల్ కమిషనర్లు, భూగర్భజలశాఖ, నీటిపా రుదల, పంచాయతీరాజ్, తదితర శాఖల అధికారులున్నారు.

# ఆధార్ తరహాలో 'భూధార్'

ప్రతి యేటా భూ రికార్డుల ఆధునీకరణ

భూభారతి చట్టంతో భూసమస్యలు పరిష్కారం

అవగాహన సదస్సులో కలెక్టర్ పమేలా సత్పతి




**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భా రతి చట్టంతో గడువులోగా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ పమేలా సత్ప తి పేర్కొన్నారు. గురువారం మానకొండూర్‌లోని కెఎస్ఆర్ ఫంక్షన్‌హాల్, శంకరపట్నం లోని వెంకటేశ్వర ఫంక్షన్ హాలులో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులు నిర్వ హించారు. ఈ సదస్సులకు కలెక్టర్ హాజరై చట్టంతో కలిగే ప్రయోజనాలు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మండలంలో భూభారతి చట్టంపై అవగాహన సద స్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నూతన చట్టంలో తప్పుల సవరణకు అవకా శం ఉంటుందని, పేదలకు ఉచిత న్యాయ సేవలు సైతం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మనకు ఆధార్ తరహాలో భూకమతాలకు భూదార్ సంఖ్య కేటాయించనున్నట్లు వివరించారు. దీంతో భూఆక్రమణలకు అడ్డుకట్ట పడుతుందన్నారు. ఎవరైనా మోసపూరితంగా ప్రభు త్వ భూములు, దేవాదాయశాఖ, ఆబాదిభూములు, అసైన్డ్ భూములు పొందితే విచారి ంచి వాటిని రద్దు చేసే అధికారం అధికారులకు ఉంటుందని స్పష్టం చేశారు. తమ భూ సమస్యలు పరిష్కరించాలని అప్పీలు చేసుకున్న రైతులకు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి తమ భూములపై పూర్తిహక్కులు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎంపిడిఒలు, నాయకులు, వివిధ గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యాలతో ముందుకు...

జిల్లా ఎస్‌పి అశోక్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాలప్రతినిధి :** మాదకద్రవ్యాల వినియోగం సమాజాన్ని హింస, అనా రోగ్యం, నైతిక విలువల పతనం వంటి అనేక దుష్ప్రభావాల వైపు నడిపిస్తోందని జిల్లా ఎస్‌పి అశోక్ కుమార్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల వినియోగం వల న కలిగే పరిణామాలపై అవగాహన చేయడంతో పాటు వినియోగించడం వల్ల కలిగే నష్టల పై యువతకు, పాఠశాల, కళాశాల విద్యార్థులకు దిశా నిర్దేశం చేసే కార్యక్రమం లో భాగంగా గురువారం పొలస వ్యవసాయ కళాశాలలో జిల్లా పోలీసుశాఖ , ఇం డియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలోమాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్‌పి అశోక్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎస్‌పి మాట్లాడుతూ సమాజం నుంచి యువత మంచిని మాత్రమే నేర్చుకోవాలని చెడు వ్యసనాలు, అలవాట్లపై, ఆకర్షితులై జీవితాలు నాశనం చేసుకోకూడదని విద్యార్థి దశ నుండే మంచి ఆలోచనలు ఉన్నత స్థాయిలో యు వత ఉండాలన్నారు. డ్రగ్స్, మత్తు పదార్థాలు, గంజాయి గురించి సమా చారం తెలిస్తే స్థానిక పోలీసులకు గాని, డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.వ్యవసాయ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సైదా నాయ క్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ కార్యదర్శి మంచాల కృష్ణ, సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్, కార్యక్రమ కోఆర్డినేటర్, కళాశాల ఎన్ఎస్ఎస్ లెఫ్టినెంట్ అధికారి, డి అడిక్ట్ ట్రైనర్ పర్ల పల్లి రాజు, సిసిఎస్‌సి.ఐ శ్రీనివాస్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# వేగంగా ధాన్యం కొనుగోళ్లు



కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

* నాణ్యమైన ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేయాలి
* అధికారులకు ఆదేశాలు జారీ

**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్లప్రతినిధి :** యాసంగి పంట కొనుగోలులో వేగం పెంచాలని కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన వరి ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం జరగాలని, కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే చెల్లింపులు పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 246కొనుగోలు కేంద్రాలకు గాను 244 కేంద్రాల ప్రారంభం చేసి 224 కొనుగోలు కేంద్రాల నుండి 28వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు జమ అయ్యేలా చూడాలని అన్నారు. సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్‌లు సిరిసిల్లలో అపెరల్ పార్కులో, ఇతర చోట్ల అవసరమైన ఇంటర్మీడియట్ గోదాములను గు ర్తించి ధాన్యం తరలింపు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కొనుగోలు కేంద్రాలలో నాణ్యత ప్రమాణాలు పరిశీ లించి, భారత ఆహా ర సంస్థ నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో డిఆర్‌డివో శేషాద్రి, డిఎం పౌర సరఫరాల శాఖ రజిత, అదనపు డిఆర్‌డివో శ్రీనివాస్, ఏపిఎం తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమమే

పెద్దపెల్లి జిల్లా టిఎఎన్‌జిఐ జిల్లా అధ్యక్షులు బొంకూరు సురేందర్




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే మరో ఉద్యమం చేపడతామని పెద్దపెల్లి జిల్లా టిఎఎన్‌జిఐ జిల్లా అధ్యక్షులు బొంకూరు సురేందర్ అన్నారు. గురువారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సమావేశ మందిరంలో రాష్ట్ర ఎంప్లాయిస్ జెఎసి ఇచ్చిన పిలుపుమేరకు తెలంగా ణ ఎంప్లాయిస్‌జెఎసి పెద్దపెల్లి జిల్లా ఆధ్వర్యంలో ఎంప్లాయిస్ జెఎసి కార్యవర్గ సమావేశం జరిగింది ఈ సమావేశంలో జెఎసి చైర్మన్ బొంకూరి శంకర్ మాట్లాడుతూ ఉద్యోగులందరూ కష్టపడి పని చేస్తూ ఈ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకుపోయి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావటానికి కష్టపడి పని చేస్తున్నారని, ఇలాంటి సంద ర్భంలో ఉద్యోగులకు సంబంధించిన చాలా సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.ఆ సమస్యలు పరిష్కరించకపోవడం ఉద్యోగుల్లో ఆత్మవిశ్వాసం దెబ్బతింటున్నది రాబో యే రోజుల్లో ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేయకుంటే ఉద్యమం తప్పదని వారు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని, ఉద్యోగులకు రావలసిన ఐదు డిఎలను వెంటనే చెల్లించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా కాంట్రి బ్యూటర్ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పిఆర్‌సిని 51% కూడిన ఫిట్మెంట్‌ను ప్రకటిస్తూ అమలు చేయాలని, ఎంప్లాయిస్‌కు సంబంధించిన ఇహెచ్ఎస్ అమలు చేస్తూ ఉద్యోగులకు మెరుగైన వైద్య సదుపాయం అందించాలన్నారు. కాం ట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమా ండ్ చేశారు. ఈ సమావేశంలో అన్ని సంఘాల బాధ్యులు పాల్గొన్నారు టిఎన్‌జిఒఎస్ కార్యదర్శి సత్యనారాయణ టిజిఒ కార్య దర్శి బ్రహ్మానందరెడ్డి, పి.కిషన్ పిఆర్టియు, గండు కృష్ణమూర్తి, మెరుగు సతీష్,కే లక్ష్మ ణ్, కే.సారయ్య, బి.పరశు రా ముడు, ఎస్ కొమురయ్య, ఎస్ కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కల్పనే లక్ష్యంగా 'రాజీవ్ యువ వికాసం'

ఈ పథకం ఎంపిక వెంటనే ప్రారంభించాలి

* జిల్లా నుండి 60వేల దరఖాస్తులు

జిల్లా కలెక్టర్ మనుచౌదరి



**ప్రజాపక్షం/సిద్దిపేటప్రతినిధి :** రాజీవ్ యువ వికాసం ఎంపిక ప్రక్రియ ప్రారంభించా లని జిల్లా కలెక్టర్ మనుచౌదరి సంబంధిత అధికారులను, బ్యాంకర్లను ఆదేశించారు. గురు వారం కలెక్టరేట్‌లో మినీ సమావేశ మందిరంలో సంబధిత శాఖల జిల్లా అధికా రులు, బ్యాంకర్లు రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై జిల్లా కలెక్టర్ మను చౌదరి సమావేశం నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ స్వయం ఉపాధి కల్పన లక్ష్యంగా ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం తీసుకొచ్చిందన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం స్వయం ఉపాధి కోసం ఎస్‌సి, ఎస్‌టి,బిసి మైనార్టీ శాఖల ద్వారా దాదాపు 60 వేల మంది దరఖాస్తు చేసుకన్నారని, ప్రభుత్వ నిబంధనల మేరకు వారిలో నుండి జిల్లా ఇచ్చిన టార్గెట్ ప్రకారం శాఖల వారీగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వెంటనే ప్రారంభించాలన్నారు. శుక్రవారం మండల స్థాయిలో, ఎంపిడిఒలు బ్యాం కర్లు సమావేశం నిర్వహించి ఎస్‌సి, ఎస్‌టి,బిసి మైనార్టీల శాఖ ల బ్యాంకర్ల వారీగా దరఖాస్తుల స్క్రూటీని నిర్వహించాలన్నా రు. ఈ కార్యక్రమంలో ఎల్డిఎం హరిబాబు, డిఆర్‌డిఓ జైదేవ్‌ఆర్య, ఎస్‌సి, ఎస్‌టి,బిసి మైనార్టీ, సంక్షేమ, సెట్విన్ పరిశ్రమ శాఖల అధికారులు, బ్యాంకర్లు,నాబార్డు, ఎజిఎం పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఎమ్మెల్యే విజయరమణారావు



**ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్:** రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకో వాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. గురువారం పెద్దపల్లి మం డలం రాఘవాపూర్, సబ్బితం, రంగాపూర్, అందుగులపల్లి గ్రామాల్లో సిం గిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నా యకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలలోకి ధాన్యం తీసుకువచ్చి తమ తమ సీరియల్ నంబర్ పొంది రైతు లు నిరంధిగా ఉండవచ్చని, రైతు పంట తూకం అయిన 48 గంటల్లోనే వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని ఎమ్మె ల్యే తెలిపారు. ఈ సారి కూడా సన్న వడ్లకు బోనస్ అం దిస్తామని చెప్పారు. గత సీజన్లో సన్న వడ్ల బోనస్ రాష్ట్ర మొత్తం మీద ప్రభుత్వం రైతులకు 1234 కోట్లులు అందించగా, అందులో ఒక్క పెద్దపల్లి నియోజకవర్గంలోనే అత్యధికంగా 59 కోట్ల 65 లక్షల రూపాయల బోనస్ ను రైతులు పొందారని చెప్పారు. త్వరలోనే అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్, డైరెక్టర్లు, మాజీ సర్పంచ్ లు, ఎంపిటిసిలు, రైతులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# వేగవంతంగా జాతీయ రహదారి నిర్మాణ పనులు : జిల్లా కలెక్టర్



**ప్రజాపక్షం/ముత్తారం:** వరంగల్ మంచిర్యాల జాతీయ రహదారి నిర్మా ణ పనులను సకాలంలో చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధి కారులకు సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్ ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామంలో జరుగుతున్న జాతీయ రహదారి సి.ఎన్.జి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మంథని రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో జాతీయ రహదారి నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. వరంగల్ మంచిర్యాల మధ్య 4 వరుసల గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మా ణం పనులు సకాలంలో చేపట్టి పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారికి సంబంధించి భూసేకరణ పనులు పూర్తి చేశామని, పెండింగ్ చెలింపులు ఎక్కడైనా ఉంటే వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశిం చారు. అనంతరం మంథనిలో నూతనంగా 50 పడకల ఆసుపత్రి నిర్మించేందుకు ఎంపిక చేసిన స్థలంలో ఉన్న పాత డిఇ ఇరిగేషన్ కా ర్యాలయం, ఇతర కార్యాలయాలు, అనువైన చోటికి తరలించే పనులను కలెక్టర్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట మంథని రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగాలే లక్ష్యంగా ముందుకు సాగాలి

వాగేశ్వరి కళాశాల చైర్మన్ బివిఆర్ గోపాల్ రెడ్డి

ఘనంగా వాగేశ్వరి 'అషేర్' వార్షికోత్సవ వేడుకలు





**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి:** కరీంనగర్ నగర శివారులోఎస్‌విఆర్ గార్డెన్స్ వేదికగా వాగేశ్వరి డిగ్రీ అండ్‌పిజి కళాశాల వార్షికోత్సవం "అషేర్" పేరుతో అత్యంత ఘనగా నిర్వహించారు. విద్య, సాంస్కృతిక సమ్మేళనంగా సాగిన ఈ వేడుకకు కళాశాల కరెస్పాండెంట్, చైర్మన్ బి.వి.ఆర్ గోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విధ్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితమవకుం డా స్వీయ అభివృద్ధి, వ్యక్తిత్వ వికాసం, సామాజిక మానవీయత పట్ల చైతన్యం కలిగి ఉండాలని సూ చించారు. ప్రతి ఒక్కరు కచ్చితంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగాలను సాధించే సత్తా కలిగి ఉండి ఇతరులకు ఉద్యోగాలు కల్పించే స్థా యికి ఎదగాలని కోరారు. విద్యార్థులు విద్యతో పా టు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలని సూచించారు. విద్యార్థు ల క్రమ శిక్షణ, సమయపాలన, సమాజంలో సేవా దృక్ప దం ఎంతో కీలకమని వివరించారు. నేటి విధ్యార్థులే రేపటి నాయకులు కావడంతో సాంఘి భాధ్యతలు, లక్ష్య స్పష్టత, క్రమశిక్షణ అవసరమని అన్నారు. విద్యాస్థాయికి మించిన విలువలు, వ్యక్తి త్వ నిర్మాణం, నాయకత్వ లక్షణాలు విధ్యార్థుల్లో అభివృద్ధి చెందాలని, అప్పుడు మాత్రమే నిజమైన విజయాన్ని పొందిన వారవుతారన్నారు. ఈ సంధర్భంగా కళాశాల విధ్యార్థులు నృత్యాలు, సంగీత, సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. అనంతరం విధ్యార్థులకు చైర్మన్ నేతృత్వంలో ప్రత్యేక ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ సతీష్ గౌడ్, లింగమూర్తి, వెంకట్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్స్ చెన్నమల్ల చైతన్య, రమణ, ప్రసాద్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నిజాముద్దీన్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# స్థానికం

REGIONAL NEWS



కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## ధాన్యాన్ని దళారులకు అమ్మొద్దు



**ప్రజాపక్షం/కొల్చారం:** మండలం లోని కిష్టాపూర్ గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నడుపుతున్న కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ నాగుల గారి మల్లేశంగౌడ్ ప్రారంభించారు. సందర్భంగా మాట్లాడుతూ, రైతులు కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తరలించి సద్విని చేసుకొవాలన్నారు.దళారీల మాటలకు మోసపోయి బయట వ్యక్తులకు విక్రయించి మోసపోవద్దన్నారు.సీఈఓ నవీన్ కుమార్, వైస్ చైర్మన్ తంగెళ్ల ప్రభాకర్, డైరెక్టర్లు శేరిపల్లి శేకులు, చిట్యాల పోచయ్య, ప్రమీల, అందుగులపల్లి శ్రీరాములు, రైతులు పెద్ద గొల్ల మల్లేశం, కర్రే పోచయ్య, కాశమ రాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దుల కిషన్, అటెండర్ యాదగిరిపాల్గొన్నారు.



## నిర్మల్‌లోనే నాణ్యమైన విద్య

### ఆల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :** హైదరాబాద్ కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా నిర్మల్ లోనే ఆల్ఫోర్స్ విద్యా సంస్థ నాణ్యమైన విద్యను అందిస్తుందని విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి,అన్నారు.ఇంటర్మీడియట్ లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు గురువారం జిల్లా కేంద్రంలోని అర్ఫోర్స్ బాలికల జూనియర్ కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తమ కళాశాలను నమ్మి తల్లిదండ్రులు మెరిట్ స్టూడెంట్ లను అప్పజెప్పినందుకు ముందుగా ధన్యవాదాలు తెలిపారు.ఆల్ఫోర్స్‌లో విద్యతో పాటు విలువలను అందిస్మామన్నారు.మును ముందు హైదరాబాద్ కళాశాలలకు దీటుగా అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.భవిష్యత్తులో మరెన్నో మంచి ర్యాంకులు సాధించి,ఉన్నతమైన శిఖరాలకు ఈ విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు.

**టాపర్స్ గా నిలిచిన విద్యార్థులు...**

ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ బాలికల విభాగంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా టాపర్స్‌గా నర్వాడే కృష్ణవేణి 468/470,జోషి ప్రసూన శ్రీ 468/470,పడిగెల కీర్తిశ్రీ కి 468/470,బాలుర విభాగంలో బోనాల శ్రీ చరణ్ 467/470,వడకపూర్ అఖిల్ 467/470,కార్తికేయన్ 467/470 మార్కులు సాధించారు.బైపీసీ విభాగంలో సామ ఫిర్దోస్ 438/440,జోహా మహవీష్ 438/440 మార్కులు సాధించారు.సెకండ్ ఇయర్ లో ఎంపీసీ,బైపీసీ విభాగాలలో కవల్ ప్రీత్ కౌర్ 995/1000 కి,సుమయ కణం 994/1000,జాదవ్ నవ్వ శ్రీ 993/1000 మార్కులు సాధించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా టపర్లుగా నిలిచారు.కళాశాల ప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు,విద్యార్థులు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## 26న తిర్యాణిలో భూభారతిపై సదస్సు

**ప్రజాపక్షం/తిర్యాణి :** తిర్యాణి మండల కేంద్రంలోని స్థానిక ఆశ్రమ పాఠశాలలో కొత్త రెవెన్యూ చట్టం భూభారతి పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తిర్యాణి తహసీల్దార్ సూర్యప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), ఆర్‌డిఒలు హాజరుకానున్నారని ఆయన పేర్కొన్నారు. మండలంలోని రైతులు, గ్రామ పటేళ్లు, ప్రజా ప్రతినిధులు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## కార్మికులకు ఓఆర్ఎస్ పంపిణీ



**ప్రజాపక్షం/మందమర్రి :** కోల్‌బెల్ట్ ప్రాంతమైన మందమర్రిలో పెరుగుతున్న అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టారు. మున్సిపల్ కమీషనర్ రాజలింగు ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణి చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పారిశుధ్య కార్మికుల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఎప్పటికప్పుడు ఓఆర్ఎస్ ప్యాకెట్లను నీటిలో కలుపుకుని తాగాలని ఆయన అవగాహన కల్పించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వి. శ్యాంసుందర్, డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ బి శ్యాంబాబు, సిస్టం మేనేజర్, ఎ. శిరీష్, మెడికల్ హెల్త్ అసిస్టెంట్ బి. మధుసూదన్, మున్సిపల్ సిబ్బంది, పాల్గొన్నారు. మున్సిపల్ శాఖ తీసుకున్న ఈ చర్యలకు పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## కారుణ్య నియామక పత్రం అందజేత



**ప్రజాపక్షం/మందమర్రి :** మందమర్రి ఏరియాలో జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మెడికల్ ఇన్వాలిడేషన్ కింద అర్హత సాధించిన ఒక డిసెండెంట్‌కు మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జి. దేవేందర్ కారుణ్య నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ మందమర్రి ఏరియాలో ఇప్పటి వరకు కారుణ్య నియామకాల ద్వారా 1973 మందికి ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇతర పరిశ్రమలతో పోలిస్తే సింగరేణిలో పని ప్రదేశాలు, పని వేళలు భిన్నంగా ఉంటాయని ఆయన గుర్తు చేశారు. విధులకు గైర్హాజరు అయితే ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని కాబట్టి కష్టపడి పని చేసి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆయన ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్, ఏఐటియూసి జిఎం స్ట్రక్చర్ కమిటి మెంబర్ సివి. రమణ, అధికారుల సంఘం అధ్యక్షులు కె. రవి పాల్గొన్నారు.

## కార్మిక నాయకుడు సంజయ్‌కు నివాళి



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** భారత విప్లవోద్యమ నాయకుడు,కార్మిక వర్గ అగ్ర నాయకుడు,టి.యు.సి.ఐ అల్ఇండియా ప్రధాన కా ర్యదర్శి సంజయ్ సింఘ్వి ఈ రాత్రి అమరత్వం పొందారు.నిర్మల్ భగత్ సింగ్ భవన్ (టి.యు.సి.ఐ)కార్యాలయం నందు సంజయ్ సింఘ్వి చిత్రపటానికి నివాళులర్పించారు. రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న మాట్లాడుతూ సం జయ్ సింఘ్వి సేవలు అపూర్వమన్నారు.కార్మిక ఉద్యమంలో,విప్లవోద్యమంలో ఆయన చేసిన కృషికి,క్యాన్సర్ తో బాధపడుతూ దేశంలోని కార్మిక సంఘాలన్నిటిని ఒక్కతాటిపైకి తెచ్చే సంకల్పంతో చేసిన కృషికీ,జీవితాన్ని విప్లవధ్యమానికి అర్పించిన సంజయ్ సింఘ్వికి విప్లవజోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో టి.యు.సి.ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.బక్కన్న జిల్లా కార్యదర్శి ఆర్.రామ లక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న పి.ఓ.డబ్ల్యు, జిల్లా ప్రధాన కార్యదర్శి కే.లక్మి,గంగామణి, లక్ష్మి , కమల, విజయ, కవిత, తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తికి ‘ఆదార్’... భూమికి ‘భూదార్’

### సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు



**ప్రజాపక్షం/సంగారెడ్డిప్రతినిధి:** నిర్ణీత గడువు లోపు భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు. నారాయణఖేడ నియోజకవర్గంలోని నాగలిగిద్ద, మనూరు, సిర్గాపూర్ మండల కేంద్రాలలో భూ భారతి చట్టంపై గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడారు. నారాయణ ఖేడ్ శాసనసభ్యులు సంజీవరెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు గ్రామాలకు వచ్చి అర్జీలు స్వీకరిస్తారన్నారు. తప్పులను సవరిస్తారని ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు. అప్పీలు చేసుకున్న సన్న ,చిన్న కారు, పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తారన్నారు. భవిష్యత్తులో ఏలాంటి వివాదాలకు అ స్కారం లేకుండా పట్టా పాస్ బుక్కులతో సమగ్ర వివరాలతోహద్దులనుపేర్కొంటూభూమి పట్టం (మ్యాప్) పొందుపరుస్తారని తెలిపారు. రిజిస్ట్రేషన్ ,మ్యూటేషన్, చేయడానికి ముందు సర్వే మ్యాప్ రూపొందించి పట్టాపాస్ బుక్కు జత పరుస్తారన్నారు. ఆదార్ తరహాలోనే భూముల వివరాలతో కూడిన భూదార్ నెంబర్ కేటాయిస్తారని తెలిపారు. ధరణిలో కొన్ని భూ సమస్యల పరిష్కారానికి అవకాశం ఉండేది కాదని అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టులనుఆశ్రయించాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ప్రస్తుతం తహసీల్దార్, ఆర్డీఓ లకు దరఖాస్తులు చేసుకుని సమస్యలు పరిష్కరించుకునేలా భూ భారతి వెసులుబాటు కల్పిస్తుందన్నారు.భూ సమస్యలు ఉంటే గ్రామ సభలలో అధికారులకు అర్జీలుఅందించిపరిష్కరించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ భూ భారతి చట్టంతో అసైన్మెంట్ కమిటీలు పునరుద్దరణ చేశారని, నారాయణఖేడ్ నియోజకవర్గంలో 32 కోట్ల రూపాయలు ఋణమాఫీ జరిగిందని తెలిపారు. నారాయణఖేడ్‌ప్రాంతానికి వైద్య ,విద్య వ్యవస్థ చాలా బలోపేతం అయిందన్నారు.అదనపు కలెక్టర్ మాధురి జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఆర్డీఓ అశోక్ చక్రవర్తి తహసీల్దార్ విష్ణు, సాగర్, రెవెన్యూ అధికారులు రైతులు , తదితరులు పాల్గొన్నారు.

## చెక్ బౌన్స్ కేసులను.. రాజీ పద్ధతుల్లో పరిష్కరించుకోవాలి

### నిర్మల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** చెక్ బౌన్స్ కేసులను రాజీ పద్ధతుల్లో పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి అన్నారు.గురువారం జిల్లా ప్రధాన న్యాయముర్తి బ్యాంకు అధికారులతో చెక్ బౌన్స్ కేసుల పరిష్కారం పై సమేవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని బ్యాంకులు, చిట్ ఫండ్స్‌లలో నమోదై, పెండింగ్ లోఉన్న చెక్ బౌన్స్ కేసులను పరస్పరం రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు. ఎప్పటికీ రాజీమార్గమే శ్రేయస్కరమన్నారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్,జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర రామ్ గోపాల్, బ్యాంకు అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్‌కు కార్మికుల ఉసురు ఖాయం

### తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.ఆర్.రెడ్డి

**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్ :** కెసిఆర్ అధికారంలో ఉండగా పది సం!!రాలు ఆర్టీసీ కార్మికుల శ్రమను దోచుకొని పనిబారంతో ఆర్టీసీ కార్మికుల ఆత్మ అత్యాలకు గురిచేసి యూనియన్ నాయకులకు నోరెత్తకుండా చేసిన గులాబీ పార్టీ టి.ఆర్.ఎస్ పార్టీని క్షమించే ప్రసక్తే లేదని అని ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏ.ఆర్.రెడ్డి తెలిపారు.ఆయన మాట్లాడుతూ..గతంలో సమ్మెల చేస్తేఉద్యోగాలు పోతాయని బెదిరించి 33 మం ది కార్మికులఆత్మహత్యలకు కారకుడయ్యాడని 2017, 2021 ఈ రెండు పి.ఆర్.సి.లు గత ప్రభుత్వమే ఇవ్వాలి,అదిఇవ్వలేకమొసలికన్నీరు కారుస్తూ చలోవరంగల్‌కురావాలనిమబ్యపెడుతూ తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు.అప్పుడే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసాము గవర్నర్ సహకరించడం లేదని కార్మికులను రెచ్చగోట్టి రాజభవన్ ను ముట్టడించే టట్టు చేసింది.టి.ఆర్.ఎస్ ప్రభుత్వమే అని తెలియచేసారు.విలీనం చేసినవాడు ఆపైంటెంట్ డే.ఎందుకు ప్రకటించలేదని ఎద్దేవ చేశారు. కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావు, కవిత.. ఈ నలుగురుఆర్టీసీ కార్మిక ద్రోహులేనన్నారు. టి.ఎం.యురాష్ట్ర ప్రధానకార్యదర్శి థామస్ రెడ్డి టి.ఆర్ ఎస్ సభకు రావాలని తప్పుడు ప్రకటన ఇప్పించారని, ఆ ప్రకటన ఆయన చేయలేదని, ఈ ప్రకటన నమ్మవద్దని, ఆ సభకు వెళ్ళవద్దని ఏ.ఆర్. రెడ్డి ప్రకటించారు. అందరూ గమనించాలన్నారు. ఆర్టీసీ కార్మికులు వదంతులు నమ్మవద్దని మే 7 న తలపెట్టిన సమ్మెకు యూనియన్లకు అతీతంగా సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## ధరణి కంటే మెరుగైనది భూభారతి

### మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/వెల్దుర్తి:** ధరణికంటే మెరుగైనది భూ భారతి చట్టమని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజుఅన్నారు. మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో కొత్త ఆర్ఓఆర్ చట్టం భూ భారతి 2025పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం మీ అందరికీ అనుకూలంగా ఉండే భూ భారతి తీసుకొచ్చింది.భూమి అంటేనే ఆత్మగౌరవం అలా ంటి భూమి వివాదాల్లో ఉండడం తదితర అంశాల పరిష్కారానికి ఈ చట్టం ఉపయోగపడుతుందన్నారు. మ్యుటేషన్, రిజిస్ట్రేషన్, ఫోర్జరీ, కబ్జా లాంటివి తహశీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలో అయిపోతుందని తెలిపారు. భూ రికార్డుల్లో ఎవరి పేరు ఉంది.. ప్రభుత్వ భూమిగా ఎలా మారింది, అసైన్డ్ భూమిగా ఎలా మారింది అనే దానిపై ఈ చట్టంలో అన్ని రికార్డులు పహాని తదితర కాపీలు తీసుకోవచ్చు అని సుదీర్ఘంగా వివరించారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి భూ భారతి చట్టంపై రైతులకు వినిపించారు సాంస్కృతిక సారధి కళాకారులు భూభారత చట్టంపై కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డిఓ జయచంద్ర రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిన్ రెడ్డి, సహకార సంఘం చైర్మన్ అనంత రెడ్డి, తహాసిల్దార్ కృష్ణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు నరేందర్ రెడ్డి, వ్యవసాయ అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.


## ‘అప్పీలు’తో భూ సమస్యలు పరిష్కారం

### ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టంతో రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం కెరమెరిమండలం కేస్లాగూడ రైతు వేదికలో భూభారతి నూతన ఆర్ఒఆర్ చట్టంపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లాఅదనపు కలెక్టర్ డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావులతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ భూమి అనేది రైతు జీవితానికి అతిపెద్ద ఆధారమని, ముఖ్యంగా భూ భారతి చట్టంలోని అప్పీలు వ్యవస్థ చాలా కీలకమైందన్నారు. రైతుకు అన్యాయం జరిగితే అప్పీల్ చేసుకోవడం ద్వారా న్యాయం పొందవచ్చని, రాజస్వ మండల అధికారి, జిల్లా కలెక్టర్, సిసిఎల్ఎ స్థాయిలలో అప్పీలు చేసుకునే అవకాశం ఉందని ఆయన వివరించారు. గ్రామాల్లో చాలా వరకు భూమి హద్దుల వివాదాలు ఉంటాయని, అయితే భూభారతి చట్టంతో రీ సర్వే, కొనుగోలు, పాలు పంపకాలు, దాన దస్తావేజులకు సంబంధించిన అంశాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం అర్హులైన గ్రామ పాలన అధికారులు, మండల సర్వేయర్లను నియమిస్తుందని, వారసత్వ మార్పిడికి సంబంధిచంఇన వారసులందరికీ నోటీసులు జారీ చేసే ప్రక్రియ ఉంటుందని, గతంలో ధరణి చట్టంలో ఈ అవకాశం లేదని ఆయన స్పష్టం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ శాసనమండలి సభ్యులు దండే విఠల్ మాట్లాడుతూ ధరణి చట్టంలో భూమి విషయాలలో కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరిగేవని, కానీ ఇప్పుడు అలాంటి సమస్యలు ఉండవని, ప్రతీ రైతుకు న్యాయం జరుగుతుందని అన్నారు. సాదా బైనామాల ద్వారా కొనుగోలు చేసిన భూములకు పరిష్కారం లభిస్తుందని, పార్ట్ బిలో పరిష్కారం లభించని వేలాది ఎకరాల భూములకు పాస్ పుస్తకాలు జారీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి లక్ష్మి నారాయణ, తహసీల్దార్ దత్తు ప్రసాద్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి అంజద్ పాషా, రెవెన్యూ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మూర్ ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు ఆక్షేపణీయం



**ప్రజాపక్షం / ఆర్మూర్ :** ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి నిత్యం ప్రజల కోసం ప్రజా శ్రేయస్సు కోసం మాత్రమే పాటుపడతాడని, అలాంటి వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ నాయకుడు వినయ్ రెడ్డికి, అతని బృందానికి అలవాటుగా మారిందని, ఇకనుండి వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని, రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీచేసినా గెలవని అభ్యర్థి వినయ్ రెడ్డి అని రాకేష్ రెడ్డి కేవలం తన వ్యక్తిత్వంతో మూడునెలల్లో ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర నాయకుడు అయ్యాడని, ఇంటిగ్రేట్ స్కూలు మంజూరు విషయంలో రాకేష్ రెడ్డి చొరవతోనే ఆర్మూర్‌కు మంజూరైందని, సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చెప్పారని అది గుర్తు చేసుకోవాలని ఆర్మూర్ అసెంబ్లీ నియోజకవర్గ బిజెపి కన్వీనర్ పాలెపు రాజు అన్నారు. ఎమ్మెల్యేగా పైడి రాకేష్ రెడ్డి నిత్యం ప్రజలకు నాయకులకు అందుబాటులో ఉంటుండు అని ఆర్మూర్ పట్టణ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే అడిగితే నిధులు ఇచ్చామని స్వయాన మంత్రి లేఖ ద్వారా చెప్పడంతో తెలుస్తోంది, ఎమ్మెల్యే ద్వారా మాత్రమే నిధులు వస్తున్నాయని, ఒక్క అవినీతి చేయలేదు, అవినీతి చేసినట్లయితే నిరూపించాలని, బహిరంగ చర్చకు రావాలని బిజెపి నాయకులు కోరారు. ఆర్మూర్ నియోజకవర్గంలో ప్రస్తుతమున్న కాంగ్రెస్ నాయకులు గతంలో జీవన్‌రెడ్డి దగ్గర ఉన్న నాయకులు మాత్రమే అని, జీవన్‌రెడ్డి, వినయ్ రెడ్డి ఒక్కటే అనడానికి ఇది నిదర్శనమని, వినయ్ రెడ్డి కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలవలేదని, రాజకీయంగా వినయ్ రెడ్డికి భవిష్యత్తు లేదని తన చుట్టు ఉన్న నాయకులు వాపోతున్నారని బిజెపి నాయకులు అన్నారు. సమావేశంలో బిజెపి సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కెకె ఒసిపి ఉద్యోగుల హెచ్ఆర్ఎలో వివక్ష



**ప్రజాపక్షం/ మందమర్రి :** మందమర్రి మున్సిపాలిటి పరిధిలోని కెకె ఒసిపి గనిలో పనిచేస్తున్న క్వార్టర్లు లేని ఉద్యోగులకు మందమర్రి ఏరియాలోని ఇతర గనుల మాదిరిగా 10 శాతం హెచ్ఆర్ఎ చెల్లించడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం కెకె ఓసిపి ఉద్యోగులు మేనేజర్‌కు వినతిప్రతం సమర్పించారు. వారు మాట్లాడుతూ మున్సిపాలిటి పరిధిలో ఉన్న కెకె ఓసిపి గనిలో పనిచేస్తున్నప్పటికి, క్వార్టర్లు పొందనిఉద్యోగులు మందమర్రి ఏరియాలోని ఇతర గనులలో చెల్లిస్తున్న విధంగా10శాతం హెచ్ఆర్ఎఇవ్వడంలేదని,మందమర్రి ఏరియాలో ఎక్సెస్ క్వార్టర్లు ఉన్నాయని చెబుతూ కేవలం కెకె ఓసిపి కార్మికులకు మాత్రమే హెచ్ఆర్ఎ నిరాకరిస్తున్నారని తెలిపారు. మందమర్రి ఏరియాలో కెకె ఓసిపి మినహా మునిసిపాలిటి పరిధిలోని ఇతర గనులు, విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు మాత్రమే ఎక్సెస్ క్వార్టర్లు ఉన్నాయని చూపించి వారికి హెచ్ఆర్ఎ ఇవ్వకపోవడం వివక్షాపూరితంగా ఉందనిఆరోపించారు.ప్రస్తుతం కెకె ఓసిపి కార్యాలయం ఉన్న స్థలంలో గతంలో కెకె 2 గని కార్యాలయం ఉండేదని, ఆ సమయంలో కెకె 2 గనిలో పనిచేసిన ఉద్యోగులకు కూడా 10 శాతం హెచ్ఆర్ఎ చెల్లించారన్నారు. జూన్ 2016లో సైతం కెకె గని 2 ఉద్యోగులకు 10 శాతం హెచ్ఆర్ఎ చెల్లించడం జరిగిందని, మందమర్రి మున్సిపాలిటిలనిఇతర గనులలో చెల్లిస్తున్న విధంగానే తమ కు కూడా 10 శాతం హెచ్ఆర్ఎ చెల్లించేలా చూడాలని ఉద్యోగులు విజ్ఞప్తి చేశారు.

## రామ్‌నారాయణ ఖేడియా సేవలు అపూర్వం



**ప్రజాపక్షం / బాన్సువాడ :** బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూపాయి ఆశించకుండా 12 ఎకరాల స్థలాన్నిదానంచేసి ఈ ప్రాంత విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు శ్రీరామ్ నారాయణ ఖేడియా అని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచా రం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన రజతోత్సవ వేడుకలకు ముందు ఇటీవల కాశ్మీర్లో ఉగ్రవాదుల చేతిలో మృతి చెందిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఎంపి సురేష్ షెట్కార్, విద్యాశాఖ కమిషనర్ దేవసేన, కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్‌తో కలిసి రజతోత్సవ వేడుకలను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ బాన్సువాడలో డిగ్రీ కళాశాల కొరకు ఎంతో కృషి చేశానని, శ్రీరామ్ నారాయణఖేడియా తన 12 ఎకరాల భూమిని విద్యాభివృద్ధికి దానం చేయడంతో, 1998 సంవత్సరంలో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోకళాశాలనుప్రారంభించడం జరిగిందన్నారు. ప్రస్తుతం 25 సంవత్సరాలుగా కళాశాలలో చదువుకున్న 13 వేల మంది పైచిలుకు విద్యార్థులకు 10 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందడం ఎంతో అభినందనీయమన్నారు. రజత్సోతవ పైలాన్‌ను ఆవిష్కరించారు. పోచా రం శ్రీనివాస్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా కలెక్టర్ ఆశిశ్ సంగ్వాన్, ఎస్‌పి రాజేష్ చంద్ర, సబ్ కలెక్టర్ కిరణ్మయి, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహ తో, రోహిత్ కేడియా, మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, నాయకులు పోచారం సురేందర్ రెడ్డి, బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులు బద్యానాయక్, ఆర్మూర్ ఆర్‌డివో రాజాగౌడ్, కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల స్వామి, కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ గంగాధర్, బీర్కూర్ మార్కెట్ కమిటి ఛైర్‌పర్సన్ దుర్గం శ్యామల, మాజీ మార్కెట్ కమిటి ఛైర్మన్ నార్ల సురేష్ గుప్తా, నాయకులు కృష్ణారెడ్డి, పిట్ల శ్రీధర్, ఎజాస్, వెంకన్న గుప్తా, తాటి రాము, అధ్యాపక బృందం, పూర్వవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వినియోగంలోకి సాదా బైనామా ప్రక్రియ

### కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నర్సాపూర్ జి :** జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో భూభారతి చట్టంపై అవగాహన సదస్సులు విస్తృతంగా కొనసాగుతున్నాయి.గురువారం నర్సాపూర్ జి మండల కేంద్రంలోని రైతు వేదికలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ ప్రజల భూ సమస్యలు సులువుగా పరిష్కరించేందుకు వీలుగా నూతన భూ భారతి చట్టం రూపొందించబడిందని తెలిపారు. గ్రా మాల్లో గ్రామ పాలన అధికారులను నియమించడం ద్వారా,ప్రజల భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు.ఎంతోమంది అనుభవజ్ఞులైన అధికారులు,భూ చట్టాల నిపుణులు,న్యాయ నిపుణులు రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను తెలుసుకొని, ఎన్నో రాష్ట్రాల భూ చట్టాలను పరిశీలించిన తర్వాత సమగ్ర భూభారతి చట్టాన్ని రూపొందించారని తెలిపారు.నూతన భారతి చట్టం అమలుతో తహసీల్దార్ స్థాయిలోనే ఎన్నో భూ సమస్యలు పరిష్కారం అవుతాయి అని అన్నారు.అన్ని బూ సమస్యల దరఖాస్తుల పరిష్కారానికి నిర్ణీత గడువును విధించారని తెలిపారు.సాదా బైనామా ప్రక్రియ తిరిగి వినియోగంలోని రాబోతుందని అన్నారు.భవిష్యత్తులో ఎటువంటి భూ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకై రైతుల పట్టాదారు పాసుపుస్తకం లో వారి భూములకు సంబంధించి వివరాలను మ్యాపింగ్ రూపంలో పొందుపరుస్తారన్నారు.ఈ సమావేశంలో భాగంగా రైతులు ఎదుర్కొంటున్న పలు భూ సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.భూభారతి చట్టం ద్వారా అన్ని భూ సమస్యల పరిష్కారం లభిస్తుందని వారికి హామీ ఇచ్చారు.ఈ భూభారతి అవగాహణ సదస్సులో అదనపు కలెక్టర్(రెవెన్యూ)కిషోర్ కుమార్ తహసిల్దార్ శ్రీనివాస్,ఎంపీడీవో పుష్పలత,మండల ప్రత్యేక అధికారి అంజి ప్రసాద్,రైతులు ఇతర అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# బిసిసిఐ అండర్-19కు హైదరాబాద్ బాలికలు




## అరుదైన స్థానాన్ని దక్కించుకున్న ఏడుగురు అమ్మాయిలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసిసిఐ నిర్వహించనున్న క్రికెట్ అండర్–19 ఎలైట్ శిబిరాలకు హైదరాబాద్ నగరానికి చెందిన ఆరుగురు అమ్మాయిలు స్థానం దక్కించుకున్నారు. ఒకే సారి హైదరాబాద్‌కు చెందిన ఏడుగురు అమ్మాయిలు జాతీయ స్థాయి క్రికెట్ జట్టుకు ఎంపిక కావటం ఇదే మొదటి సారి. హైదరాబాద్ నగరం గర్వించదగిన విషయం. ఎంపికైన వారిలో కె.నిధి, సంధ్య గోరా, కావ్యశ్రీ, జాస్మిన్ గిల్, పివి హంసకి, సిపి పార్వతి, ఈ.శృజన ఉన్నారు. క్రికెట్ ప్లేయర్లు త్వరలోనే జట్టుఏగా రాంచీలో జరగనున్న శిబిరంలో శిక్షణకు నిధి, సంధ్య, కావ్యశ్రీలు ఎంపిక కాగా, టీమ్ డీలో డెహ్రాడూన్‌లో నిర్వహించే శిక్షణకు హంసిక, పార్వతి, సృజన, టీమ్‌బీలో భాగంగా అహ్మదాబాద్‌లో నిర్వహించే శిక్షణ శిబిరానికి జాస్మిన్ గిల్ హైదరాబాద్ నుంచి బిసిసిఐ అండర్–19 క్రికెట్ శిక్షణ శిబిరాల్లో పాల్గొనున్నారు. ఆయా వేదికల్లో ఏప్రిల్ 25 నుంచి మే 21 వరకు శిక్షణ శిబిరాల్లో పాల్గొనున్నారు. శిక్షణ ముగిసిన తర్వాత ఈ యువ క్రీడాకారిణులు జాతీయ స్థాయి వేదికలపై తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారు.



# స్వార్థ రాజకీయాలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

వహించారు. అంతకుముందు కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతమీనన్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన విగ్రహం వద్ద జాతీయ సమితి సభ్యులు పుష్పాంజలి ఘటించారు. తిరువనంతపురంలో ఇటీవల పునర్నిర్మాణం చేసిన కేరళ సిపిఐ రాష్ట్ర కార్యాలయం ఎం.ఎన్.స్మారక భవన్‌లో సిపిఐ జాతీయ సమితి సమావేశం గురువారం ప్రారంభమయ్యాయి. సెప్టెంబర్ మాసంలో చండీగఢ్‌లో జరగనున్న సిపిఐ జాతీయ మహాసభకు సంబంధించిన ముసాయిదా రాజకీయ తీర్మానం, రాజకీయ పరిణామాల నివేదికలను సమావేశంలో రాజా ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మోదీ నాయకత్వాన బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను తీవ్రంగా విమర్శించారు. వక్ఫ్ సవరణ చట్టం ద్వారా మతపరమైన విభజన తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని, పార్టీ దానిని ఎదర్కొనటానికి సుప్రీం కోర్టులో కూడా కేసు వేసినట్లు వెల్లడించారు. ఇది రాజ్యాంగ వ్యతిరేకమైనదని, ఆర్టికల్ 14కు భిన్నంగా వచ్చిందని, ప్రాథమిక హక్కులకు కూడా భిన్నమైదని, అందుకే పార్టీ స్పష్టమైన వైఖరి తీసుకున్నదని వివరించారు. ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న పరిణామాలను ప్రస్తావించారు. సిపిఐ(ఎం) 24వ జాతీయ మహాసభ ప్రారంభసభకు హాజరయ్యానని, సానుకూల సంకేతాలు ఉన్నప్పటికీ, అనేక సవాళ్ళు ఉన్నాయని, వామపక్షాలను ప్రత్యామ్నాయంగా బలోపేతంగా చేసుకుంటే తప్ప ఇతర పార్టీలను ఆకర్షించలేమన్నారు. గుజరాత్ అహ్మదాబాద్‌లో జరిగిన ఎఐసిసి సమావేశాలను కూడా రాజా ప్రస్తావించారు. గాజా మారణకాండను తీవ్రంగా ఖండించారు. మే 27వ తేదీన కార్మిక వర్గ జాతీయ సమ్మెలో అన్ని వర్గాలు పాల్గొనేందుకు సిద్ధమవుతున్నాయని, బ్యాంకింగ్, మైనింగ్, ట్రాన్స్‌పోర్ట్, ఫైనాన్షియల్ రంగం తదితర సంఘాలు తమ సంసిద్ధతను వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. రాజకీయాలు, విధానాలను, పార్టీని ముందుకు తీసుకుపోవడానికి రానున్న కాలంలో పార్టీని బలోపేతం చేసుకుంటే తప్ప మరో మార్గం లేదని అని రాజా స్పష్టం చేశారు. కాగా, సమావేశంలో ప్రవేశపెట్టిన నివేదికలపై తొలిరోజు 19 రాష్ట్రాల ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు.



# రాష్ట్రంలో హై అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

వాహనాల తనిఖీలను కూడా ముమ్మరం చేశారు. రైల్వే పోలీసు ఫోర్స్‌తో పాటు విమానాశ్రయంలో సిఆర్‌పిఎఫ్ అదనపు బలగాలను రంగంలోకి దించారు. భారత్ సమ్మిట్, మిస్‌వరల్డ్–2025 ఈవెంట్లకు సంబంధించి హైటెక్ సిటీ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకున్నారు. ఈ ప్రాంతంలో విదేశీయుల సంఖ్య ఎక్కువగా ఉండడమే ప్రధాన కారణం. ముఖ్యంగా ఐటి కంపెనీల వద్ద కూడా భద్రతను పెంచారు. అలాగే ప్రయాణికుల బ్యాగ్‌లను మెటల్ డిటెక్టర్ల సహాయంతో పరిశీలిస్తున్నారు. అనుమానిత వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని డిజిపి జితేందర్ సూచించారు. రాష్ట్రంలో ఒకపక్క వక్ఫ్‌బోర్డుపై ఒక వర్గం ఆందోళనలు జరుగుతుండడం, మరోపక్క ములుగు జిల్లాలో కర్రెగుట్టల్లో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో వేలాది మంది పోలీసు బలగాలు చేరుకోవడంతో శాంతి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తుండడంపై రాష్ట్ర పోలీసులు దృష్టి సారించారు. వీటన్నిటి పరిణామాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాష్ట్ర పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ పాత బస్తీలో ర్యాపిడ్ యాక్షన్ బలగాలను రంగంలోకి దించారు

# జమ్ముకశ్మీర్‌లో ఉగ్రదాడి 'ఇంటెలిజెన్స్ వైఫల్యమే'

### శివసేన (యుబిటి) ధ్వజం
### ఆర్టికల్ 370 రద్దుతో లోయలో హింస అంతమైందా? అని కేంద్రానికి సూటి ప్రశ్న

**ముంబయ్ :** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన అత్యంత ఘోరమైన ఉగ్రదాడిని 'ఇంటెలిజెన్స్ వైఫల్యం' అని గురువారం శివసేన (యుబిటి) ఆరోపించింది. పాకిస్తాన్‌ను బెదిరించడం ద్వారా కేంద్రపాలిత ప్రాంతం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావని హితవు చెప్పింది. ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన తన అధికార పత్రిక 'సామ్నా' సంపాదకీయంలో పదునైన పదాలతో కేంద్రంపై దాడి చేశారు. పూర్వ రాష్ట్రానికి ప్రత్యే హోదాతోకూడిన ఆర్టికల్ 370 రద్దు చేయడం వల్ల లోయలో హింస అంతం కాలేదని, అక్కడ ఇప్పటికీ హిందువులు టార్గెట్ అవుతున్నారని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని వివాదాస్పద నిబంధనను 2019లో ఎత్తివేసిన తర్వాత భారతీయ జనతాపార్టీ (బిజెపి) రాజకీయ పండుగను జరుపుకున్నదన్నారు. కానీ హిందువులను దిక్కుతోచని స్థితిలోకి నెట్టివేశారని ప్రస్తుత ప్రతిపక్షపార్టీ ఒకప్పటి మిత్రపక్షంపై ఆరోపించింది. 2019 ఆగష్టు 5 నుంచి ఇప్పటివరకు 197మంది భద్రతా సిబ్బంది, 135 మంది పౌరులు, 700మంది ఉగ్రవాదులు జమ్ముకశ్మీర్‌లో హతమయ్యారని 'సామ్నా' సంపాదకీయం ఆరోపించింది. మంగళవారం జమ్ముకశ్మీర్‌లోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన పహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడిలో 26మందిని కాల్చిచంపారు. వీరిలో వివిధ రాష్ట్రాలకు చెందిన పర్యాటకులే అధిక సంఖ్యలో ఉన్నవిషయం తెలిసిందే. జేమ్స్‌బాండ్‌గా కీర్తిస్తున్న జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోవల్ ఎక్కడున్నాడని సామ్నా ప్రశ్నించింది. 2019లో పుల్వామా దాడి తర్వాత పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి ఇంటెలిజెన్స్ సంస్థల వైఫల్యం కాదా? 'అని సంపాదకీయం ఆశ్చర్యం వ్యక్తం చేసింది.




# 'అబీర్ గులాల్' సినిమా భారత్‌లో బ్యాన్

పాకిస్థాన్ నటుడు ఫవాద్ ఖాన్ హీరోగా నటించిన సినిమా 'అబీర్ గులాల్'. వాణీ కపూర్ హీరోయిన్. పాకిస్థాన్ నటుడి సినిమా కావడంతో.. ఈ మూవీ ప్రకటన వెలువడిన క్షణం నుంచే బాయ్‌కాట్ చేయాలంటూ నెట్టింట వ్యతిరేకత మొదలైంది. పహల్గాం ఉగ్రదాడి పరిణామాల నేపథ్యంలో ఈ సినిమాని బ్యాన్ చేస్తున్నట్టు అధికారిక వర్గాలు వెల్లడించినట్టు జాతీయ మీడియా పేర్కొంది. మే 9న విడుదల చేస్తున్నట్టు చిత్ర బృందం ప్రకటించిన సంగతి తెలిసిందే. మరో వైపు, యూట్యూబ్ (ఇండియా)లో ఈ సినిమా పాటలను తొలగించారు. ఈ విషయంపై మేకర్స్ స్పందించలేదు. ఉగ్రదాడిపై స్పందించకుండా.. అదే రోజు సోషల్ మీడియా వేదికగా సినిమాని ప్రమోట్ చేశారంటూ వాణీ కపూర్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. పాకిస్థాన్ నటులను ప్రోత్సహిస్తున్నారంటూ బాలీవుడ్ పైనా కొందరు ట్రోల్స్ చేస్తున్నారు. రొమాంటిక్ కామెడీ నేపథ్యంతో ఆర్తి ఎస్. బగ్దీ 'అబీర్ గులాల్'ను తెరకెక్కించారు












Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com